ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

గురువారం | 20-08- 2026 | సంపుటి: 17, సంచిక: 138, | నిజామాబాద్, | పేజీలు: 12, | వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



## రహదారుల అభివృద్ధితో

# ఉపాధి పరిశ్రమల వృద్ధి

- ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులు దృష్టి సారించాలి
- ఏడాదిలోపు పెద్దపల్లి బైపాస్ పూర్తి చేసేలా చర్యలు
- సుల్తానాబాద్ బైపాస్ మంజూరుకు కృషి చేస్తాం
- ఆర్అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి తుమ్మల
- పెద్దపల్లి అభివృద్ధికి మహర్దశ : మంత్రి శ్రీధర్‌బాబు
- రూ.180 కోట్లతో హెచ్ఏఎం రహదారుల పనులకు శ్రీకారం : ప్రభుత్వ విప్ విజయరమణారావు

## రహదారి అభివృద్ధి పనులకు రూ.1,700 కోట్ల మంజూరు



సుల్తానాబాద్,ఆగస్టు19:
(ప్రజాకలం జిల్లాప్రతినిధి)
రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని,రహదారుల అభివృద్ధితో పరిశ్రమలు,వ్యాపారాలు విస్తరించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.సుల్తానాబాద్ మండలం గరేపల్లిలో బుధవారం రూ.219 కోట్ల 67 లక్షల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్-హెచ్ఏఎం,నాన్‌ప్లాన్ రహదారి అభివృద్ధి పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు,ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తో కలిసి శంకుస్థాపన చేసారు.ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి ప్రజలు మంచి నాయకుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని,ఎమ్మెల్యే విజయరమణా రావు ఎల్లప్పుడూ పెద్దపల్లి అభివృద్ధి గురించే ఆలోచిస్తూ పనిచేస్తున్నారని ప్రశంసించారు.ప్రభుత్వం ఏర్పడిన నెలలోపే పెద్దపల్లి బైపాస్ రహదారికి నిధులు మంజూరు చేశామని, ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో రోడ్లు,భవనాల శాఖ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో రూ.17వేల కోట్లతో రహదారి పనులు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు.దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇంత భారీ మొత్తంలో రహదారి పనులు చేపట్టడం లేదన్నారు.హెచ్ఏఎం విధానంలో ప్రభుత్వం 40 శాతం,కాంట్రాక్టర్ 60 శాతం నిధులు భరించే విధంగా పనులు చేపడుతున్నామని,శంకుస్థాపన చేసిన రహదారి పనులను రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని తెలిపారు.పనులు వారం రోజుల్లోనే క్షేత్రస్థాయిలో ప్రారంభమవుతాయని చెప్పారు.రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని,ప్రమాదాల నివారణకు వాహనదారులు,ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. రహదారులు సంక్షేమ పథకాలతో సమానంగా అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు.గత ప్రభుత్వం సుమారు రూ.40 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వదిలి వెళ్లిందని మంత్రి అన్నారు.హైదరాబాద్ నుంచి రామగుండం వరకు కొత్త గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై కేంద్ర మంత్రితో చర్చలు జరిపామని, ప్రతిపాదిత రహదారిలో సుల్తానాబాద్ బైపాస్‌ను కూడా మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని,ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టును చేపడుతోందని అన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి సాగునీరు అందించడంతో రికార్డు స్థాయిలో సాగు నమోదైందని తెలిపారు.నెహ్రూ హయాంలో నిర్మించిన అనేక ప్రాజెక్టులు ఇప్పటికీ సురక్షితంగా ఉండి లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాయని పేర్కొన్నారు.

**ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**
**- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ప్రభుత్వ విప్ విజయరమణారావు విక్రమార్కుడిలా ప్రజలు,రైతుల కోసం నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తున్నారని, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు నాయకత్వంలో సమస్యలను పారదర్శకంగా పరిష్కరిస్తున్నామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన మంత్రి పదవిని త్యాగం చేసి ఉద్యమానికి మద్దతుగా నిలిచారని గుర్తు చేశారు.గత పది సంవత్సరాల పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం కఠిన పరిస్థితుల్లోనూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తుమ్మల అన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




## నాంపల్లి పోక్సో కోర్టు

# సంచలన తీర్పు



## 33 మంది దోషులకు శిక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రజాకలం) :**
నాంపల్లి పోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మైనర్లను వ్యభిచార రొంపిలోకి దింపుతున్న ముఠాకు చెందిన 33 మందిని దోషులుగా నిర్ధారించి, శిక్షలను ఖరారు చేసింది. 2015లో సీఐడీ నమోదు చేసిన పోక్సో కేసులో నాంపల్లి పోక్సో కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో మొత్తం తొమ్మిది మంది బాలికలను ముఠా సభ్యులు లక్ష్యంగా చేసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాలికలను ప్రలోభాలకు గురిచేసి, వ్యభిచారంలోకి దించినట్లు తేలింది. ప్రాసిక్యూషన్ ఆరోపణలను కోర్టు విచారణలో పరిశీలించింది. సుదీర్ఘకాలం కొనసాగిన ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం న్యాయస్థానం దోషులకు శిక్షలు విధించింది.

**ఐదుగురికి జీవిత ఖైదు..**
**బాధిత బాలికలకు రూ.5 లక్షల పరిహారం..**

తీర్పులో భాగంగా ఐదుగురు దోషులకు జీవిత ఖైదు విధించగా, మరో ముగ్గురికి 14 ఏళ్ల జైలు శిక్ష, 14 మందికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. మిగిలిన దోషులకు కూడా కేసులో వారి పాత్రను బట్టి న్యాయస్థానం శిక్షలు ఖరారు చేసింది. అంతేకాకుండా ఈ కేసులో బాధితులైన తొమ్మిది మంది బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. మైనర్ బాలికలను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడిన ముఠాపై కఠినంగా వ్యవహరించిన నాంపల్లి పోక్సో కోర్టు తీర్పు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## ఫిలిప్పీన్స్ లో ఇండియన్ ఎంబసీని

# సందర్శించిన ఎన్నారై అడ్వైజరీ కమిటీ

- మనీలాలో కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ అధికారులతోనూ భేటీ
- ఉత్తమ వలస విధానాలపై చర్చలు
- గల్ఫ్ కార్మికుల కోసం మెరుగైన వలస విధానాల కోసం కృషి చేస్తాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రజాకలం) :
తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వలస వెళ్లిన సుమారు 15 లక్షల మంది కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన వలస విధానాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ బృందం సభ్యులు బుధవారం ఫిలిప్పిన్స్ దేశ రాజధాని మనీలాలోని ఇండియన్ ఎంబసీని సందర్శించారు. ఆ తర్వాత మనీలాలోని కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ ఉన్నతాధికారులతోనూ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ వలస విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఫిలిప్పీన్స్ దేశ వలస విధానాన్ని ఆ దేశ ఉన్నత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీ సభ్యులకు వివరించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వలస విధానాన్ని అమలు చేస్తున్న ఫిలిప్పీన్స్ దేశంలో అమలులో ఉన్న విధి విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి ఇదే తరహా మెరుగైన వలస విధానాన్ని గల్ఫ్ కార్మికుల కోసం అమలు చేసేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి వెల్లడించారు. ఫిలిప్పిన్స్ దేశ రాజధాని మనీలాలో ఉన్న ఇండియన్ ఎంబసీ అంబసడర్ హర్ష కుమార్ జైన్, ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్ లతో వలస కార్మికుల విధానాల అంశాలపై కమిటీ సభ్యులు సుధీర్ఘంగా చర్చించారు. గల్ఫ్ కార్మికులను సంక్షేమం కోసం ఫిలిప్పీన్స్ తరహా విధానాలను అమలు చేస్తామన్నరాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఎన్నారై అడ్వైజరి కమిటీ ఫిలిప్పీన్స్ దేశంలో పర్యటిస్తోంది. ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బిఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, శ్రీనివాస్ జునుగురు, లైజన్ ఆఫీసర్ ఆది కార్తీక్, తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

## అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్ల స్థలం ఇస్తాం



- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పల్లెగూడెం సమగ్ర అభివృద్ధికి రూ.61.76 కోట్లు కేటాయించినట్లు వెల్లడి
-పల్లెగూడెం గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి

7

## దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది
ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
దివ్యాంగులకు ఉచితంగా త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్ళ పంపిణీ చేసిన మంత్రి

## ప్రతి రైతుకూ సకాలంలో

# రుణం అందాలి

- బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలి
- రుణంతో పాటు రైతు ఆదాయమూ పెరగాలి
- క్యూర్, ప్యూర్, రేర్ అనుగుణంగా బ్యాంకింగ్ వ్యూహాలు
- ఎస్ఎల్బీసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




హైదరాబాద్, ఆగస్టు 18 (ప్రజాకలం) :
తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో బ్యాంకింగ్, ఆర్థిక రంగం కీలక భాగస్వాములుగా మారాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కేవలం ప్రభుత్వ వ్యయంతో ఈ లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాదని, భారీ స్థాయిలో ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు, లోతైన ఆర్థిక మార్కెట్లు, వినూత్న నిధుల విధానాలు అవసరమని స్పష్టం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో జరిగిన 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 కేవలం విజన్ డాక్యుమెంట్ కాదు.. తెలంగాణ ప్రజలతో మనకున్న అభివృద్ధి ఒప్పందం. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలంటే బ్యాంకింగ్

తరువాయి 2వ పేజీలో...



## ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తాం

- రేవంత్, పొంగులేటికి రియల్ ఎస్టేట్ తెలిస్తే.. బీఆర్ఎస్ కు పోరాటాలు తెలుసు
- సీఎంకు తెలియకుండా 22ఏ జరగదు..
- సీఎం రేవంత్, పొంగులేటిపై హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు
- 30 ఏళ్లుగా లేని నిబంధనలు ఇప్పుడెందుకు?
- బకరాలకు భూములు అమ్మడే కాంగ్రెస్ నేతల పని

2

## ఉద్యోగులారా మీరు చేసే యుద్ధంలో

# మేమే ముందుంటాం

**- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



కరీంనగర్ ఆగస్టు 18 (ప్రజాకలం) : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రాఫర్లను సన్మానించిన కేంద్ర మంత్రిఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 27 నుండి ఉద్యోగ సంఘాల జేఏసీ చేపట్టిన పోరుబాటకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

తరువాయి 2వ పేజీలో...

# రహదారుల అభివృద్ధితో ఉపాధి పరిశ్రమల వృద్ధి

మొదటి పేజీ తరువాయి...

మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్,సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు.ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా పాఠశాలలు నిర్మిస్తున్నామని,ఆరోగ్యం, విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.ఇటీవల టీమ్స్ ఆసుపత్రులను ప్రారంభించడంతో పాటు విఫలమైన సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు.కేంద్ర ప్రభుత్వ సహకారం లేకున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గోదావరి,కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయమైన వాటా సాధించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు.రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగును విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభానికి మరో 6 వేల ఎకరాల సాగు అవసరమని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ,డ్రిప్,స్ప్రింక్లర్, రుణ మాఫీ వంటి కార్యక్రమాలకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించిందని,అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచడంతో పాటు రైతుల నుంచి పంటలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.మొక్కజొన్నను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు.

**పెద్దపల్లి అభివృద్ధికి మహర్దశ**
**-రూ.1,700 కోట్లతో రహదారుల నిర్మాణం**
**-ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

గత పది సంవత్సరాల్లో పెద్దపల్లి జిల్లాలో కేవలం రూ.900 కోట్ల విలువైన రహదారి పనులు మాత్రమే మంజూరయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.1,700 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరయ్యాయని ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ఈ అభివృద్ధి సాధ్యమైందన్నారు.ప్రభుత్వ విప్ విజయరమణారావు కృషితో పెద్దపల్లి బైపాస్ రహదారికి నిధులు మంజూరై పనులు జరుగుతున్నాయని తెలిపారు.కొత్త పోలీస్ స్టేషన్,అవసరమైన ప్రభుత్వ భవనాలు,తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు.రూ.1,700 కోట్ల రహదారి పనులతో రైతులు,వ్యాపారులు తమ ఉత్పత్తులను వేగంగా రవాణా చేసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లాలో రైస్‌మిల్లులు అధికంగా ఉన్నందున గోదాముల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు.గత రెండున్నర సంవత్సరాలుగా ఎలాంటి కోతలు లేకుండా రైతుల నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని,ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి సంవత్సరంలో 3,500 ఇళ్లు మంజూరు చేయగా,ప్రస్తుతం మరో 2 వేల ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో మహిళలకు అందించిన పావలా వడ్డీ రుణాల పథకాన్ని విస్మరించారని, ప్రస్తుత ప్రభుత్వం వడ్డీలేని రుణాల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. హైదరాబాద్–రామగుండం గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనలో సుల్తానాబాద్ బైపాస్‌ను చేర్చేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని చెప్పారు.

**రూ.180 కోట్లతో హెచ్‌ఏఎం రహదారుల పనులకు శ్రీకారం**
**-ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు**

గత రెండున్నర సంవత్సరాల్లో పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రుల సహకారంతో సుమారు రూ.180 కోట్ల విలువైన హెచ్‌ఏఎం రహదారి పనులకు శంకుస్థాపన చేశామని అన్నారు.జూలపల్లి మండల కేంద్రంలో రూ.15 కోట్లతో నాలుగు లేన్ల రహదారి,సెంట్రల్ లైటింగ్ పనులు,కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో రూ.7.35 కోట్లతో నాలుగు లేన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్ పనులు,గంగారం,ఉషన్నపల్లి,పాండిల్ల గ్రామాల్లో రూ.17 కోట్లతో సింగిల్ లేన్ రహదారులను డబుల్ లేన్‌గా విస్తరించే పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే పెద్దపల్లి బైపాస్ రహదారికి మంజూరు వచ్చినప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని,ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.82 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. భూసేకరణకు అవసరమైన మరో రూ.27 కోట్లను ముఖ్యమంత్రి సహకారంతో త్వరలో విడుదల చేయిస్తామని, ఏడాదిలోపు పెద్దపల్లి బైపాస్ రహదారిని పూర్తి చేసి ఆర్‌అండ్‌బీ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.సుల్తానాబాద్ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున బైపాస్ రహదారి అత్యవసరమని ప్రభుత్వ విప్ తెలిపారు.రాజీవ్ రహదారి పరిధిలో సుల్తానాబాద్ బైపాస్ నిర్మాణానికి అవకాశం ఉందని,భూసేకరణ పూర్తి చేయాల్సి ఉందన్నారు.సుల్తానాబాద్ బైపాస్ నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ,ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.పెద్దపల్లి నియోజకవర్గానికి కేంద్ర గ్రాంట్లు,నాన్‌ప్లాన్ నిధుల కింద అనేక రహదారులు మంజూరయ్యాయని విజయరమణారావు తెలిపారు.వ్యవసాయ శాఖ ద్వారా 40 వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని,11 పీఏసీఎస్‌ల సమన్వయంతో నాబార్డ్ రుణం ద్వారా మరో 15 వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణానికి అనుమతులు మంజూరై పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఒక్క పంట కాలంలోనే పెద్దపల్లి నియోజకవర్గం నుంచి 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం,40 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేశామని తెలిపారు.మొక్కజొన్న కొనుగోలు చేసి పది రోజుల్లోనే రైతులకు చెల్లింపులు చేశామని అన్నారు.మరో 60 వేల మెట్రిక్ టన్నుల గోదాముల సామర్థ్యం,5 వేల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్ మంజూరు చేయాలని, సుల్తానాబాద్‌లో కొత్త ఐబీ అతిథి గృహం నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేయాలని కోరారు.అనంతరం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గా నికి మరిన్ని హెచ్‌ఏఎం రహదారులు మంజూరు చేయాలని ఆర్‌అండ్‌బీ మంత్రిని కోరారు.హైదరాబాద్–రామగుండం రహదారి నిర్వహణ సక్రమంగా లేదని,ఈ రహదారిని విస్తరించడంతో పాటు అవసరమైతే కొత్త గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్,సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ రాధాకృష్ణ,పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, గోదావరిఖని డిప్యూటీ మేయర్ పారుపల్లి ఎల్లయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్లు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు,సంబంధిత అధికారులు,నాయకులు,మహిళలు, ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతుకూ సకాలంలో రుణం అందాలి

మొదటి పేజీ తరువాయి...

రంగం కూడా రూపాంతరం చెందాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ బ్యాంకింగ్ వ్యూహాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాలను ఎంతవరకు సాధించాయన్నదే కాకుండా, ఇచ్చిన రుణాలతో ఎంత అభివృద్ధి జరిగింది, ఎన్ని పరిశ్రమలు వచ్చాయి, ఎన్ని ఉద్యోగాలు సృష్టించబడ్డాయనే అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేసుకోవాలన్నారు. వ్యవసాయ ఉత్పాదకత ఎంత పెరిగింది, గ్రామీణ ఆదాయం ఎంత మెరుగుపడింది, ఎంత ప్రైవేట్ పెట్టుబడి సమీకరించబడింది అన్నదే బ్యాంకింగ్ పనితీరుకు నిజమైన కొలమానంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గ్రామీణ, వ్యవసాయ రంగం పునాది అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రైతులకు రుణాలు అవసరమయ్యే సమయంలోనే అందించాలని ఆయన చెప్పారు. అర్హత ఉన్న రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. రైతు రుణం కోసం బ్యాంకును వెతుక్కుంటూ రావడం కాదు.. బ్యాంకింగ్ వ్యవస్థే రైతుల వద్దకు వెళ్లాలని డిప్యూటీ సీఎం చెప్పారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ సహా ఇతర అనుబంధ రంగాలను అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావాలని అన్నారు. రైతుకు రుణం ఇవ్వడం మాత్రమే కాకుండా, ఆ రుణాన్ని అధిక, స్థిరమైన వ్యవసాయ ఆదాయంగా మార్చడమే లక్ష్యంగా ఉండాలని సూచించారు.

రైతు రుణాన్ని తిరిగి చెల్లించలేకపోతే కేవలం రికవరీ చర్యలకే పరిమితం కాకుండా, రైతు ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించాలని అన్నారు. ఉత్పాదకత, మార్కెట్ సదుపాయాలు, కోత అనంతర వసతులు, వర్కింగ్ క్యాపిటల్ వంటి అంశాలను రుణ వ్యూహంలో భాగం చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. జూన్ 2026 నాటికి బ్యాంకులు వ్యవసాయ రంగానికి 52,337 కోట్లు రుణాలుగా అందించడం అభినందనీయమే అయినప్పటికీ, రుణాలు సకాలంలో అందడం ముఖ్యమని ఆయన గుర్తుచేశారు.

తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా రంగం కీలకమని అన్నారు. రుణం మంజూరు కావడం కంటే అవసరమైన సమయంలో డబ్బు చేతికి అందడం వ్యాపారులకు ముఖ్యమని చెప్పారు. దరఖాస్తు, మంజూరు, పంపిణీ ప్రక్రియకు స్పష్టమైన, కొలవదగిన కాలపరిమితి ఉండాలని ఆదేశించారు. క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్‌కింద ఈ త్రైమాసికంలో రూ. 4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదం పొందడం అభినందనీయమన్నారు. జ+ుమీాజు కింద మంజూరు చేసే రుణాలకు పూచీకత్తు నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని ఆయన చెప్పారు.

తెలంగాణ రైజింగ్ 2047లోని క్యూర్, ప్యూర్, రేర్ విధానాలకు అనుగుణంగా ప్రాంతాల అవసరాలను బట్టి ప్రత్యేక రుణ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క అన్నారు. క్యూర్ లోాు×, లైఫ్ సైన్సెస్, ఫార్మా, ఏరోస్పేస్, స్టార్టప్‌లు, నాలెడ్జ్ రంగాలకు అధునాతన ఫైనాన్సింగ్ అవసరమని ఆయన తెలిపారు. ప్యూర్ ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్, పారిశ్రామిక క్లస్టర్లు, గృహ నిర్మాణం, మౌలిక వసతులకు నిధులు అవసరమన్నారు. రేర్ ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, డెయిరీ, ఫిషరీస్, గ్రామీణ పరిశ్రమలకు సకాలంలో, సరసమైన రుణాలు అందించాలని భట్టి విక్రమార్క సూచించారు.

రాష్ట్రంలో జనధన్ ఖాతాలు భారీగా ఉన్నప్పటికీ దాదాపు 19.13 లక్షల ఖాతాల్లో జీరో బ్యాలెన్స్ ఉందన్న విషయాన్ని గుర్తు ఆయన గుర్తు చేశారు. కేవలం ఖాతాలు తెరవడమే కాకుండా వారిని పొదుపు, బీమా, రుణాల దిశగా ప్రోత్సహించడమే నిజమైన ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో నిష్క్రియాత్మకంగా ఉన్న బిజినెస్ కరస్పాండెంట్లను వెంటనే క్రియాశీలకం చేయాలని లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రతి గ్రామానికి బ్యాంకింగ్ సేవలు అందేలా చూడాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా మహిళా స్వయం సహాయక సంఘాలను కేవలం బ్యాంక్ లింకేజీలకే పరిమితం చేయకుండా మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌గా తీర్చిదిద్దేలా 'ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్' అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులకు రావాల్సిన రీయింబర్స్‌మెంట్లు సమయానికి అందేలా చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇస్తూ, తెలంగాణ ప్రజల సమగ్ర వికాసానికి బ్యాంకింగ్ రంగం ప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగ్ 2047 బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్‌'ను రూపొందించాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. వ్యవసాయ, ఉత్పాదకత ఆధారిత రుణాలు, మీాపీజులు–స్టార్టప్ ఫైనాన్స్, మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ పరిశ్రమలు, యువత ఉపాధి ఆధారిత రుణాలు, గ్రీన్–క్లైమేట్ ఫైనాన్స్, డిజిటల్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్, జిల్లాల మధ్య క్రెడిట్ వ్యత్యాసాల నివారణ, దీర్ఘకాలిక మౌలిక వసతుల ఫైనాన్స్, కొత్త పరిశ్రమలు–సాంకేతిక రంగాలకు సంబంధించిన అంశాలకు ఇందులో స్పష్టమైన వార్షిక లక్ష్యాలు ఉండాలని అన్నారు.

ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈఓ దివ్య, నాబార్డ్ సీజీఎం చిన్మయ్ కుమార్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది, ఎస్ఎల్బీసీ కన్వీనర్ సతీష్ కుమార్, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, డీఎఫ్ఎస్ డైరెక్టర్ మానస గంగోత్రి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగులారా మీరు చేసే యుద్ధంలో మేమే ముందుంటాం

మొదటి పేజీ తరువాయి...

ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేసే యుద్ధంలో బీజేపీ సైనికులే ముందుండి పోరాడేందుకు సిద్ధమన్నారు. ఈ యుద్ధంలో మీ కంటే ముందు మేమే ఉంటాం. పోలీసులు లాఠీఛార్జ్ చేస్తే ఆ దెబ్బలు మేమే తింటాం. తూటాలు పేలిస్తే ఆ తూటాలకు మేమే బలయ్యేందుకు సిద్ధం అని భరోసా ఇచ్చారు. జేఏసీలో ఒకరిద్దరు నాయకులు ప్రభుత్వానికి అమ్ముడుపోయి ఉద్యమాన్ని వాయిదా వేయడం పరిపాటిగా మారిందని, అట్లాంటి వాళ్లను ఇకపై జేఏసీలో కొనసాగించవద్దని కోరారు. గత రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం, అంతకుముందు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. ఈరోజు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ లోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లను ఘనంగా సన్మానించారు. సమాజానికి ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తదితరులతో కలిసి ఉద్యోగుల జేఏసీ పోరుబాటుకు మద్దతుగా మాట్లాడారు. కరీంనగర్ డెయిరీ విషయంలో రాజకీయ కోణంలో చూడొద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నా. సాఫీగా సాగుతున్న కరీంనగర్ డెయిరీ ని దెబ్బతీసి వాళ్ల ఆస్తులపై కన్నేయడం సరికాదు. లక్షలాది మంది రైతులకు మేలు చేసే సంస్థ. కక్ష సాధింపు చర్యలు సరికాదు.

ఏదో ఒక పేరుతో బాగా నడిచే కరీంనగర్ డెయిరీని అప్రదిష్టపాల్జేసి రైతులకు అన్యాయం చేయాలని చూడటం దుర్మార్గం. ఒక వ్యక్తిని లక్ష్యం చేసుకుని వ్యవస్థను దెబ్బతీయడం దారణం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ప్రత్యేకంగా ఈ డెయిరీపై ద్రుష్టి పెట్టాలి. న్యాయం చేయాలి. ప్రభుత్వం పక్షాన సాయం చేయకపోయినా ఫరవాలేదు దయచేసి అన్యాయం చేయొద్దని కోరుతున్నా.

# 22/ఎ సమస్యకు ఫాస్ట్ ట్రాక్ పరిష్కారం

**ప్రతి కేసును వేగంగా పరిష్కరించాలి - ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి**

**అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం - మాభూమి మాకు దక్కింది ఈ ప్రభుత్వానికి కృతజ్ఞతలు -22 ఏ దరఖాస్తుదారులు**

హైదరాబాద్, ఆగస్టు 19 (ప్రజాకలం) :

22/ఎ నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న గందరగోళానికి త్వరితగతిన తెరదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ విధానంలో చర్యలు చేపట్టిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 22/ఎ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతోనే రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి ఎలాంటి జాప్యం లేకుండా న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి 22/ఎ అంశంపై ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్లు సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షించారు.



అనంతరం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ. 22/ఎ జాబితాలో భూమి ఉందనే కారణంతో మాత్రమే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయడం లేదా తిరస్కరించడం చేయవద్దని ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. సంబంధిత భూమి 22/ఎ నిషేధిత జాబితాలోకి ఎందుకు వచ్చింది? అందుకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ప్రస్తుతం భూమి వాస్తవ పరిస్థితి ఏమిటి? హక్కుదారుడి వద్ద ఉన్న పత్రాలు ఏమిటి? గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలు ఏమిటి? వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేని వాటికి రిజిస్ట్రేషన్ ఎందుకు సాధ్యం కాదో దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని, నిబంధనల ప్రకారం ముందుగా చెల్లించిన రిజిస్ట్రేషన్ ఫీజును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

22/ఎభూముల విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు, ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను కూడా పరిరక్షిస్తూ, ప్రతి కేసును చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

**"నా భూమి నాకు దక్కిం ది.. -ప్రభుత్వానికి కృతజ్ఞతలు"**

22/ఎ సమస్యను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తున్న ప్రభుత్వ చర్యలకు ప్రత్యక్షంగా లబ్ధి పొందిన పోచారం గ్రామానికి చెందిన రాకేష్ తన అనుభవాన్ని వెల్లడించారు.

"నేను 2022లో పోచారం గ్రామంలో వంద గజాల స్థలం కొనుగోలు చేశాను. ఇటీవల ఆ స్థలాన్ని విక్రయించేందుకు నార్లపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాను. మొదట డాక్యుమెంట్ రైటర్‌ను సంప్రదించగా, మీ భూమి22/ఎ లో ఉందని చెప్పారు. దీంతో కొంత ఆందోళనకు గురయ్యాను. అయితే మూడు, నాలుగు రోజుల క్రితం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఫోన్ చేసి మీ భూమికి ఎలాంటి సమస్య లేదని తెలిపారు. ఈ రోజు నేను ఆ స్థలాన్ని కొనుగోలుదారుడికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ చేశాను. నా భూమి నాకు దక్కేలా సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారికి కృతజ్ఞతలు" అని తెలిపారు.

**" క్లియరెన్స్ వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్లు ప్రారంభించాం"**

నారపల్లి సబ్ రిజిస్ట్రార్ సునీల్ మాట్లాడుతూ.. పోచారం గ్రామంలోని సర్వే నంబర్ 50ను ఏపీ హౌసింగ్ బోర్డు భూమిగా పేర్కొంటూ గత ఏడాది డిసెంబర్‌లో22/ఎ జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని తెలిపారు. ఇటీవల కలెక్టర్ నుంచి క్లియరెన్స్ వచ్చింది. వెంటనే గతంలో రిజిస్ట్రేషన్ కోసం మమ్మల్ని సంప్రదించిన వారికి ఫోన్ చేసి సమాచారం అందిస్తున్నాం. వారు కార్యాలయానికి వచ్చిన వెంటనే నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తున్నాం" అని సబ్ రిజిస్ట్రార్ సునీల్ తెలిపారు.

**మా సొసైటీలోని 300 ప్లాట్లకు పూర్తి విముక్తి కలిగింది– చక్రపాణి (కొనుగోలుదారు)**

కూకట్‌పల్లి అడ్డగుట్ట సొసైటీలోని నెంబర్ 80సిలోగల 250 గజాల స్థలాన్ని నెలరోజుల క్రితం కొనుగోలు చేశాను. అయితే రిజిస్ట్రేషన్ కోసం కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే ఆభూమి 22ఎ నిషేధిత జాబితాలో ఉందని రిజిస్ట్రేషన్ చేయలేదు. తాజాగా ప్రభుత్వ చర్యల కారణంగా నిన్ననే నాకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. ఈ రోజు వెళ్లగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. అంతేగాక మా సొసైటీలోని 300 ప్లాట్లను నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు చెప్పారు. మాకు చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు– అని చక్రపాణి అనే కొనుగోలుదారు తెలిపారు.

**ప్రభుత్వ సకాల చర్యల వల్ల రిజిస్ట్రేషన్ పూర్తయింది– రాజేంద్రప్రసాద్**

బాలా నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని మూసాపేట్‌లో గల రెయిన్‌బో విస్టాలో ఉన్నప్లాట్ నెంబర్ 804 ను విక్రయించేందుకు కొద్దికాలం క్రితం యజమాని వెంకట విజయ్‌కుమార్ ప్రయత్నించారు. అయితే 22ఎ నిషేధిత జాబితాలో ఉన్నందున రిజిస్ట్రేషన్ జరగలేదు. వెంకట విజయ్‌కుమార్ ఆస్ట్రేలియా వెళ్లిపోతూ తన మామ రాజేంద్రప్రసాద్‌కు పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారు. ఈనెల 12న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సమాచారం రావడంతో ఈరోజు రాజేంద్రప్రసాద్ వెళ్లి రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ ఏమన్నారంటే...

మా అల్లుడు సేల్ చేద్దామనుకున్న ఫ్లాట్ రిజిస్ట్రేషన్ కోసం వస్తే... 22ఎ కింద గవర్నమెంట్ నిషేధం విధించిందని చెప్పినందున ఆ రోజు రిజిస్ట్రేషన్ అవ్వలేదు. ఆ తర్వాత నా అల్లుడు నా పేరు మీద స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చారు. అది ఇంకా చాలా కాలమే పడుతుందేమో అనుకున్నాం గానీ... అదృష్టవశాత్తూ ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకున్నందున వెంటనే ఒక వారం రోజుల్లోనే ఇది క్లియర్ అయ్యి... అనుకూలంగా తేలింది. ఈ రోజు రిజిస్ట్రేషన్ కోసం వచ్చాం, రిజిస్ట్రేషన్ కూడా మాకు సంతృప్తి కరంగా పూర్తిగా అవుతుంది. ప్రభుత్వానికి చాలా కృతజ్ఞతలు. – ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ పూర్తి – శ్రీనివాస్

# ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తాం

**రేవంత్, పొంగులేటికి రియల్ ఎస్టేట్ తెలిస్తే.. బీఆర్ఎస్ కు పోరాటాలు తెలుసు**

**సీఎంకు తెలియకుండా 22ఏ జరగదు - సీఎం రేవంత్, పొంగులేటిపై హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు**

**30 ఏళ్లుగా లేని నిబంధనలు ఇప్పుడెందుకు?- బకరాలకు భూములు అమ్మడే కాంగ్రెస్ నేతల పని**

హైదరాబాద్, ఆగస్టు 19 (ప్రజాకలం) :

ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించే బాధ్యత తాము తీసుకుంటామని మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ భవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో హామీ ఇచ్చారు. 30, 40 ఏళ్లుగా లేని సమస్య ఇప్పుడు ఎందుకు వస్తోందన్నారు. ఏళ్లుగా లేని నిబంధనలు ఇప్పుడు ఎందుకు పెట్టారు? అని ప్రశ్నించారు. 22ఏ బాధితులకు అండగా ఉంటామన్నారు. రేవంత్ రెడ్డి, పొంగులేటికి రియల్ ఎస్టేట్ బాగా తెలిస్తే.. బీఆర్ఎస్ నేతలకు పోరాటాలు తెలుసని హరీశ్ రావు స్పష్టం చేశారు. సమస్యను పరిష్కరిస్తారా?.. ప్రజల కాళ్ల కింద నలిగిపోతారా? అని ప్రశ్నించారు. ఒక్క ఎకరా కూడా 22ఏ లో పెట్టలేదని 10 రోజుల క్రితం పొంగులేటి చెప్పారు. ఇప్పుడు అధికారులు తప్పు చేశారని అంటున్నారని ఆరోపించారు. నిషేధిత జాబితా గురించి 4 నెలల క్రితమే సీఎం రేవంత్ రెడ్డికి చెప్పానని మంత్రి కోమటి రెడ్డి చెప్పారని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి చెప్పినప్పుడే సీఎం రేవంత్ ఎందుకు స్పందించలేదు? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, పొంగు లేటికి తెలిసే జరిగిందని స్పష్టంగా అర్థం అవుతోందని పేర్కొన్నారు. కోట్లాది ఆస్తులను పనంగాపెట్టే ధైర్యం అధికారులకు ఉంటుందా?, చీటికి మాటికి విచారణలు చేసే రేవంత్ రెడ్డి దీనిపై ఎందుకు స్పందించడం లేదు? ప్రశ్నించారు. యాదాద్రి జిల్లాలో నిషేధిత జాబితాలో 40 వేల ఎకరాలు ఉన్నాయని తెలిపారు.

**మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధం లేకపోతే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బర్తరఫ్ చేయాలని హరీశ్ రావు డిమాండ్



చేశారు. 22ఏలో ఏయే భూములు పెట్టారో వాటిని తొలగిస్తే సరిపోతుందన్నారు. నిషేధిత జాబితాలో పెట్టిన భూములను తక్షణమే రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు అమ్ముకుంటున్నారు.. ఇప్పుడు ప్రజల భూములపై పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎకరాల్లో కొని గజాల్లో బకరాలకు భూములు అమ్మడమే కాంగ్రెస్ నేతల పని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హరీశ్ రావు హెచ్చరించారు.

## కాశీబాగ్ హనుమాన్ మందిరంలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 19 (ప్రజా కలం)

పట్టణంలోని 16వ వార్డులో గల పురాతన కాశీబాగ్ హనుమాన్ మందిరంలో నీటి కొరతను తీర్చేందుకు వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నో సంవత్సరాలుగా ఆలయానికి వచ్చే భక్తులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించేందుకు 16వ వార్డు కౌన్సిలర్ అరిసె వనజ మురళి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ మేరకు మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ అరిసె వనజ మురళి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తానని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, సముద్రాల భానుమూర్తి, దొంతుల పవన్, గట్టయ్య, అవధూత అంజయ్య, జక్కం బాబు, పసునూరి శ్రీనివాస్, ఆలయ అర్చకులు సురేందర్‌తో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మెట్‌పల్లిలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**- కెమెరా సృష్టికర్త లూయిస్ డాగెర్‌కు ఘన నివాళులు**

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 19 (ప్రజా కలం) జగిత్యాల జిల్లా మెట్‌పల్లి కెమెరా క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు కెమెరా సృష్టికర్త లూయిస్ డాగెర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఫోటోగ్రాఫర్లు సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కెమెరా క్లబ్ అసోసియేషన్ అధ్యక్షులు రాజారపు గంగారాజం, ఉపాధ్యక్షులు అజారుద్దీన్, ప్రధాన కార్యదర్శి శ్రీపరంబుధురి శ్రీధర్, కోశాధికారి చిలువేరి మహేష్‌తో పాటు ఫోటోగ్రాఫర్లు ముదాం శ్రీనివాస్, ప్రసాద్, సాయి, రమేశ్, దత్తు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

**తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు చందన**




రుద్రంగి, ఆగష్టు 19, (ప్రజాకలం ప్రతినిధి)

విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపెల్లి చందన పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి ప్రభుత్వ పాఠశాలలో రోల్ మోడల్ విత్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మర్రిపెల్లి చందన హాజరై విద్యార్థులతో ఇన్‌స్పైర్ కార్యక్రమాన్ని నిర్వహించి, తన పాఠశాల విద్యా జ్ఞాపకాలను, అప్పటి గురువులు నేర్పిన విలువలను గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండి నారాయణ, ఎంఈఓ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు సమ్మిరెడ్డి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కవిత, కోఆర్డినేటర్ సతీష్, రిటైర్డ్ ప్రధానోపధ్యాయులు మర్రిపెల్లి అంతయ్య నాయకులు గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్‌ఎస్‌లో చేరిన కాయితి శ్యామ్

**- గుమ్లాపూర్ గ్రామానికి చెందిన యూత్ సభ్యులు సైతం చేరిక**
**- కండువాలు కప్పి ఆహ్వానించిన డాక్టర్ రఘు**



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 19 (ప్రజాకలం): బీఎస్పీ కోరుట్ల మండల మాజీ అధ్యక్షుడు కాయితి శ్యామ్ బుధవారం తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్)లో చేరారు. కోరుట్లలోని టీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ రఘు ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా గుమ్లాపూర్ గ్రామానికి చెందిన యువత మంచాల కృష్ణ, బోయిని నవీన్, సృంగారపు గణేశ్, బోయిని శేఖర్, బొడ్డు కళ్యాణ్, బర్రె మహేశ్, జంగ్లి రక్షిత్, ఎట్టెం మహేశ్, వన్నెల పరమేశ్, పవన్, బోయిని మధు తదితరులు టీఆర్‌ఎస్‌లో చేరారు. వారందరికీ డాక్టర్ రఘు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ భారీగా జరుగుతున్న చేరికలతో టీఆర్‌ఎస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంతో పాటు కోరుట్ల నియోజకవర్గంలోనూ టీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.




## మెట్‌పల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సీసీఈ, జేడీలు ప్రశంస



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 19 (ప్రజా కలం)

జగిత్యాల జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలు అందించినందుకు మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేంకయ్యకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కార్యాలయ జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ డి.ఎస్.ఆర్. రాజేందర్ సింగ్, ప్రొఫెసర్ పి. బాల భాస్కర్‌లు ప్రిన్సిపాల్ వేంకయ్యను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాలలో సమయపాలన పాటించడం, సిబ్బంది సహకారంతో అడ్మిషన్ల కోసం వివిధ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించడం, విద్యార్థులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించడం, ప్రభుత్వ పథకాల అమలుకు ప్రాధాన్యత ఇవ్వడం, ఉన్నతాధికారులకు ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించడం వంటి అంశాలకు ప్రిన్సిపాల్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని జాయింట్ డైరెక్టర్లు పేర్కొన్నారు. ఈ సేవలకు గుర్తింపుగానే మంత్రి అజారుద్దీన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం లభించిందని వారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. తనకు లభించిన ప్రశంసా పత్రం కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సమష్టి కృషి ఫలితమేనని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్‌లోనూ ఇదే విధంగా సహాయ సహకారాలు అందించాలని ఆకాంక్షించారు.

## యువత సమాజ మార్పునకు నడుం బిగించాలి

- బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష
- స్వేరోస్ జ్ఞాన సమ్మేళనంను విజయవంతం చేయండి
- చలో గంగాధర బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ



పెద్దపల్లి, ఆగస్టు 19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) యువత తమ భవిష్యత్తును తమ చేతుల్లోనే కలిగి ఉందని, కేవలం చదువుకే పరిమితం కాకుండా నైపుణ్యాలను పెంపొందించుకుంటూ సంపూర్ణ ఐక్యతతో ముందుకు సాగాలని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహ వేదికగా ఈ నెల 30న ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే హలో స్వేరో-చలో గంగాధర జ్ఞాన సమ్మేళనం వాల్ పోస్టర్‌ను దాసరి ఉష పలువురు స్వేరోస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ సమాజాన్ని సరైన మార్గంలో నడిపించడంలో యువత పాత్ర అత్యంత కీలకమని ఆమె అభిప్రాయపడ్డారు. దేశంలో లేదా సమాజంలో మార్పు రావాలంటే ప్రధానంగా అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే మూడు రంగాలు బలోపేతం కావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ మూడింటిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని, చైతన్యవంతమైన సమాజ స్థాపనకు కృషి చేయాలని కోరారు. ఈ నెల 30న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండల కేంద్రంలో ఈ మహాసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జ్ఞాన సమ్మేళన సభలో స్వేరోస్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆమె వెల్లడించారు. ఈ బహిరంగ సభకు జిల్లాలోని వివిధ గ్రామాలకు లకు చెందిన విద్యార్థులు, యువజన సంఘాలు, శ్రేయోభిలాసులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని దాసరి ఉష విజ్ఞప్తి చేశారు. సభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

**లేకుంటే ఆందోళన ఉధృతం - ఉపాధ్యాయ సంఘాల హెచ్చరిక**



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 19 (ప్రజాకలం): పీఆర్సీని వెంటనే ప్రకటించడంతో పాటు బకాయి ఉన్న ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం కోరుట్ల డివిజన్ కేంద్రంలో నిర్వహించిన పాఠశాల కాంప్లెక్స్ సమావేశంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జీఓ నంబర్ 25ను సవరించాలని డిమాండ్ చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, సమగ్ర శిక్షా ఉపాధ్యాయులు, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. పీఆర్సీని ప్రకటించకపోతే హైదరాబాద్‌లో భారీ స్థాయిలో మహాధర్నా నిర్వహించి, అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తిరుకోవెల శ్యామ్‌సుందర్, నునావత్ రాజు, గంగుల రణధీర్, గట్ల సంతోశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వడ్లకొండ గంగాధర్, పరంకుషం వెంకట ప్రసాద్, గడ్డల శ్రీధర్, అంకం దామోదర్, సిరిపోరం రాజేశ్, కల్వకోట వెంకట స్వర్ణలత, మాసం చిరంజీవి, రావికంటి పవన్, జీవన్‌రెడ్డి, మామిడిపల్లి రాధ, ఆశారాణి, సుష్మాలత, స్రవంతి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి:

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**
**- జగిత్యాల జిల్లాలో 40,683 మ్యాపింగ్ కాని ఓటర్లు**
**- 1,75,488 అనామలీస్ కేసులు..**
**- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**

జగిత్యాల్ ప్రతినిధి ఆగస్టు 19 (ప్రజాకలం)

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించారు. జగిత్యాల సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. సత్య ప్రసాద్ పాల్గొన్నారు. ఆగస్టు 17న విడుదలైన డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, జాబితా వివరాలను వారికి తెలియజేయాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చే క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ కేసులను పరిశీలించి సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, ఓటర్లు తమ వివరణలు, సంబంధిత పత్రాలను సమర్పించేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రతి దశను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు.

జిల్లాలో 40,683 మ్యాపింగ్ కాని ఓటర్లు.



జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో 40,683 మంది మ్యాపింగ్ కాని ఓటర్లు, 1,75,488 అనామలీస్ గుర్తించినట్లు తెలిపారు. మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ గుర్తించిన వారికి నోటీసులు జారీ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు.

ఆగస్టు 17న విడుదలైన డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారి నుంచి వచ్చే క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరిస్తామని తెలిపారు. ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా జిల్లాలో అన్ని చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు హక్కును పరిరక్షించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్. లత, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి కాసిపేట గురుకులంలో కౌన్సిల్ ఎలక్షన్




బెల్లంపల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 19(ప్రజా కలం) మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో, కళాశాలలో బుధవారం కౌన్సిల్ ఎలక్షన్ నిర్వహించినట్లుగా ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రజాస్వామ్య ప్రక్రియ, ఓటు హక్కు విలువ తెలియడానికి రహస్య బ్యాలెట్ పద్ధతిలో కౌన్సిల్ ఎలక్షన్ నిర్వహించినట్టుగా తెలిపారు. ప్రెసిడెంట్ గా సాయిచరణ్, చైతన్య,రంజిత్, వైస్ ప్రెసిడెంట్ గా యక్షిత్,రాకేష్ పోటీలో ఉన్నారు. ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా టి .సురేందర్ ,అసిస్టెంట్ ప్రీసైడింగ్ ఆఫీసర్ శ్రీధర్, పోలింగ్ ఆఫీసర్ గా పి .నరేందర్,జి.దివ్య పర్యవేక్షించారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ పత్రాలను సీల్ చేశారు. కౌంటింగ్ అనంతరం విజేతలను ప్రకటిస్తామన్నారు.

## తడి-పొడి చెత్తపై అవగాహన

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 19 (ప్రజాకలం) ఇంటి వద్దనే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి అందించడంపై బుధవారం మున్సిపల్ ఆధ్వర్యంలో అవగాహన




కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ ఇంటి నుంచే తడి, పొడి, హజార్డస్, ఈ-వేస్ట్ చెత్తను వేరు చేయడం ప్రారంభించాలని సూచించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నేను శ్రద్ధ తీసుకుంటాను, నేను ఆచరిస్తాను, ఇతరులకు స్ఫూర్తినిస్తాను అనే భావనతో ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు చుట్టుపక్కల మరో నాలుగు ఇళ్లలోనూ తడి-పొడి చెత్త వేరు చేయడం, పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు.

కార్యక్రమంలో కౌన్సిలర్ నునుగొండ నరేశ్, జిల్లా స్థాయి ఘన వ్యర్థాల నిర్వహణ నిపుణులు మణికంఠ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేశ్ నాయక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, వార్డు ఆఫీసర్ రమ్య, ముజీబ్, సీఓ జ్యోతి, శరణ్య, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. నా ఇల్లు, నా బాధ్యత. నా నాలుగు ఇళ్లు, నా బాధ్యత అందరం కలిసి చేతులు కలిపితే పరిశుభ్రమైన సమాజాన్ని నిర్మిద్దాం అని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## కమ్మరి ఖాన్ పేట గ్రామం లో ఉచితంగా ఛాతి ఎక్స్-రే పరీక్షలు

**- మేడారం ప్రభుత్వ హసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో**



ధర్మారం, ఆగస్టు 19 : ( ప్రజా కలం ప్రతినిధి ) మండలంలోని కమ్మరిఖాన్ పేట గ్రామం లో బుధవారం రోజున మేడారం ప్రభుత్వ హసుపత్రి వైద్యుల ఆధ్వర్యం లో ఉచితంగా (చెస్ట్) చాతి ఎక్స్-రే ప్రోగ్రాం పరీక్షలు నిర్వహించడం జరిగింది. దగ్గు, జలుబు, అస్తమా, బీపీ, షుగర్ వంటి సమస్యలు ఉన్నవారు మరియు మిగతా గ్రామ ప్రజలు 14 సంవత్సరాల పై బడిన వారు ఉచితంగా చెస్ట్ ఎక్స్-రే పరీక్షలు చేయించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ ఇరుగు రాల మహేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఉచితంగా ఈ పరీక్షలు చేసుకోవాలని ప్రతి ఒక్కరు ఈ అవ కాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు. ఈ ప్రోగ్రామ్ లో సూపర్ వైజర్ పల్లె దవాఖాన సిబ్బంది ఎం.ఎల్.హెచ్.పి, ఏఎన్ఎం, టెక్నిషియన్, ఆశా వర్కర్లు, గ్రామ ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శస్త్ర చికిత్సతో 8 కిలోల ఓవేరియన్ సిస్ట్ తొలగింపు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్ట్ 19 (ప్రజాకలం) శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఓ మహిళకు ఏర్పడిన సుమారు 8 కిలోల భారీ ఓవేరియన్ సిస్ట్‌ను వైద్యులు శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా తొలగించారు. వైద్య పరీక్షల అనంతరం సిస్ట్ పెద్ద పరిమాణంలో ఉన్నట్లు గుర్తించిన వైద్యులు శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. డాక్టర్ పి. రవి, ఎం.ఎస్., జనరల్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ ఆధ్వర్యంలో శస్త్రచికిత్స నిర్వహించి సుమారు 8 కిలోల బరువున్న సిస్ట్‌ను తొలగించారు.





శస్త్రచికిత్స అనంతరం రోగిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి అవసరమైన చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపారు. వైద్య బృందం సమన్వయంతో క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు వెల్లడించారు.

ప్రజా కలం
గురువారం, ఆగస్టు 20, 2026

# ఐదేళ్లలో దశాబ్దాల అభివృద్ధి

దేశ ప్రధాని నరేంద్ర మోడీ జాతిని ప్రధానంగా సప్త ధార గురించి ప్రస్తావించారు. గతాని కంటే భిన్నంగా ఈసారి మోడీ తక్కువ సమయం మాట్లాడినప్పటికీ.. అసలైన విషయాల గురించి ప్రస్తావించారు. గతంలో కరోనా సమయంలో దేశ ప్రధాని ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారు. అంతకుముందు మేకింగ్ ఇండియా కార్యక్రమాన్ని అమలులోకు తీసుకొచ్చారుగతంలో కరోనా సమయంలో దేశ ప్రధాని ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించారు. అంతకుముందు మేకింగ్ ఇండియా కార్యక్రమాన్ని అమలులోకు తీసుకొచ్చారు. ఇప్పుడు ఏకంగా సప్త ధారను ప్రకటించారు. దీని ప్రకారం భారత దేశంలో తయారీ పరిశ్రమ వేగవంతం కానుందిని నరేంద్ర మోడీ ప్రకటించారు. తయారీ రంగం.. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ రంగం.. ఏఐ డీప్ టెక్.. డిఫెన్స్.. కనెక్టివిటీ.. గ్రీన్ బ్లూ ఎకానమీ విస్తరణ.. సాఫ్ట్ పవర్ సెక్టార్ల మీద ప్రధానంగా దృష్టి సారించబోతున్నట్లు ప్రకటించారు. గ్లోబల్ కాంపిటీషన్ తట్టుకునే విధంగా భారతదేశానికి ఈ పాలసీ అత్యంత కీలకమవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.చైనా తయారీ రంగంలో.. అమెరికా ఏఐ డీప్ టెక్ లో.. ఇజ్రాయిల్ డిఫెన్స్ లో.. రష్యా కనెక్టివిటీలో.. యూరప్ దేశాలు గ్రీన్ బ్లూ ఎకానమిలో అద్భుతాలు సాధిస్తున్నాయి. అయితే ఈ రంగాలు మొత్తం భారతదేశంలో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంది. ఎందుకంటే ప్రపంచంలోనే అత్యధిక జనాభా భారత దేశంలో ఉంది. పైగా యువశక్తి కూడా ఈ దేశానికి ప్రధాన బలం. అందువల్లే ఈ స్థాయిలో భారత్ ఈ రంగాల మీద దృష్టి పెట్టింది.సప్త ధారలో భాగంగా దశాబ్దాలుగా సాధించాలని అభివృద్ధిని దీని ద్వారా కేవలం ఐదు నుంచి ఏడు సంవత్సరాల లోనే చేసి చూపించవచ్చని నరేంద్ర మోడీ చెబుతున్నారు. ప్రకృతి, తీర ప్రాంతాల వనరుల మీద పెట్టుబడులు పెట్టడం ద్వారా గ్రీన్ బ్లూ ఎకానమీ ని డెవలప్ చేయడానికి ఆస్కారం ఉంటుంది. సాఫ్ట్ పవర్ లో భాగంగా.. భారతదేశ సంస్కృతిని.. సంప్రదాయాలను.. యోగ.. ఆయుర్వేదం.. యునాని వంటి వైద్య విధాలను విస్తరించి.. భారత బ్రాండ్ మొత్తాన్ని ప్రపంచానికి చాటి చెప్పవచ్చు. తయారీ రంగం.. వ్యవసాయం.. టెక్నాలజీ.. రోడ్ల అనుసంధానం.. డిఫెన్స్ వంటి రంగాలలో భారీగా ఉపాధి అవకాశాలు.. పెట్టుబడులు పెట్టడం ద్వారా.. ఎక్కువ అభివృద్ధి సాధించడానికి ఆస్కారం ఉంటుంది. ఎందుకంటే ఈ రంగాలలో భారతదేశంలో విపరీతమైన అవకాశాలు ఉన్నాయి. పైగా వీటి ఎగుమతులను ఇతర దేశాలకు పంపించడానికి ఆస్కారం ఉంది. అందువల్లే సప్త ధారలో నరేంద్ర మోడీ ఈ రంగాలను పదే పదే ప్రస్తావించారు. భవిష్యత్తు కాలంలో వీటి ఆధారంగానే ప్రపంచ మనుగడ సాగుతుంది. అందువల్లే వీటి మీద నరేంద్ర మోడీ దృష్టిపెట్టి.. తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు.ప్రపంచం మొత్తం ప్రస్తుతం టెక్నాలజీలో దూసుకుపోతోంది. టెక్నాలజీ రంగంలో పెట్టుబడులు పెట్టిన దేశాలు పండగ చేసుకుంటున్నాయి. టెక్నాలజీ ముందుకు నడవాలంటే ఖచ్చితంగా సెమీ కండక్టర్లు ఇప్పుడు చాలా అవసరం. సెమీ కండక్టర్లకు సంబంధించి ప్రపంచ అవసరాలను తైవాన్ తీరుస్తోంది. దక్షిణ కొరియాకు కూడా ఇందులో భాగముంది. అయితే ఇప్పుడు సెమీ కండక్టర్ల తయారీలో భారత్ కూడా ప్రగతిని సాధిస్తుంది. వచ్చే రోజుల్లో సొంతంగా వీటిని తయారు చేసుకోవాలని నిర్ణయించుకుంది. అందువల్ల నరేంద్ర మోడీ తన సప్త ధార కార్యక్రమంలో టెక్నాలజీకి పెద్దపీట వేశారు. ఇక సముద్ర తీర ప్రాంతాలలో పర్యటకానికి ఎక్కువగా ఆస్కారం ఉంటుంది.మాల్దీవులు వంటి దేశం ఆర్థికంగా ఒకప్పుడు బలంగా ఉందంటే దానికి ప్రధాన కారణం తీర ప్రాంత పర్యాటకమే. మనదేశంలో తీర ప్రాంత రాష్ట్రాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. వాటిలో ఇప్పటికీ అనుకున్న స్థాయిలో టూరిజం అభివృద్ధి కాలేదు. ఆ ప్రాంతాలలో పెట్టుబడులు పెట్టి.. టూరిజం డెవలప్ చేస్తే అవకాశాలు పెరుగుతాయి. విదేశీ మారకద్రవ్యం కూడా అధికంగా వస్తుంది. ఈసారి ప్రసంగంలో పాకిస్తాన్ పేరును ప్రధాని మోదీ ఒక్కసారి కూడా ప్రస్తావించలేదు. ఇక చైనా ప్రస్తావన కూడా తీసుకురాలేదు. మన సరిహద్దు ఉగ్రవాదం, సీమాంతర ఉగ్రవాదం గురించి మాట్లాడలేదు. కశ్మీర్ అంశం లేకుండా జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం 1998 తర్వాత ఇదే అని చెప్పుకోవచ్చు. ఇది యాదృచ్ఛికం కాదు. పొరుగు దేశాలు తమ పరిధిలోనే ఉన్నాయని, దుస్సాహసానికి అవకాశం లేదని పరోక్షంగా ప్రపంచానికి తెలియజేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్‌పై ప్రభావం, చైనా వైపు కూడా జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సరిహద్దు ఉగ్రవాదం గణనీయంగా తగ్గిందని, కశ్మీర్ ప్రశాంతంగా ఉందని మోదీ పరోక్షంగా కశ్మీర్, సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రస్తావిచలేదు.ఇక మోదీ ప్రసంగానికి విరుద్ధంగా ఉంది పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రసంగం. పాకిస్తాన్ వైపు నుంచి రా, పీవోకే అల్లర్లు, బలూచిస్తాన్ దాడులు, సింధూ జలాలపై నిందలు భారత్‌పై వేస్తున్నారు. భారత నామస్మరణ లేకుండా పాకిస్తాన్ నేతలు మాట్లాడడం లేదు. భారత్ మాత్రం ఆ దేశం పేరు కూడా ఎత్తకుండా ఉండటం మన నమ్మకానికి నిదర్శనం. ఎదురుపక్షం ఎంత మాట్లాడినా, భారత్ ఆ విషయాలను పట్టించుకోవడం లేదనే సందేశం అగ్నివీర్‌లను ఈ ప్రక్రియలో ఉపయోగించుకునే అవకాశం ఉందని అనుకోవచ్చు. సైన్యంలో శిక్షణ, క్రమశిక్షణ పొంది గ్రామాలకు తిరిగి వచ్చిన వారు సివిల్ డిఫెన్స్‌లో కీలక పాత్ర పోషించగలరు. ఇజ్రాయెల్ తరహాలో సివిలియన్ స్థాయిలో భద్రతా సామర్థ్యం పెంచుకునే దిశగా అడుగులు పడుతున్నాయని చెప్పవచ్చు.రాబోయే ఐదు నుంచి ఏడు ఏళ్లలో గత 50 ఏళ్లలో చేయనంత అభివృద్ధి సాధించాలని ప్రధాని పిలుపునిచ్చారు. సైన్యం, ఆయుధాల తయారీపై కూడా ప్రస్తావన ఉంది. అయితే బాహ్య ముప్పుల కంటే అంతర్గత భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇది పరిస్థితులు మారాయని, భారత్ తన శక్తిని అంతర్గతంగా, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసుకోవాలని సూచించే వ్యూహాత్మక మార్పు. పొరుగు దేశాలను పట్టించుకోకుండా ఉండటం అంటే వాటిని పూర్తిగా విస్మరించడం కాదు. వాటి ప్రభావం తగ్గిందని, ఇప్పుడు దృష్టి లోపలికి మళ్లించాలని చెప్పే తీరు. అదే సమయంలో కొత్త రకం ముప్పులకు సిద్ధం కావాలని హెచ్చరిక కూడా.మొత్తంగా చూస్తే, 2026 ఎర్రకోట ప్రసంగం కేవలం వేడుక కాదు. భారత్ ఎదుర్కొంటున్న కొత్త వాస్తవాల్లను, ప్రాధాన్యాలను ప్రతిబింబించే వ్యూహాత్మక ప్రకటన. మౌనం కూడా ఒక రకమైన భాషే. ఈసారి ఆ భాషే ఎక్కువగా మాట్లాడింది. టెక్నాలజీ.. వ్యవసాయం.. రోడ్ల అనుసంధానం వంటి వాటిల్లో భారీగా పెట్టుబడులు గనుక పెరిగితే అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు అవుతాయి. వాటి ద్వారా ఉత్పత్తులు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తే భారీగా విదేశీ మారకద్రవ్యం వస్తుంది. తద్వారా దేశం ఆర్థికంగా బలోపేతం కావడానికి ఆస్కారం ఏర్పడుతుంది.ప్రధాని మోదీ చెప్పినట్లు, ఇప్పటి వరకు దశాబ్దాలు పట్టిన అభివృద్ధిని ఈ సప్తధార వ్యూహం ద్వారా 5 నుంచి 7 సంవత్సరాల్లోనే సాధించవచ్చని అంచనా. ఎందుకంటే ఈ ఏడు రంగాలు ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయి. ఏఐ, డీప్‌టెక్ తయారీ, వ్యవసాయం, డిఫెన్స్‌లో సామర్థ్యం పెంచుతుంది. కనెక్టివిటీ గ్రీన్, బ్లూ ఎకానమీ, ఫుడ్ ప్రాసెసింగ్‌కు మార్కెట్లను తెరుస్తుంది. సాఫ్ట్ పవర్ భారత ఉత్పత్తులు, సేవలకు ప్రపంచ ఆమోదం పెంచుతుంది. ప్రపంచ మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి ఒక రంగంపై ఆధారపడితే సరిపోదు.

# రూ.21 లక్షల విలువైన ఫోన్ల రికవరీ

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగింత - సి ఈ ఐ ఆర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 19 (ప్రజాకలం) మొబైల్ ఫోన్ పోయినా, చోరీకి గురైనా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కేంద్ర ప్రభుత్వ పోర్టల్ ద్వారా ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం ఉందని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పరిధిలో పోయిన, చోరీకి గురైన 102 మొబైల్ ఫోన్లను, సుమారు రూ. 21 లక్షల విలువైన ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన గుర్తించి రికవరీ చేయడంలో ఞఞ.ఎవఅతీ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వినియోగదారులు తమ మొబైల్ వివరాలను పోర్టల్‌లో నమోదు చేసుకుంటే ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.పోయిన సెల్‌ఫోన్ల రికవరీ కోసం ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఒక హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2,024 మొబైల్ ఫోన్లను, సుమారు రూ. 4.5 కోట్ల విలువైన ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించినట్లు ఎస్పీ వెల్లడించారు. మొబైల్ ఫోన్ పోయినప్పుడు నిర్లక్ష్యం చేయడం వల్ల అందులోని వ్యక్తిగత సమాచారం దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందని, ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు ముప్పుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. చోరీకి గురైన ఫోన్లను నేరాలకు ఉపయోగించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ వెంటనే పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్ కొనుగోలు చేసే ముందు దాని ఐ ఎం ఈ ఐ నంబర్‌ను సి ఈ ఐ ఆర్ పోర్టల్‌లో పరిశీలించి ఫోన్ స్టేటస్‌ను తెలుసుకోవాలని సూచించారు.ఎవరికైనా పోయిన మొబైల్ ఫోన్ దొరికితే సమీప పోలీస్ స్టేషన్‌లో అప్పగించడంతో పాటు, సాధ్యమైతే ఫోన్ యజమానికి సమాచారం అందించాలని కోరారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్, సి ఈ ఐ ఆర్ బృందాన్ని ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

**సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి : జగిత్యాల జిల్లా ఎస్పీ**

పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ప్రజలను మోసం చేసి డబ్బులు దోచుకుంటున్నారని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఫేక్ ఫోన్ కాల్స్‌కు స్పందించకుండా ఉండటం మంచిదని, అంతర్జాతీయ కాల్స్ లేదా కొత్త నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అజ్ఞాత వ్యక్తులకు ఎలాంటి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను వెల్లడించవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు తమ అనుభవాలను వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తమ ఫోన్లను గుర్తించి తిరిగి అందించినందుకు జిల్లా ఎస్పీకి, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఎస్ఐ కృష్ణ,టీమ్ హెడ్ కానిస్టేబుల్ మహుముద్, కానిస్టేబుళ్లు మల్లేశం, అజర్, అనూశ, ప్రశాంత్ పాల్గొన్నారు.

# మంథనిలో అభివృద్ధి జోరు

## రూ.800 కోట్లతో ప్రగతి పరుగులు - మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి




మంథని,ఆగస్టు19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

మంథని నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తోందని, గత రెండున్నరేళ్లలో సుమారు రూ. 800 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామని, ఈ పనులను 18 నెలల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మంథనిలోని గంగాపురి వద్ద రూ. 20 కోట్లతో ఎన్ఏసీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుతో పాటు మంథని–రామగుండం,మాన్‌పూర్–మంథని నాలుగు లేన్ల రహదారుల విస్తరణ మరియు అంతర్గత బీటీ, సీసీ రోడ్ల పనులకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు,పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ బుధవారం శంకుస్థాపన చేశారని, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టిన ఈ రహదారి నిర్మాణ పనులన్నింటినీ కచ్చితంగా 18 నెలల్లో పూర్తి చేసేలా ప్రతి 15 రోజులకు ఒకసారి ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని మంత్రులు స్పష్టం చేశారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో నాలుగు మండలాల అర్హులైన లబ్ధిదారులకు రేషన్ స్మార్ట్ కార్డులు,కళ్యాణలక్ష్మి,సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం అందజేశారు.వ్యవసాయ రంగంలో రైతులు సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు మరియు ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లాలని ఈ సందర్భంగా మంత్రులు పిలుపునిచ్చారు.

అనంతరం మంత్రులు వైకుంఠ రథాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్,మంథని మున్సిపల్ చైర్మన్ వి. శ్రీనివాస్,వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి,రామగుండం మేయర్ ఎం. స్వామి,డిప్యూటీ మేయర్ పారుపల్లి ఎల్లయ్య,విద్యుత్ శాఖ సలహాదారు కాచే శశిభూషణ్,ప్రజాప్రతినిధులు,సంబంధిత అధికారులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# రహదారికోసం భూములు కోల్పోతే బతకడం ఎట్లా?

## అధికారులతో ఆందోళన వ్యక్తం చేసిన పాసిగామ గ్రామస్తులు




వెల్గటూర్, ఆగస్టు 19, ప్రజాకలం, ప్రతినిధి : కోటిలింగాల పుష్కరాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం మండలంలోని పాసిగామ బస్టాండ్ వద్ద నుంచి కోటిలింగాల శివారు వరకు రహదారిని వెడల్పు చేసేందుకోసం మా భూములను తీసుకుంటే వ్యవసాయం పై ఆదారపడి జీవించే మేము బ్రతకడం ఎట్లా అని పాసిగామ రైతులు అధికారులతో ఆందోళన వ్యక్తం చేశారు. గత పుష్కారాల సమయం లో వేసిన రహదారిని డబుల్ రోడ్డు చేసేందుకు కోసం ప్రభుత్వం నిధులను మాజూరు చేసింది. ఈమేరకు బుధవారం పీఆర్ డీఈ, ఏఈ, తహసీల్దార్ శేఖర్ లు రహదారి వెడల్పు కోసం అవసమైన స్థల పరిశీలన కోసం వెళ్లారు. విషయం తెలుసుకున్న పాసిగామ గ్రామస్తులు అక్కడకు చేరుకొని వారి పరిస్థితిని అధికారులకు వివరించారు. గత పుష్కరాల సమయంలో ఇక్కడి నుంచి రహదారిని వేయగా, రహదారి పక్కన గల రైతులు కొంత భూమిని కోల్పోయారని తెలిపారు. రాబోయే పుష్కరాల కోసం డబుల్ రోడ్డు వేసేందుకు కోసం మాకున్న కొద్దిపాటి భూమిని కోల్పోతె మా పరిస్థితి ఏంటని అడిగారు. బంధం నుంచి కోటిలింగాల కూడలి వరకు గతంలో రహదారి ఉండెనని ఆ రహదారిని అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువస్తే అందరికి లాభం జరుతుందని తెలిపారు. రహదారి వెడల్పు చేసెందు కోసం తమ భూములను ఇవ్వడానికి అసలే ఒప్పుకునేది లేదని తేల్చి చెప్పారు.

# జాగృతి మండల సమైక్య వార్షిక మహాసభ



మెట్ పల్లి రూరల్, ఆగస్టు 19;(ప్రజా కలం);జాగృతి మండల సమైక్య ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో వార్షిక మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి మండలంలోని గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) మాట్లాడుతూ.. గ్రామ సంఘాల అభివృద్ధికి సమష్టి కృషి ఎంతో



అవసరమని అన్నారు. ముఖ్యంగా 26 ఏ–గ్రేడ్ గ్రామ సంఘాలు తమ సంఘాల ఆర్థిక బలోపేతం కోసం ఫామ్ ఫండ్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. సభ్యుల భాగస్వామ్యంతో నిధులను సమకూర్చుకొని, వాటిని సంఘాల అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు.గ్రామ సంఘాల ద్వారా మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి అవకాశాలు, పొదుపు అలవాట్లు మరింత బలోపేతం కావాలని ఎంపీడీవో పేర్కొన్నారు. సంఘాల కార్యకలాపాల్లో పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణ, సమన్వయంపాటించాలని సూచించారు.అదేవిధంగా కార్యక్రమంలో నాయకత్వ లక్షణాల అభివృద్ధి కోసం లీడర్‌షిప్ కోచింగ్‌నిర్వహించారు. నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించుకొని గ్రామ సంఘాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే విధానాలపై సభ్యులకు శిక్షణ ఇచ్చారు. సంఘాల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని నిర్వాహకులు తెలిపారు. ఈ మహాసభలో గ్రామ సంఘాల పనితీరు, భవిష్యత్ కార్యాచరణ, నిధుల సమీకరణ, సంఘాల బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సిబ్బంది సహకరించారు.

# వరంగల్ మెడికవర్ హాస్పిటల్ లో క్యాన్సర్ పై అవగాహన




## – ముందస్తు గుర్తింపునకు స్క్రీనింగ్ సేవలు

హనుమకొండ ఆగస్టు 19 ప్రజా కలం ప్రతినిధి

క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడం,వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం,సకాలంలో సరైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వరంగల్ మెడికవర్ హాస్పిటల్ లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహించింది.

ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని,ఈ క్యాంప్‌లో ప్రముఖ క్యాన్సర్ నిపుణులు పాల్గొని ప్రజలకు అవసరమైన వైద్య సలహాలు,క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు మరియు వ్యాధి నివారణకు సంబంధించిన అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా. వేణుగోపాల్ కన్సల్టెంట్ సీనియర్ మెడికల్ ఆంకాలజీ ఉ హెమటో ఆంకాలజీ,మాట్లాడుతూ ..క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా చికిత్స ఫలితాలు మెరుగ్గా ఉండటమే కాకుండా,పూర్తిస్థాయిలో కోలుకునే అవకాశాలు కూడా పెరుగుతాయని తెలిపారు.క్యాన్సర్‌కు సంబంధించిన అనుమానాస్పద లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.అనంతరం డా.ప్రశాంత్ రెడ్డి సీనియర్ రేడియేషన్ ఆంకాలజిస్ట్, మాట్లాడుతూ.. క్యాన్సర్ చికిత్సలో రేడియేషన్ థెరపీ కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి రోగి వ్యాధి దశ,ఆరోగ్య పరిస్థితి మరియు అవసరాలను బట్టి వ్యక్తిగతీకరించిన చికిత్సా విధానాన్ని ఎంపిక చేస్తామని చెప్పారు.ముందస్తు గుర్తింపు ద్వారా చికిత్సను త్వరగా ప్రారంభించి మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.క్యాన్సర్ ప్రారంభ దశలో చాలాసార్లు స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చని తెలిపారు. అందువల్ల లక్షణాలు కనిపించే వరకు వేచి ఉండకుండా,వయస్సు,ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం అత్యంత ముఖ్యమని సూచించారు.వరంగల్ మెడికవర్ హాస్పిటల్లో నిర్వహించిన ఈ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు అవగాహన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు.ఇప్పటివరకు 100కు పైగా ఈ సేవలను విజయవంతంగా అందించడం జరిగింది. మరింత మంది ప్రజలకు నాణ్యమైన క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు మరియు నిపుణుల వైద్య సలహాలను అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.ఈ సందర్భంగా సెంటర్ హెడ్ సంపత్ గండ్ల మాట్లాడుతూ.. "క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం ద్వారా చికిత్సను సకాలంలో ప్రారంభించి ప్రాణాలను కాపాడుకోవచ్చు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి.ప్రతి బుధవారం నిర్వహిస్తున్న ఈ ఉచిత క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ హెడ్ కిషోర్ బాబు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన వాహనాల బహిరంగ వేలం



పెద్దపల్లి,ఆగస్టు19:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో సీజ్ చేసి,రాష్ట్ర ప్రభుత్వానికి జప్తు చేసిన ఐదు వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు ఆగస్టు 20నఉదయం 11గంటలకు బండారికుంటలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఈ బహిరంగ వేలం నిర్వహించబడుతుంది.ఈ వేలంలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు అదే రోజు ఉదయం 09 గంటల నుండి 10గంటల మధ్య ధరావత్తు సొమ్మును డిపాజిట్ చేసి రసీదు పొందవలసి ఉంటుందని పేర్కొన్నారు.ఆ తర్వాత ఉదయం11గంటలకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సమక్షంలో వేలం ప్రక్రియ కొనసాగుతుందని, వేలానికి సంబంధించిన మరిన్ని పూర్తి వివరాల కోసం కార్యాలయ పని వేళల్లో పెద్దపల్లిలోని ఆబ్కారీ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో సంప్రదించవచ్చని ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు ప్రకటనలో పేర్కొన్నారు.

## భూముల సమస్య శాశ్వత పరిష్కారానికే రీ సర్వే

### - కమాన్‌పూర్ తహసీల్దార్ వాసంతి



పెద్దపల్లి,ఆగస్టు19:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) భూముల్లో ఎలాంటి అవకతవకలు ఉన్నా రీ సర్వే ద్వారా యథావిధిగా సరిదిద్దుకోవడం జరుగుతుంది.ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి, అని కమాన్‌పూర్ తహసీల్దార్ ముస్త్యాల వాసంతి అన్నారు.పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం నాగారం గ్రామంలో గ్రామ సర్పంచ్ పొనగంటి కుమార్ అధ్యక్షతన బుధవారం భూభారతి -రీ సర్వే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ వాసంతి,ఏడీ సోమేశ్వర్ మాట్లాడుతూ నాగారం గ్రామంలోని గ్రామకంఠం భూములు,చెరువు శిఖం భూములు,రోడ్లు,డ్రైనేజీ భూములు,ఇండ్ల స్థలాలు,వ్యవసాయ భూములు,ఇలా అన్ని రకాల భూములను సమగ్రంగా రీ సర్వే చేసి హద్దులు నిర్ణయించి ఇస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ స్రవంతి,జీపీఓ జ్యోతి,ఉప సర్పంచ్ శ్రీనివాస్,పాలకమండలి సభ్యులు,వివిధ శాఖల అధికారులు,గ్రామ రైతులు,ప్రజలు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో ఘనంగా ఫోటోగ్రఫీ డే వేడుకలు

మల్లాపూర్, ఆగస్టు 19 ( ప్రజా కలం ప్రతి నిధి )

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్లాపూర్ మండల ఫోటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటో గ్రాఫీ పితామహుడు లూయిస్ డాగ్యుర్ చిత్ర పటానికి నివాళులు అర్పించి ఫోటో వీడియో గ్రాఫర్స్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురికి స్వీట్స్ పంపించి చేశారు. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్స్ మండల అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు అశోక్, కార్యదర్శి మోహన్, క్యాషియర్ నవీన్, సభ్యులు రాజేందర్, ప్రశాంత్, తిరుపతి, లక్ష్మీనారాయణ, రఘు, శివ, మహేష్, శ్రీనివాస్, మల్లేష్, వెంకటస్వామి, రాజు, మధుకర్, నాగరాజు, రాజేష్, తదితరులు ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఫోటోగ్రఫీ రంగంలో పనిచేస్తున్న ఫోటోగ్రాఫర్ల సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.

## జిజ్ఞాస రాష్ట్రస్థాయి పోటీలకు సీకేఎం కళాశాల విద్యార్థులు ఎంపిక

వరంగల్ ఆగస్టు 19 ప్రజా కలం ప్రతినిధి విద్యార్థుల్లో కేవలం పుస్తక పరిజ్ఞానమే కాకుండా పరిశోధనా దృక్పథం,సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న 'జిజ్ఞాస--2025-26' రాష్ట్రస్థాయి స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ పోటీలు హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి.రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 5,200 మంది విద్యార్థులకు చెందిన 850 ప్రతిభావంతమైన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయి.ఈ పోటీలు గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని రూసా రీసెర్చ్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. ఈ పోటీలకు వరంగల్ నగరంలోని సీకేఎం కళాశాల విద్యార్థులు ఎంపిక కావడం విశేషం.కళాశాల ప్రాజెక్ట్ సూపర్‌వైజర్, అసోసియేట్ ప్రొఫెసర్ విజయ్ పాల్ రెడ్డి నేతృత్వంలో రూపొందించిన 'కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆఫ్ సీకేఎం కాలేజ్' ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రాజెక్ట్‌లో కూచన మృదుల (బీఎస్సీ కంప్యూటర్ సైన్స్), జె. నందిని (బీఎస్సీ బీజెడ్సీ), బి. లక్ష్మి (బీఎస్సీ బీజెడ్సీ), ఉమాదేవి (బీఎస్సీ బీజెడ్సీ) పాల్గొన్నారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోచయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ పి. సతీష్, లైబ్రేరియన్ అనిల్, ఆయేషా, వసుధ,జ్ఞానేశ్వర్ పాషా తదితర అధ్యాపకుల బృందం శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోచయ్య మాట్లాడుతూ.. సీకేఎం కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం కళాశాలతో పాటు వరంగల్ జిల్లాకు కూడా గర్వకారణమని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు ఆత్మవిశ్వాసం,మనోధైర్యంతో పాల్గొని ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయిలో సీకేఎం కళాశాలతో పాటు ఓరుగల్లు ఖ్యాతిని చాటాలని విద్యార్థులకు సూచించారు.



## పాలిటెక్నిక్ పరిరక్షణకు కృషి చేస్తా : ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ ఆగస్టు 19 ప్రజా కలం ప్రతినిధి

జీవో 97 ఉన్న అపోహలను నివృత్తి చేయాలని ఉన్నతాధికారులను కోరుతానని,పాలిటెక్నిక్ కళాశాలల పరిరక్షణకు తాను ఎల్లవేళలా కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల



సంఘం అధ్యక్షులు ఇ.వి.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు,ఉద్యోగులు హనుమకొండ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ను కలిసి వినతిపత్రం అందించారు.పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో కలపడం వలన స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం వలన పాలిటెక్నిక్ వ్యవస్థకు నష్టం జరుగనుందని ఎమ్మెల్యేకి వివరించారు.జీవో 97 రద్దు చేయాలని,శక్తి శాఖలో విలీనంచేసి స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి పాలిటెక్నిక్ వ్యవస్థను చేర్చడాన్ని ఆపేలా చూడాలని, తద్వారా పాలిటెక్నిక్ విద్య మరియు భూములు ప్రైవేటీకరణ జరుగకుండా కాపాడాలని జీవో 97 గురించి స్పష్టమైన విధివిధానాలు తెలుసుకుం టానని, పాలిటెక్నిక్ కళాశాలలకు మేలు చేయడానికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాలిటెక్నిక్ ప్రతినిధుల బృందం సభ్యులకు తెలిపారు.తాను ఎమ్మెల్యే గెలిచిన వెంటనే 28 కోట్లు ప్రభుత్వం నుండి కేటాయింపజేసి 70ఏళ్ళ పాలిటెక్నిక్ కళాశాల భవన పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేసానని,ఎప్పటికప్పుడు పనుల పురోగతిని సమీక్షిస్తూ శరవేగంగా పనులు పూర్తిచేయిస్తున్నానని, పాలిటెక్నిక్ అభివృద్ధికి తాను ఎళ్ళవేళలా సహకరిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఇ.వి. శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్,ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి సతీష్ రెడ్డి,ఇమ్మడి శ్రీనివాస్,ఈసీ మెంబర్ దొడ్డిపల్లి కుమార్,కళాశాల విద్యార్థులు రాజేందర్,విఘ్నేశ్వర్, రోషిణి,అద్నాన్,కారుణ్యశివ, రోహిత్, భానుప్రకాశ్,ఉద్యోగులు శ్రీనాథ్,సర్వేష్,రజితాదేవి, శాంతరాజ్,సంపత్,స్రవంతి, అరుణక్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటాలి

### - ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్

నాగర్‌కర్నూల్ ఆగస్టు 19 ప్రజా కలం: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని పట్టుదల క్రమశిక్షణతో చదివి ఉద్యోగాల్లో విజయం సాధించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సూచించారు. బుధవారం నాడు జిల్లా గ్రంథాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులతో కలెక్టర్ మాట్లాడి వారి చదువు ప్రణాళిక రోజువారీ అధ్యయన సమయం ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఆరా తీశారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు స్టడీ మెటీరియల్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న జనరల్ స్టడీస్ జనరల్ నాలెడ్జ్ చరిత్ర భూగోళశాస్త్రం రాజ్యాంగం ఆర్థిక వ్యవస్థ విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకునేందుకు ప్రతిరోజూ దినపత్రికలు చదవాలని సూచించారు. తెలుగు ఇంగ్లిష్ హిందీ ఉర్దూ దినపత్రికలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డిజిటల్ గ్రంథాలయ సేవలు ఆన్‌లైన్ అధ్యయన వనరులను వినియోగించుకో వాలని సోషల్ మీడియాతో సమయం వృథా చేయకుండా సాంకేతికతను లక్ష్య సాధనకు ఉపయోగించుకోవాలని



యువతకు హితవు పలికారు. నిర్దిష్ట ఉద్యోగాన్ని లక్ష్యంగా పెట్టుకుని అందుకు అనుగుణంగా సిలబస్, పరీక్ష విధానం గత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయాలని సూచించారు. క్రమశిక్షణతో నిరంతర సాధన చేయడంతో పాటు మాక్ టెస్టులు, పునశ్చరణకు ప్రాధాన్యత ఇస్తే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి యువతలోనూ అపారమైన ప్రతిభ దాగి ఉందని, దానిని సరైన దిశలో వినియోగించుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు అంతేకాకుండా యువతకు అవసరమైన పుస్తకాల సమాచారం వనరులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు

## ఆళ్లపల్లి మండల బీఎల్ఓలను అభినందించిన డిప్యూటీ తహశీల్దార్ భద్రు నాయక్



ఆళ్లపల్లి, ఆగస్టు 19, ప్రజాకలం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన సమగ్ర ఓటరు జాబితా - సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన బూత్ లెవల్ అధికారుల సేవలను ఆళ్లపల్లి మండల డిప్యూటీ తహసిల్దార్ బద్రు నాయక్ గుర్తించి బుధవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి బీఎల్ఓలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్ బాదావత్ భద్రు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, బీఎల్ఓలకు పట్టు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి అభినందనలు తెలిపారు జూన్ 25 నుంచి 30 రోజుల పాటు జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికి తిరిగి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా రవాణా సౌకర్యాలు సరిగా లేని మారుమూల ఏజెన్సీ, గిరిజన గ్రామాలలో బీఎల్ఓలు అంకితభావంతో విధులు నిర్వహించారని డిప్యూటీ తహసీల్దార్ భద్రు నాయక్ ప్రశంసించారు ఎండ, వర్షాన్ని కూడా లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో ఎదురైన సమస్యలను అధిగమిస్తూ నూటికి నూరు శాతం లక్ష్యాన్ని సాధించడం గర్వకారణమన్నారు

బీఎల్ఓల సమిష్టి కృషి ఫలితంగా ఆళ్లపల్లి మండలం సర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసి జిల్లా స్థాయిలో 4వ స్థానంలో నిలిచింది. ఇది యావత్ మండల ప్రజలకే గర్వకారణమని ఆయన పేర్కొన్నారు ఓటరు జాబితా అనేది ప్రజాస్వామ్యానికి మూలం. పారదర్శకమైన, దోషరహిత ఓటరు జాబితా తయారీలో మీ పాత్ర కీలకం. భవిష్యత్‌లో జరిగే ఎన్నికల సంబంధిత కార్యక్రమాలను కూడా ఇదే ఉత్సాహంతో, బాధ్యతతో పూర్తి చేయాలని" బీఎల్ఓలకు సూచించారు ఈ సన్మాన కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ జబ్బ ఎర్రయ్య, జీపీఓలు చిరంజీవి, రమణ, రాధ, కుమారి, అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్ఓలు కోటమ్మ, అన్నపూర్ణ, సరిత, విజయ, జబ్బార్, చంద్రం తదితరులు పాల్గొని సర్ ప్రక్రియలో తమ అనుభవాలను పంచుకున్నారు

## సామాజిక చైతన్య నాటికల ప్రదర్శనను జయప్రదం చేయండి

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, ఆగస్టు 19:

స్థానిక గిరిజన భవనం ఐటీడీఏ భద్రాచలం నందు అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ వారిచే సామాజిక చైతన్య నాటిక ఉత్సవాలను ఆగస్టు 20, సంఘం శరణం గచ్ఛామి ( డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి జీవితం ఆశయాలు లక్ష్యాలపై రూపొందించిన నాటకం ప్రదర్శన,ఆగస్టు 21,సత్యశోధన (మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే గారి జీవితం ఆశయం లక్ష్యాలపై రూపొందించిన నాటకం ప్రదర్శనలు రెండు రోజులపాటు సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు నిర్వహించబడుతుందనీ సామాజిక ఉద్యమకారులు, మాజీ ఎంఆర్పీఎస్ అలవాల రాజా పెరియార్,



ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల రవీందర్ అన్నారు. ఈ సామాజిక చైతన్య నాటికోత్సవాలకు భద్రాచల పట్టణంలోని విద్యార్థిని, విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## 4వ బెటాలియన్ లో తెలంగాణ పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు



హనుమకొండ ఆగస్టు 19 ప్రజా కలం ప్రతినిధి

4వ బెటాలియన్ మామునూర్ లో తెలంగాణ డిజిపి,బేటాలియన్స్ ఎడిజిపి ఉత్తర్వుల మేరకు కమాండెంట్ శివ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నేడు తెలంగాణ పోలీస్ అసోసియేషన్ ఎన్నికలను పారాధర్శకంగా నిర్వహించడం జరిగింది.ఈ ఎన్నికల్లో ప్రెసిడెంట్ గా ఎమ్.సోమయ్య ఎఆర్ఎస్ఐ-769 ఎన్నికయ్యారు.ఈ ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్ గా ఇద్దరు పి.సీత రాములు (హెచ్.సి -1397),డి రాము(హెచ్.సి -1168),సెక్రటరీ గా సిహెచ్.సంపత్ (ఆర్ఎస్ఐ),జాయింట్ సెక్రటరీ గా ఎస్.ఎ.దాస్(హెచ్.సి-82),ఆర్గనైజింగ్ సెక్రటరీ గా పి.విజయ్ కుమార్ (హెచ్.సి-268),ట్రేసరర్ గా టి.ఉమేష్ (హెచ్.సి-654),యూనిట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ గా ఆర్.వెంకటేశ్వర్లు(ఆర్ఐ),బి.రాజేష్ ఖన్నా(హెచ్.సి-500),సిహెచ్ .శ్రీనాథ్ (హెచ్.సి-1136),ఎమ్ .సంతోష్ కుమార్(హెచ్.సి-418), కె.అజయ్(హెచ్.సి-211), ఎస్.యాకన్న(పిసి-552) ఎన్నికయ్యారు.ఈ ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్ గా కమాండెంట్ డి. శివప్రసాద్ రెడ్డి,నోడల్ ఆఫీసర్ గా అసిస్టెంట్ కమాండెంట్ జె.రాజేందర్ వ్యవహారిచారు.అలాగే రిజర్వ్ ఇన్స్పెక్టర్స్ విజయ్,రాజిరెడ్డి,కృష్ణ ఎన్నికల నిర్వహణలో పాల్గొన్నారు.ఈ ఎన్నికలు అత్యంత పారదర్శకంగా,నిష్పాక్షపాతంగా జరిగాయని కమాండెంట్ తెలిపారు.

## ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఫొటో జర్నలిస్టులకు సన్మానం



హనుమకొండ ఆగస్టు 19 ప్రజా కలం ప్రతినిధి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఫొటో జర్నలిస్టులను శాలువాతో సన్మానించి మెమోంటో అందించటంతో పాటుగా ప్రతీ ఫొటో జర్నలిస్టుకు 2,000/- రూపాయల నగదు పారితోషికాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య,కోశాధికారి బోల్ల అమర్,ఉపాధ్యక్షులు గొకారపు శ్యాం, కొడిపెల్లి దుర్గాప్రసాదరావు, జాయింట్ సెక్రెటరీలు పొడిచెట్టి విష్ణువర్ధన్,వలిశెట్టి సుధాకర్, సంపెట సుధాకర్,కార్యవర్గ సభ్యులు వీరగోని హరీష్,ఎండీ నయీంపాషా,ఫొటో గ్రాఫర్లు దాసరి శ్రీనివాస్,మంగనూరి మురళి,గొట్టె వెంకన్న,చేతి శ్రీనివాస్, కుడుతుల రమేష్,మాషూక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్డి (బి)లో ఉచిత వైద్య శిబిరం




నిర్మల్ ఆగస్టు 19 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కుబీర్ మండలంలోని పార్డి(బి) గ్రామంలో బుదువారం ఉచిత వైద్య శిబిరం. నిర్వహించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో వైద్యులు ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు.శిబిరంలో హెచ్ఐవి, రక్తపోటు, మధుమేహం, జ్వరం,మలేరియా, డెంగ్యూ తదితర పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు అందజేశారు. వివిధ వయస్సుల వారు శిబిరానికి హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కుబీర్ వైద్యులు డాక్టర్ విజేష్ కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ బైంసా కలిముద్దీన్, ఎం ఎల్ హెచ్ పి. ఇమ్రాన్ ఏఎన్ఎం సురేఖ, సూపర్వైజర్ సుగుణ,ఐ సి టి సి కౌన్సిలర్ విలాస్,గ్రామ సర్పంచ్ మడి ప్రవీణ్, కార్యదర్శి భూమేష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మొసిర్, ఆశ వర్కర్లు గ్రామ పంచాయతీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు

## అవయవదానం.. మహాదానం

### తెలంగాణ శరీరా అవయవ దాన దాతల సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎస్ రామచంద్రరావు

నాగర్ కర్నూల్ ఆగస్టు 19 ప్రజా కలం : అన్ని దానాల్లోకెల్లా అవయవదానం.. మహాదానం అని తెలంగాణ శరీర అవయవ దాతల సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎస్. రామచంద్రరావు అన్నారు బుధవారం నాడు నాగర్‌కర్నూల్ కేంద్రంలోని నేషనల్ హైస్కూల్ నందు అవయవదానం అవగాహన సమావేశంలో భాగంగా అఖిల భారత శరీర అవయవదాతల సంఘం ఆధ్వర్యంలో అవయవ దాన పక్షోత్సవాల నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణానంతరం మన అవయవాలు మరొకరికి ప్రాణదానం చేయగలవన్న



విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ రామచంద్రరావు అన్నారు మరణించినా..జీవించండి అనే స్ఫూర్తితో ప్రజలు అవయవదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు అవయవదానం కేవలం దానం కాదని.. ఒకరి మరణం తర్వాత మరొకరికి జీవితాన్ని అందించే మహాదానం అని వెల్లడించారు ప్రతి కుటుంబంలో అవయవదానంపై చర్చ జరగాలని సూచించారు అంతేకాకుండా అవయవదానంపై సరైన సమాచారాన్ని ప్రముఖ గాంధేయవాది భూదానం సుబ్బారావు తన శరీరాన్ని మెడికల్ కాలేజీకి దానం చేయడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు ఈ కార్యక్రమంలో జిల్లా అవయవదాన సంఘం సభ్యులు, నేషనల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## హిప్నెల్లి గ్రామంలో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీఓ శ్రీధర్




తానూర్, ఆగస్టు 19(ప్రజా కలం): మండలంలోని హిప్నెల్లి గ్రామాన్ని బుధవారం ఎంపీడీఓ శ్రీధర్ సందర్శించి, పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు, గ్రామంలోని రోడ్డు మార్గాలకు ఇరువైపులా నాటిన మొక్కలను ఆయన పర్యవేక్షించారు, అనంతరం గ్రామ పంచాయతీ, వివో భవనాలతో పాటు బోర్వెల్ రీఛార్జ్ గుంతల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగసాగర–శివరాం, పంచాయతీ కార్యదర్శి అజీజ్, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, పోశెట్టి, ఎఫ్ఏ సంజులతో పాటు స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తల్లాడలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

**– జెండాను ఆవిష్కరించిన మండల అధ్యక్షులు గుమ్మా రామకృష్ణ**

**– మండల కమిటీని సన్మానించిన రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్**

ఖమ్మం తల్లాడ ఆగస్టు 19 ప్రజా కలం న్యూస్ : ప్రపంచ ఫోటోగ్రఫీ 187వ దినోత్సవాన్ని తల్లాడ మండలంలో ఫోటో అండ్ వీడియోగ్రాఫర్లు బుధవారం



ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లాడలో జాతీయ జెండాను మండలాధ్యక్షులు గుమ్మా రామకృష్ణ ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధురమైన జ్ఞాపకాలను ఫోటో అండ్ వీడియో ద్వారా చిరకాలం గుర్తుంచుకోవచ్చునని అన్నారు. అనంతరం ఖమ్మంలోని భక్త రామ కళాక్షేత్రంలో తల్లాడ మండల కమిటీకి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ ఫోటోగ్రాఫర్లు ఎండి ఆసిఫ్, గుమ్మా రామకృష్ణలను శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఫోటోగ్రఫీ రాష్ట్ర అధ్యక్షులు షేక్. హుస్సేన్, జిల్లా అధ్యక్షులు మారగాని వెంకట్, తిరుపతి రావు, కనకారావులు తల్లాడ మండల కమిటీకి శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ఫోటో అండ్ వీడియోగ్రాఫర్లు షేక్. ఆసిఫ్, గుమ్మా నరేష్, గురజాల నారాయణరావు, గోపిశెట్టి నరేష్, కిషోర్, శీలం కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అజయ్ కుమార్ మిశ్రాతో డా.మద్దిశెట్టి సామేలు భేటీ

**– ఆలయ అభివృద్ధిపై వినతిపత్రం అందజేత**

**– తెలంగాణలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు**

**– డా.మద్దిశెట్టి సామేలు**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఆగస్టు 19: (ప్రజాకలం న్యూస్):

అమిత్ షా యూత్ బ్రిగేడ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. మద్దిశెట్టి సామేలు బృందం బుధవారం ఢిల్లీలో పర్యటించింది. ఈ సందర్భంగా న్యూఢిల్లీలో సింధు అపార్ట్‌మెంట్స్‌లో ఉన్న కేంద్ర మాజీ హోం శాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డా.మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ వచ్చే నెలలో తెలంగాణలో అమిత్ షా యూత్ బ్రిగేడ్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం,విల్లుపురం జిల్లాలోని చిన్నదురై స్వామి ఆలయ నిర్మాణం, అభివృద్ధికి సంబంధించిన అంశంపై వినతిపత్రం అందజేశారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి, హోం శాఖ ద్వారా లేఖ రాయాలని కోరారు. దీనిపై స్పందించిన అజయ్ కుమార్ మిశ్రా హిందూ దేవాలయాల అభివృద్ధి, సంరక్షణకు సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా సాధ్యమైన సహకారం అందిస్తానని, న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణలో అమిత్ షా యూత్ బ్రిగేడ్ సంస్థాగత కార్యకలాపాల విస్తరణ, యువతను మరింతగా సంఘటితం చేయడం, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించినట్లు డా. మద్దిశెట్టి సామేలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల

ప్రజా కలం ఆగస్టు 19 గద్వాల ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన గుడికాటి ఆశన్న నిర్మించుకున్న నూతన



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బిజ్వారం శ్రీనివాసరెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా కృషి చేస్తామని తెలిపారు. నూతన గృహాన్ని నిర్మించుకున్న గుడికాటి ఆశన్న కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చాపలకండ్ల కర్రెన్న, మాజీ ఎంపీపీలు వై. సత్యారెడ్డి, వై. రాజారెడ్డి, నాయకులు రమేష్ రెడ్డి, మైలగడ్డ చంద్రశేఖర్, రమేష్ నాయుడు, కిట్టు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎత్తం పంచాయతీ నిధుల దుర్వినియోగంపై కార్యదర్శుల సస్పెన్షన్

**– సర్పంచ్ ఉప సర్పంచ్లకు సోకాజ్ నోటీసులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

నాగర్‌కర్నూల్ ఆగస్టు 19 ప్రజా కలం (ప్రతినిధి ) నాగర్ కర్నూల్ జిల్లాలోని కోడేరు మండల పరిధిలో ఎత్తం గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో



అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ చర్యలు చేపట్టారు. నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయడంతో పాటు గ్రామ సర్పంచ్ ఉ పసర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎత్తం గ్రామపంచాయతీ కార్యదర్శిగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రమేష్ గతంలో ఎత్తం పంచాయతీలో పనిచేసి ప్రస్తుతం ఎర్రన్నబావి తాండలో విధులు నిర్వహిస్తున్న బి. నరసింహలను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామపంచాయతీకి మంజూరైన అభివృద్ధి నిధుల వినియోగంలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. అభివృద్ధి పనులు నిధుల వినియోగం, బిల్లులు చెల్లింపులు సంబంధిత రికార్డులను అధికారులు పరిశీలించిన అనంతరం ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఎత్తం గ్రామ సర్పంచ్ బి. లక్ష్మి ఉపసర్పంచ్ బి. ధర్మరాజులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినిధుల వినియోగంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత జవాబు దారీతనం తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. నిబంధనల ఉల్లంఘన నిధుల దుర్వినియోగం నిర్ధారణ అయితే బాధ్యులపై మరిన్ని శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎత్తం గ్రామపంచాయతీకి సంబంధించిన రికార్డులు బిల్లులు చెల్లింపుల వివరాలపై అధికారుల విచారణ కొనసాగుతోందని తెలిపారు విచారణలో వెలువడే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకో నున్నట్లు అధికారులు వెల్లడించారు.

## తీజ్ వేడుకలకు ఎస్పీ రోహిత్ రాజును ఆహ్వానం

**బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ బానోత్ వీరు నాయక్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఆగస్టు 19: (ప్రజా కలం న్యూస్)

బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని ప్రగతి మైదానంలో తీజ్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు 9 రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో ప్రతిరోజు బంజారా సంస్కృతి, సాంప్రదాయాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఈనెల 21వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పోలీస్ శాఖలో పనిచేస్తున్న బంజారా ఉద్యోగులతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజును ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం బంజారా జేఏసీ నాయకులు ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఆయనను కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎస్పీ రోహిత్ రాజు ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించి కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ బానోత్ వీరు నాయక్ మాట్లాడుతూ తీజ్ పండుగ బంజారా సమాజానికి ఎంతో విశిష్టమైనదని, 9 రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ప్రతిరోజు సాంప్రదాయ నృత్యాలు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శుక్రవారం జరిగే పోలీస్ ఉద్యోగుల ప్రత్యేక వేడుకకు జిల్లాలోని పోలీస్ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న బంజారా ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా నాయకులు గుగులోత్ భద్రు, బానోత్ భరత్, వినోద్, మురళి, లాలు, రాజా, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

**నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డి రమాకాంత్ పిలుపు**

నాగర్ కర్నూల్ ఆగస్టు 19 ప్రజా కలం: రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ మరియు పోలీస్ ఉన్నతాధికారులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి రమాకాంత్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టు ప్రాంగణాల్లో 12-09-2026 న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో భూతగాదా కేసులు రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు చెక్ బౌన్స్ కేసులు కుటుంబ వివాదాలు మోటారు వాహన ప్రమాద కేసులు బ్యాంకు కేసులు తదితర పెండింగ్ కేసులను పరిష్కరించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. రాజీ మార్గమే రాజమార్గం అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం లభించి అప్పీల్ లేని తీర్పుతో డబ్బు సమయం ఆదా చేసుకోవచ్చని తెలిపారు. ఇరువర్గాలు రాజీ ద్వారా



సుఖసంతోషాలతో జీవించవచ్చని కక్షలు ప్రతీకార భావాలు పోకుండా మానవ సంబంధాలు బలపడతాయన్నారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగకుండా కేసులను త్వరగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక గొప్ప అవకాశమని వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీమతి ఏ. శ్రీదేవి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి శృతి దూత సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి ఎన్. శ్రీనిధి పోలీస్ ఉన్నతాధికారులు ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

## నర్సింగ్ కాలేజీ నిర్మాణం 18 నెలల్లో పూర్తి చేస్తాం

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 19:

నర్సింగ్ కాలేజీ కోసం ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నామని, స్థలం సమకూర్చుకోవడం, ల్యాండ్ అక్విజిషన్‌లో ఎదురైన ఇబ్బందులను అధిగమించి, మెడికల్ కాలేజీ క్యాంపస్‌లోనే నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి తెలిపారు. నర్సింగ్ కళాశాల మరియు హాస్టల్ నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నగరంలోని తిరుమల హిల్స్ నందు మెడికల్ కాలేజీ క్యాంపస్‌లోనే ఐదు ఎకరాల స్థలాన్ని నర్సింగ్ కాలేజీకి కేటాయించి, రూ.40 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో నర్సింగ్ కాలేజీ భవనం, హాస్టల్ భవనాలను రెండు బ్లాకులుగా నిర్మించనున్నట్లు తెలిపారు. మొత్తం దాదాపు 90 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణ పనులు చేపడుతున్నామని వెల్లడించారు. ఇందులో కాలేజీ బ్లాక్ సుమారు 45,062 చదరపు అడుగులు, హాస్టల్ బ్లాక్ సుమారు 44,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం జరగనుందని తెలిపారు. నర్సింగ్ కాలేజీ నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారని, నిర్ణీత సమయంలో పనులు పూర్తయితే మహబూబ్‌నగర్‌కు ఇది ఒక గొప్ప ఆస్తిగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. త్వరలో ప్రారంభం కానున్న కొత్త జనరల్ హాస్పిటల్‌కు నర్సింగ్ విద్యార్థుల సేవలు, శిక్షణ ఎంతో అవసరమని తెలిపారు. మెడికల్ కాలేజీ క్యాంపస్ నుంచి జనరల్ హాస్పిటల్‌కు బస్ సౌకర్యం కల్పిస్తే నర్సింగ్ విద్యార్థులు, ట్రైనీలు క్రమం తప్పకుండా ఆసుపత్రికి వెళ్లి ప్రాక్టికల్ శిక్షణ పొందడంతో పాటు ప్రజలకు సేవలందించే అవకాశం ఉంటుందన్నారు.

నర్సింగ్ కాలేజీ అత్యాధునిక సదుపాయాలతో, అద్భుతమైన వసతులతో నిర్మించనున్నామని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన శిక్షణ అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ లలిత భానుచందర్, నాయకులు మైత్రి యాదయ్య, వాల్దాస్ ప్రతాప్ గౌడ్, జేసిఆర్, శ్రీశైలం, గ్యాస్ అంజి, గోపాల్ మెడికల్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ రమేష్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రాగిణి తదితరులు పాల్గొన్నారు.

## గుండాలలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, ఆగస్టు 18

పోలవరం జిల్లా, ఎటపాక మండలం, గుండాల పంచాయతీ గుండాల కాలనీ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంసర్దార్ సర్వాయి పాపన్న యువజన సంఘం నందిగామ మండల అధ్యక్షుడు ముత్యం సురేష్ గౌడ్, గ్రామస్తులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ముత్యం సురేష్ గౌడ్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. సామాన్య ప్రజల కోసం పోరాడుతూ అణగారిన వర్గాలకు ఆత్మగౌరవాన్ని, ధైర్యాన్ని కల్పించిన మహనీయుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ముందుకు సాగడంతో పాటు సామాజిక ఐక్యతను కాపాడాలని అన్నారు. పాపన్న గౌడ్ చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుండాల కాలనీ గౌడ్ కులస్తులు పాల్గొన్నారు

## అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సక్రమంగా రేషన్ బియ్యం అందించాలి : అదనపు కలెక్టర్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 19: జడ్చర్ల పట్టణంలోని మదీనా కాలనీలో గల చౌక ధర దుకాణాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జడ్చర్ల తహశీల్దార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, డీటీతో కలిసి చౌక ధర దుకాణం నంబర్ 1423001ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణంలో బియ్యం నిల్వలు, పంపిణీ ప్రక్రియ, రికార్డులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బియ్యం అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సక్రమంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేషన్ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. ఈ తనిఖీలో జడ్చర్ల తహశీల్దార్ నర్సింగరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ, డీటీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబ ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ ఇల్లు

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు19: ఇందిరమ్మ ఇల్లు ప్రతి కుటుంబ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి పేర్కొన్నారు. ఎదిరకు చెందిన సుజాత, నరేష్ దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, వారు నూతన గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ప్రభుత్వ ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించి, సుజాత, నరేష్ దంపతులకు గృహప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసి, వారి జీవితాల్లో సంతోషాలు నింపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని అన్నారు. .అనంతరం సుజాత, నరేష్ దంపతుల కుమార్తెల పుట్టుచీర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిన్నారులు బిందు ప్రియ, టోనీలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ లలిత భానుచందర్, నాయకులు మైత్రి యాదయ్య, వాల్దాస్ ప్రతాప్ గౌడ్, శ్రీశైలం, గ్యాస్ అంజి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఎన్ఎస్పీ కాల్వపై బ్రిడ్జి మంజూరుకు కృషి చేసిన ఎంపీ రఘురాం రెడ్డికి కైకొండాయిగూడెం కాంగ్రెస్ నాయకుల కృతజ్ఞతలు

ఖమ్మం ఆగష్టు 19(ప్రజా కలం న్యూస్ )ఖమ్మం నగరంలోని విజయనగర్ కాలనీ మార్గంలో నాగార్జునసాగర్ కాల్వపై..రూ.3.47 కోట్లతో బ్రిడ్జి మంజూరు చేయించిన



ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ని వారి నివాసంలో కైకొండాయిగూడెం గ్రామ కాంగ్రెస్ నాయకులు బుధవారం కలిసి. కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఒకటో డివిజన్ కార్యదర్శి శీలం వీరబాబు, అధ్యక్షులు పందుల తిరుపతిరావు, నాయకులు నాగటి ఉపేందర్, పార్టీ ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, భూక్యా ఉపేందర్, కార్యదర్శి భూక్య గోపి.. ఎంపీని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ..

కైకొండాయిగూడెం, దానవాయిగూడెం వెళ్లేందుకు, అలాగే రామన్నపేట మీదుగా డోర్నకల్ మార్గం చేరుకునేందుకు. ఈ బ్రిడ్జి నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఎంపీ .. పలుమార్లు రాష్ట్రమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారని, అలాగే గతంలో జలసౌద సమీక్ష సమావేశంలో విన్నవించగా.. ఈ వంతెన మంజూరయిందని, ఈ ప్రాంత ప్రజలు ఎంపీ ని ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# విద్యా ప్రమాణాల మెరుగుదలకు సమర్థవంతంగా పనిచేయాలి

## – స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 19:

హాస్టల్ విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు సమర్థవంతంగా పనిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఎస్.సి.,ఎస్.టి.,బి. సి.,మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు,ఆర్.సి.ఓ లు,గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్ లు, డి.ఈ.ఓ,కె.జి.బి.వి స్పెషల్ ఆఫీసర్ లు,హాస్టల్ వార్డెన్ లతో వెబెక్స్ సమావేశం నిర్వహించి పెండింగ్ పనులు,పరిశుభ్రత పై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులకు "ఇల్లు దూరమైనా ఇంటి వాతావరణం" కల్పించే విధంగా హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి విద్య కోసం వచ్చే విద్యార్థులకు సురక్షితమైన వసతి, నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్య సంరక్షణ మరియు విద్యా సౌకర్యాలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు హాస్టళ్లలో భవనాలు, గదులు, విద్యుత్, ఫర్నిచర్, మరుగుదొడ్లు, తాగునీరు, వంటశాల తదితర మౌలిక వసతులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. పారిశుధ్యం, పరిశుభ్రత, పచ్చదనం, విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అవసరమైన చిన్న, పెద్ద మరమ్మతుల విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్, దుస్తులు, బెడ్డింగ్, ట్రంక్ బాక్సులు, ప్లేట్లు, గ్లాసులు మరియు ఇతర అవసరమైన సామగ్రి సకాలంలో పంపిణీ చేయాలి. సామగ్రి పంపిణీలో ఎలాంటి కొరత లేకుండా రికార్డులను సక్రమంగా నిర్వహించాలి. విద్యార్థుల విద్యా పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పాఠశాల హాజరు, పరీక్షల ఫలితాలు, మార్కుల పురోగతిని పర్యవేక్షించాలని అన్నారు . రాత్రి సమయంలో అవసరమైన కోచింగ్ అందించడం, చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు హాస్టల్లో నాణ్యమైన, తాజా మరియు నిర్ణీత మెనూ ప్రకారం భోజనం అందేలా చూడాలి. మెస్ కమిటీని ఏర్పాటు చేసి, మెనూను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలి. వంటకు అవసరమైన సరుకుల జారీ, స్టాక్ నిర్వహణ, భోజన నాణ్యతను అధికారులు నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారువిద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ కార్డులు, క్రమం తప్పని వైద్య పరీక్షలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచాలి. అనారోగ్యానికి గురైన విద్యార్థులను సమీప ప్రభుత్వ ఆసుపత్రి/వైద్య కేంద్రానికి తీసుకెళ్లి అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు అలాగే విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు, స్టాక్, నగదు, బిల్లులు, సందర్శకులు, మూవ్మెంట్, ఫిర్యాదులు తదితర అన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహిస్తూ పారదర్శకతను పాటించాలని అన్నారు . తనిఖీ అధికారుల సూచనలను నమోదు చేసి, వాటిపై తీసుకున్న చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి త్రైమాసికం తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి, విద్యార్థుల చదువు, ఆరోగ్యం, ప్రవర్తన , సంక్షేమంపై తల్లిదండ్రులతో చర్చించాలి. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం క్రీడలు, సాంస్కృతిక, ఇతర సహపాఠ్య కార్యక్రమాలను ప్రోత్సహించాలని సూచించారు హాస్టల్ వెల్ఫేర్ అధికారులు వ్యూహం, వ-ఎశీర్వశ్రీ వంటి ఆన్లైన్ వ్యవస్థల్లో విద్యార్థుల వివరాలు, హాజరు, స్టాక్, బిల్లులు తదితర సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన విద్యార్థులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యా పురోగతి, సమగ్ర సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రతి హాస్టల్ వెల్ఫేర్ అధికారి బాధ్యతాయుతంగా, పారదర్శకంగా మరియు మానవతా దృక్పథంతో విధులు నిర్వహించాలని సూచించారు. హాస్టల్ పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి హాస్టల్ విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.



హాస్టల్ లోపల మరియు హాస్టల్ చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఎలాంటి పిచ్చి మొక్కలు, పొదలు, ఎండిపోయిన/పనికిరాని చెట్లు, చెత్తాచెదారం లేకుండా ప్రతిరోజూ పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలి. పెరిగిన పొదలు, ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలు మరియు ఎండిపోయిన చెట్లను తొలగించి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు అదేవిధంగా హాస్టల్లోని డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా శుభ్రంగా,ఉంచాలని, డ్రైనేజీల్లో చెత్త, మట్టి, మురుగు పేరుకుపోకుండా క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి.

ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు హాస్టల్ భవనాలు, గదులు, వంటశాల, మరుగుదొడ్లు, తాగునీటి ప్రదేశాలు, పరిసరాలు,100 మీటర్ల చుట్టుపక్కల ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ పారిశుధ్య ప్రమాణాలను పాటించాలని అన్నారు దోమలు, ఈగలు మరియు ఇతర కీటకాలు పెరగకుండా అవసరమైన ఫాగింగ్, యాంటీ-లార్వా ఇతర పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా హాస్టల్ పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా, మురుగునీరు నిల్వ లేకుండా, పొదలు, వ్యర్థ చెట్లు లేకుండా ప్రతిరోజూ తనిఖీ నిర్వహించాలి. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు ఈ అంశాలను తమ రోజువారీ పర్యవేక్షణలో ముఖ్యమైన అంశంగా తీసుకుని, అవసరమైన చర్యలను వెంటనే చేపట్టి, హాస్టల్ విద్యార్థులకు పరిశుభ్రమైన మరియు సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు.

# చరిత్రను చిత్రాల్లో బంధించే కళకు సెల్యూట్..

## - మల్దకల్‌లో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



గద్వాల ప్రతినిధి ఆగస్టు 19 ప్రజా కలం:

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో బుధవారం 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్దకల్ మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలిసారిగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం విశేషంగా నిలిచింది. మల్దకల్‌లోని కృష్ణయ్య గౌడ్ షాప్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్ కృష్ణయ్య గౌడ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముందుగా ఫోటోగ్రఫీ రంగానికి పితామహుడిగా గుర్తింపు పొందిన లూయిస్ డాగ్యూర్ చిత్రపటానికి గ్రామ సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్ కుమారుడు శ్రీకాంత్ కొబ్బరికాయ కొట్టి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఫోటోగ్రఫీ రంగంలో సేవలందిస్తూ మృతిచెందిన ఫోటోగ్రాఫర్లకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగం ప్రాధాన్యతను, సమాజంలో ఫోటోగ్రాఫర్ల పాత్రను పలువురు వివరించారు. ఒక క్షణాన్ని చిత్రంగా బంధించి, దానిని చరిత్రగా నిలిపే గొప్ప శక్తి ఫోటోగ్రఫీకి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఫోటోగ్రాఫర్ కృష్ణయ్య గౌడ్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ అనేది కేవలం వృత్తి మాత్రమే కాకుండా సమాజంలో జరిగే సంఘటనలను, ప్రజల జీవన విధానాన్ని, చారిత్రక ఘట్టాలను భవిష్యత్ తరాలకు అందించే గొప్ప కళ అని అన్నారు. ఫోటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్దతండా సర్పంచ్ నార్య నాయక్, సీనియర్ నాయకులు భాస్కర్ గౌడ్, ఫోటోగ్రాఫర్లు నాగరాజ్, సత్యం, రంగన్న, తిమ్మప్ప, రాము, రవి, ఎం.శీను తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఆర్ ఎస్ పి కాలువల ద్వారా

# పంటలకు నీటిని అందించాలి

## - సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్

పాలేరు ఆగష్టు 19(ప్రజా కలం న్యూస్ )

ప్రస్తుతం వాతావరణ మార్పులు వల్ల వర్షాలు సమృద్ధిగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఎస్. ఆర్ .ఎస్ .పి. కాలువల ద్వారా మండలంలోని పాలేరు జలాశయానికి నీటిని తరలించి సాగర్ ఆయకట్టు పంటలను, మండలానికి నీటిని అందించి మండల వ్యాప్తంగా రైతుల పంటలను కాపాడాలని, పాలేరు నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవ చూపాలని సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పద్మా రెడ్డి భవనంలో యడవల్లి రమణారెడ్డి అధ్యక్షుడు జరిగిన సిపిఎం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. ప్రస్తుత పరిస్థితులలో రైతులు ఇప్పటికే వరి, పత్తి, తదితర పంటలు సాగు చేశారని, ఈ పంటలను కాపాడుకోవడానికి నాగార్జున సాగర్ లో నీటి లభ్యత లేనందున, ప్రత్యామ్నాయంగా ఎస్సారెస్పీ కాలువల ద్వారా మండలానికి నీటిని తరలించి, పాలేరు జలాశయాన్ని, మండలంలోని చెరువులు, కుంటలను నింపి, పంటలను కాపాడాలి, భూగర్భ జలాలను పెంచాలని, పంటలను కాపాడవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో గతం కంటే పంటలు రైతులు తక్కువ సాగు చేశారని, సాగుచేసిన పంటలైన కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని ఆలోచించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత సంవత్సరం వరి 24,569 ఎకరాలు సాగు చేయగా.. ప్రస్తుతం 17,561 ఎకరాలు మాత్రమే సాగు చేశారని, గత సంవత్సరం పత్తి 13,000 సాగు చేయగా.. ప్రస్తుతం 11020 ఎకరాలు గా సాగు చేశారని, వీటితోపాటు మండల వ్యాప్తంగా మిర్చితోపాటు, కొంత వాణిజ్య పంటలు వేశారని ఈ పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, ఎస్సారెస్పీలో నీటి లభ్యత ఉన్నందున తక్షణమే ఎస్ఆర్ఎస్పీ కాలువల ద్వారా నీటిని మండలానికి అందించి రైతుల పంటను కాపాడాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు శీలం గురుమూర్తి, బిక్కసాని గంగాధర్, కర్ణబాబు,గన్య నాయక్, మండల కమిటీ సభ్యులు, గ్రామశాఖ కార్యదర్శులు, పార్టీ సీనియర్ నాయకులు, సీనియర్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్ల స్థలం ఇస్తాం

## - రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### పల్లెగూడెం సమగ్ర అభివృద్ధికి రూ.61.76 కోట్లు కేటాయించినట్లు వెల్లడి -పల్లెగూడెం గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి



పాలేరు ఆగస్టు 19(ప్రజా కలం న్యూస్ )

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం లో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పల్లెగూడెంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలో ఉంటే, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను గుర్తించిన వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకోసమే భూములను సమీకరించి ఇళ్ల స్థలాలు అందిస్తామని తెలిపారు. పల్లెగూడెం సమగ్ర వికాసానికి రూ. 61.76 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి అన్నారు. గ్రామంలో ఇప్పటికే రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని, గొల్లగూడెం నుంచి పల్లెగూడెం వరకు ఎన్ఎస్పీ కాల్వ గట్టుపై రూ. 5.80 కోట్లతో మోడల్ సీసీ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా, పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రూ.55 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు చెప్పారు. రూ.20 లక్షల వ్యయంతో పంచాయతీ కార్యాలయ భవనాన్ని కేవలం రెండు నెలల వ్యవధిలోనే నాణ్యతతో పూర్తి చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను మంత్రి అభినందించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షలతో నూతన అంగన్‌వాడీ భవనాన్ని కూడా తక్షణమే మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని మంత్రి అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, జిల్లాలో 110 గ్రామ పంచాయతీ నూతన భవనాలు మంజూరై అన్ని గ్రౌండింగ్ అయి, వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అంగన్వాడీలకు నూతన భనవాల నిర్మాణం తుది దశలో ఉందన్నారు.వివో భవనాల నిర్మాణానికి 20 చోట్ల స్థల సమస్య ఉన్నట్లు, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాధ్యతగా వ్యవహరిస్తూ అభివృద్ధి పనుల పూర్తికి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఇఇ మహేష్ బాబు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్‌పోకబత్తిని అనిత, కమీషనర్ శ్రీనివాస రెడ్డి, పల్లెగూడెం సర్పంచ్ చుండూరి సుజన కృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది

### రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
### దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది
### ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
### దివ్యాంగులకు ఉచితంగా త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్ళ పంపిణీ చేసిన మంత్రి



పాలేరు ఆగస్టు 19( ప్రజా కలం న్యూస్)

దివ్యాంగుల సంక్షేమానికి, వారి ఆర్థిక, సామాజిక వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం తరపున వంద శాతం సబ్సిడీపై సమకూర్చిన త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్ళను బుధవారం కూసుమంచి క్యాంపు కార్యాలయం వద్ద పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా, తమ స్వశక్తితో జీవించేందుకు అవసరమైన సహాయ ఉపకరణాలను ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. రవాణా సౌకర్యం సులభతరం కావడానికి ఈ ట్రై మోటార్ సైకిళ్లు ఎంతో తోడ్పడతాయని అన్నారు. దివ్యాంగత్వాన్ని వైకల్యంగా భావించకుండా, బలమైన ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. సరైన పట్టుదల ఉంటే జీవితంలో సాధించలేనిది ఏదీ లేదని, దివ్యాంగులు సమాజంలో స్వయం సమృద్ధి సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి దివ్యాంగునికి ప్రభుత్వ పథకాలు, పింఛన్లు, ఇతర సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, దివ్యాంగ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ భవేశ మిశ్రా

నిర్మల్ ఆగస్టు19 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్ల గుర్తింపు, ఓటర్ల వివరాల్లోని వ్యత్యాసాలు, అనామలీస్ పరిశీలనను నిర్దేశిత నిబంధనల మేరకు పూర్తి చేయాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల పరిశీలనలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా వ్యత్యాసాలు, అనామలీస్ గుర్తించినట్లయితే వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీ, సమయంలో హాజరై తమ పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించేలా వారికి అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా అందే దరఖాస్తులను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడంతో పాటు, అనర్హులైన పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు, శిక్షణ అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సిబ్బందికి ఎదురయ్యే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ, ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఎస్ఐఆర్ కింద చేపట్టాల్సిన కార్యక్రమాలకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి దశకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయి అధికారులకు అవసరమైన వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఓటర్ల జాబితాల ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత కీలకమైనందున అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గర్భిణులు, శిశువుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి:

## - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ ఆగస్టు 19 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో గర్భిణులు, బాలింతలు, శిశువుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, వైద్యారోగ్య శాఖ 'అంకురం ' కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గర్భం దాల్చిన నుంచి ప్రసవం అయ్యే వరకు తప్పనిసరిగా పర్యవేక్షణ ఉంచాలన్నారు. గర్భిణుల్లో ఆరోగ్య సమస్యలు ఉంటే వారిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి, వారిని సంరక్షించాలన్నారు. ఎన్ఎంఆర్ సంఖ్యను సింగిల్ డిజిట్ కి పరిమితం చేయడమే అంకురం కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రణాళికల ద్వారా గర్భిణులు, బాలింతలు, శిశువుల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు గర్భిణులకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా వైద్యాధికారులు గర్భిణులు తప్పనిసరిగా సంబంధిత చికిత్సలు తీసుకునేలా పర్యవేక్షణ ఉంచాలని అన్నారు.సంకల్ప్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టి, నవజాత శిశువుల మరణాలు గత సంవత్సరంతో 50 శాతం తగ్గించాలన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు.



ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్యులు, వైద్యాధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాలను కొనసాగించి రైతు బీమా ప్రీమియం చెల్లించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ డిమాండ్



నాగర్ కర్నూల్ ఆగస్టు 19 ప్రజా కలం:బుధవారం నాడు జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్షణాచారి భవన్ లో సిపిఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాద్ ముబారక్ రైతు బీమా వంటి పథకాలను కొనసాగించాలన్నారు అదేవిధంగా రైతుబిమా ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉండేదని నేటి ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తామని చెబుతున్నటువంటి ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను విస్మరించడం చాలా బాధాకరమైన విషయని ఆవేదన చెందారు కాబట్టి తక్షణమే అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు లేని యెడల రాష్ట్ర ప్రభుత్వంపై సిపిఐ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి తిరుగుబాటు ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు ఆగస్టు 13న ముగిసినటువంటి రైతు బీమా ప్రీమియంను తిరిగి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని రైతులను ఆదుకోవాలన్నారు దురదృష్టవశాత్తు రైతులు మరణిస్తే ఈ పథకం ద్వారా రైతు కుటుంబాలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్ ఆనంద్ జి జిల్లా కౌన్సిల్ సభ్యులు బండి లక్ష్మీపతి శివశంకర్ జిల్లా నాయకులు కొత్త రామస్వామి వంకేశ్వరం శ్రీనివాసులు హుస్సేన్ బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి

### - ఎంఈఓ జి. సురేష్



గద్వాల ప్రతినిధి ఆగస్టు 19 ప్రజా కలం:మల్దకల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మల్దకల్ కాంప్లెక్స్ స్థాయి సమావేశం నిర్వహించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సమక్షంలో, మండల విద్యాధికారి జి. సురేష్ పర్యవేక్షణలో డీఆర్పీలు రాఘవేంద్ర, కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వివిధ విద్యా అంశాలపై సమావేశం కొనసాగింది. ఈ సందర్భంగా ఎంఈఓ జి. సురేష్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నిర్దేశించిన అంశాలను ఉపాధ్యాయులకు వివరించారు. ముఖ్యంగా ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని తెలిపారు. అలాగే ప్రతి పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ హాజరు శాతాన్ని తప్పనిసరిగా పెంచాలని సూచించారు. విద్యార్థుల హాజరుతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కాంప్లెక్స్ సమావేశాన్ని రాష్ట్ర పరిశీలకులు అభిషేక్ పరిశీలించి, వివిధ అంశాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. కాంప్లెక్స్ కార్యదర్శి వెంకటయ్యతో పాటు కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు సర్పంచ్ తక్షణ చర్యలు

### - ఎల్కూర్‌లో దోమల నివారణ మందు పిచికారీ

### - సర్పంచ్ పి. వినోద్ కుమార్

గద్వాల ప్రతినిధి ఆగస్టు 19 ప్రజా కలం: జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్



మండలం పరిధిలోని ఎల్కూర్ గ్రామంలో దోమల బెడద నివారణకు గ్రామ సర్పంచ్ పి. వినోద్ కుమార్ తక్షణ చర్యలు చేపట్టారు. గ్రామంలో దోమలు అధికంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం సర్పంచ్ దృష్టికి రావడంతో వెంటనే స్పందించారు. ఈ మేరకు గ్రామంలోని ప్రధాన వీధులు, పరిసర ప్రాంతాల్లో ట్రాక్టర్ ద్వారా దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. దోమల నివారణకు సర్పంచ్ వెంటనే స్పందించి గ్రామమంతా మందు పిచికారీ చేయించడంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీపీఓ పరశురామ్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## పొలంలో విద్యుదాఘాతంతో రైతు మృతి..

## కుటుంబాన్ని పరామర్శించిన సరిత తిరుపతయ్య

గద్వాల ప్రతినిధి, ఆగస్టు 19 (ప్రజా కలం): మల్దకల్ మండలానికి చెందిన కుమ్మరి చిన్న తిమ్మప్ప (41) పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై



అకాల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీజీఎస్‌జీడీసీఎఫ్ఎల్ చైర్మన్ సరిత తిరుపతయ్య మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దపల్లి అల్వాల రాజశేఖర్ రెడ్డి, మల్లెందొడ్డి మద్దిలేటి, అయ్యప్ప బోయ, పరుష రాముడు తదితరులు పాల్గొన్నారు.

# నోటీసులు, తుది జాబితా ప్రక్రియపై దృష్టి

### - ముసాయిదా ఓటర్ల జాబితాపై నోటీసుల జారీ, తదుపరి చర్యలకు యాక్షన్ ప్లాన్ - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 19:



ఎస్ఐఆర్-2026లో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాపై నోటీసుల జారీ, తదుపరి చర్యలకు సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబ్ నగర్ జిల్లా నుండి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు. ఎస్ఐఆర్-2026 ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం చేపట్టాల్సిన చర్యలు, నోటీసుల జారీ, పెండింగ్‌లో ఉన్న అంశాల పరిష్కారం, తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సంబంధించిన కార్యాచరణపై ఈ సందర్భంగా చర్చించారు.

ఎస్ఐఆర్-2026 ముసాయిదా ఓటర్ల జాబితాలో 6,29,402 మంది ఓటర్లు మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్ఐఆర్-2026 కింద రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 6,29,402 మంది ఓటర్లు ఉన్నారు. ఆగస్టు 17, 2026 నాటికి మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలను అధికారులు సమీక్షించారు. ముసాయిదా జాబితా ప్రకారం మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 2,13,588 మంది, జడ్చర్లలో 1,99,354 మంది, దేవరకద్రలో 2,16,460 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం సాధారణ ఓటర్లలో 3,13,256 మంది పురుషులు, 3,16,107 మంది మహిళలు, 19 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. అదనంగా 20 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు నమోదయ్యారు.

**నోటీసులు,**
**తుది జాబితా ప్రక్రియపై దృష్టి**

ముసాయిదా ఓటర్ల జాబితాలో 40,116 మంది ఓటర్ల నో మ్యాపింగ్ ఉండగా, 1,96,576 లాజికల్ డిస్క్రెపెన్సీలు గుర్తించారు. నియోజకవర్గాల వారీగా మహబూబ్‌నగర్‌లో 19,487, జడ్చర్లలో 8,759, దేవరకద్రలో 11,870 మంది మ్యాపింగ్ పెండింగ్‌లో ఉంది. అదేవిధంగా లాజికల్ డిస్క్రెపెన్సీలు మహబూబ్‌నగర్‌లో 69,951, జడ్చర్లలో 60,961, దేవరకద్రలో 65,664గా నమోదయ్యాయి. వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. బీఎల్ఓల నియామకం, డేటా అప్‌డేషన్ పూర్తి చేయాలనీ అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో గతంలో 846 మంది బీఎల్ఓలు/పీఎస్ సిబ్బంది ఉండగా, కొత్తగా 16 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడంతో ఈ సంఖ్య 862కు చేరింది. జు=నా లను దీూా ల ట్రైనింగ్ కోసం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీలు, బీఎల్ఓల అప్‌డేషన్, సమావేశాల మినిట్స్‌ను త్వరితగతిన పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితా ప్రక్రియను సజావుగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఆర్‌డీఓ నవీన్, ఎలక్షన్ ఐ అధికారి జాఫర్, మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ సోలార్ గ్రామంగా చెరువుమాధారం

### - రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
### - ఉచిత విద్యుత్‌తో పాటు ప్రతి గృహంలో సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం
### - 713 గృహజ్యోతి లబ్దిదారుల గృహాలకు 2 కిలోవాట్ల సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు
### - రైతుల వ్యవసాయ మోటార్లకు సైతం సోలార్ విద్యుత్ అందించేలా పైలట్ ప్రాజెక్టు
### - చెరువుమాధారంలో గృహాలకు 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్లను ప్రారంభించిన మంత్రి

పాలేరు ఆగస్టు-19(ప్రజా కలం న్యూస్ )

జిల్లాలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడంతో పాటు, పేద కుటుంబాల విద్యుత్ అవసరాలను మరింత సమర్థవంతంగా తీర్చే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమంలో భాగంగా నేలకొండపల్లి మండలం చెరువుమాధారం గ్రామాన్ని పైలట్ గ్రామంగా అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

బుధవారం చెరువుమాధారం గ్రామంలో గృహాలకు ఏర్పాటు చేసిన 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ వ్యవస్థను పరిశీలించి, లబ్ధిదారులతో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదింటి ఆడబిడ్డలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలన్న హామీ మేరకు గృహజ్యోతి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉచిత విద్యుత్ పథకంతో ప్రత్యేక అనుబంధం ఉందని, రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల సంక్షేమం, రైతుల సంక్షేమం, మహిళల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

చెరువుమాధారం గ్రామాన్ని మోడల్ సోలార్ గ్రామంగా ఎంపిక చేసి జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు క్రింద సోలార్ గ్రామంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. గ్రామంలోని అర్హత కలిగిన గృహాలకు 2 కిలోవాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో కుటుంబం సాధారణంగా నెలకు 140 నుంచి 150 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగిస్తే, సోలార్ వ్యవస్థ ద్వారా సుమారు 250 నుంచి 270 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. కుటుంబం వినియోగించిన తర్వాత మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి, నిబంధనల ప్రకారం మిగులు విద్యుత్‌కు సంబంధించిన మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధంగా ఈ పైలట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని వివరించారు.

గృహాలకే పరిమితం కాకుండా రైతుల వ్యవసాయ మోటార్లకు కూడా సౌర విద్యుత్ అందించే దిశగా చెరువుమాధారాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశామని మంత్రి తెలిపారు. 10 హెచ్పి సామర్థ్యం కలిగిన వ్యవసాయ మోటార్లకు సోలార్ విద్యుత్ అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గృహాలకు సౌర విద్యుత్, రైతుల వ్యవసాయ మోటార్లకు సౌర విద్యుత్ అందించడం ద్వారా చెరువుమాధారం గ్రామాన్ని సమగ్ర మోడల్ సోలార్ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

సోలార్ ప్రాజెక్టుకు దశలవారీగా భారీగా నిధులు వెచ్చిస్తున్నామని, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా గృహజ్యోతి పథకంతో పాటు రైతులకు కూడా సోలార్ విద్యుత్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. పేదల సంక్షేమం, రైతుల మేలు, మహిళల అభ్యున్నతి, యువత భవిష్యత్తు కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, చెరువుమాధారం గ్రామంలో మొత్తం 966 గృహజ్యోతి కనెక్షన్లు ఉన్నాయని, అందులో ప్రాథమికంగా 713 ఇళ్లను మోడల్ సోలార్ గ్రామం పథకం కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు అవసరమైన రూఫ్‌టాప్, స్లాబ్ వంటి నిర్మాణ సదుపాయాలను పరిశీలించి ఇళ్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. మిగిలిన ఇళ్లలో కూడా అవసరమైన ప్రత్యామ్నాయ నిర్మాణాలపై సాంకేతికంగా పరిశీలించి, సాధ్యమైన మేరకు అందరికీ సోలార్ విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ప్రతి ఇంటికి ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్ ద్వారా సుమారు 250 నుంచి 270 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని, గృహజ్యోతి కింద సాధారణంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగం ఉండే కుటుంబాలకు వినియోగం అనంతరం మిగిలే విద్యుత్ గ్రిడ్‌కు చేరేలా వ్యవస్థను రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు.

లబ్ధిదారులు సోలార్ ప్యానెళ్లను సక్రమంగా నిర్వహించడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ సూచించారు. ప్యానెళ్లపై దుమ్ము, ధూళి పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, సూర్యరశ్మి సక్రమంగా పడేలా చూసుకోవాలని తెలిపారు. ప్యానెళ్లను శుభ్రం చేసేటప్పుడు కేవలం నీటిని ఉపయోగించాలని సూచించారు. సోలార్ వ్యవస్థల నిర్వహణ, సాంకేతిక అంశాలపై లబ్ధిదారులకు సంబంధిత అధికారులు అవగాహన కల్పిస్తారని, గ్రామంలో అవసరమైన సాంకేతిక సహాయం అందించేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. సోలార్ కార్యక్రమం ద్వారా చెరువుమాధారం గ్రామం గ్రీన్ ఎనర్జీ వినియోగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం మంత్రి బుద్దారం గ్రామంలో రూ. 197 లక్షల వ్యయంతో బుద్దారం నుండి రాజారాంపేట వరకు, కొంగర గ్రామంలో రూ. 105 లక్షల వ్యయంతో కొంగర నుండి పాలేరు వాగు వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసా చారి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఇ యుగంధర్ రావు, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపిడివో ఎర్రయ్య, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

### ఎమ్మెల్యే బండ్ల




ప్రజా కలం, ఆగస్టు 19, గద్వాల ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని దాసరిపల్లి గ్రామానికి చెందిన ఆలూరు నరసింహులు, వెంకటమ్మ నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బి. వెంకటేష్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. నూతన గృహాన్ని నిర్మించుకున్న ఆలూరు నరసింహులు, వెంకటమ్మ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు వై. సత్యారెడ్డి, వై. రాజారెడ్డి, నాయకులు రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ భరత్ రెడ్డి, మైలగడ్డ చంద్రశేఖర్, రమేష్ నాయుడు, కిట్టు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

### - మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేయాలి

### - కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




ప్రజా కలం, ఆగస్టు 19, గద్వాల ప్రతినిధి:

ఎస్ఐఆర్ ప్రక్రియలో మ్యాపింగ్ కాని ఓటర్లను గుర్తించి, వారికి నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.

బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్ల గుర్తింపు, వివరాల్లో వ్యత్యాసాలను పరిశీలించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీలో హాజరై పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలని తెలిపారు.

అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులతో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ కాని ఓటర్లకు ధ్రువపత్రాల సమర్పణ కోసం సౌకర్యవంతమైన కేంద్రాలను ఏర్పాటు చేసి, హెల్ప్‌డెస్క్‌ల ద్వారా అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఓటర్లకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్, ఎన్నికల విభాగం అధికారి మంజుల, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గద్వాల కీర్తిని చాటిన వీరవనిత..

## మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ

### - సాహిత్యం, చేనేత రంగాలకు విశేష ప్రోత్సాహం

ప్రజా కలం, ఆగస్టు 19, గద్వాల ప్రతినిధి: గద్వాల సంస్థానాన్ని పాలించిన మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె సేవలను గద్వాల ప్రజలు



స్మరించుకుంటున్నారు. గద్వాల సంస్థాన చివరి పాలకురాలిగా గుర్తింపు పొందిన ఆమె సాహిత్యం, కళలు, చేనేత రంగాల అభివృద్ధికి విశేష కృషి చేశారు. సంస్థాన పాలనా బాధ్యతలు చేపట్టిన మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ సుమారు 25 సంవత్సరాల పాటు పాలన కొనసాగించారు. 1949లో సంస్థానాలు, జాగీర్ల వ్యవస్థ రద్దు కావడంతో సంస్థాన పాలనకు ముగింపు పలికింది. అనంతరం గద్వాల సంస్థాన ఆస్తులు, చారిత్రక కోటను ప్రభుత్వానికి అప్పగించారు. మహారాణి పాలనలో గద్వాల సాహిత్య, సాంస్కృతిక రంగాలకు విశేష ప్రోత్సాహం లభించింది. కవులు, పండితులను ఆదరించి సన్మానించడంతో గద్వాలకు లి'విద్వద్గద్వాల'లిగా ప్రత్యేక గుర్తింపు వచ్చింది. పలువురు కవులు, పండితుల రచనలకు ఆమె ప్రోత్సాహం అందించారు. గద్వాల చేనేతకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలోనూ మహారాణి కీలక పాత్ర పోషించారు. చేనేత కార్మికులకు శిక్షణ, ప్రోత్సాహం అందించి పట్టు-పత్తి మిశ్రమంతో ప్రత్యేకమైన గద్వాల చీరల తయారీకి ఊతమిచ్చారు. దీంతో గద్వాల చీరలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించింది. తిరుమల శ్రీవారికి గద్వాల నుంచి పట్టుతో నేసిన జోడు పంచెలను సమర్పించే సంప్రదాయానికి కూడా సంస్థాన కాలంలో ప్రోత్సాహం లభించింది. మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ 1953 ఆగస్టు 18న కన్నుమూశారు. గద్వాల చరిత్రలో ఆమె పాలన, సాహితీ సేవ, చేనేత ప్రోత్సాహం, కళా-సాంస్కృతిక రంగాలకు చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోయాయి.



## 290 సుభాష్ నగర్ డివిజన్‌లో స్థానిక సమస్యలపై అధికారుల పర్యటన

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కొంపల్లి సర్కిల్ పరిధి 290 సుభాష్ నగర్ డివిజన్‌లో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, కొంపల్లి కమిషనర్ లావణ్య, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నెరాజు, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు నాగిరెడ్డి, సాయిబాబా నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు భాస్కర్ రెడ్డి, సుభాష్ నగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు తులసి, కొమురయ్య, సాలోమనితో కలిసి బుధవారం డివిజన్‌లో పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, జజ రోడ్లు, UGD పనులు, పారిశుద్ధ్య సమస్యలు, స్ట్రీట్ లైట్ల సమస్యలు తదితర అంశాలపై అధికారులకు స్థానికులు వివరించారు. ప్రజలకు మౌలిక వసతులు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రజల కోసం నిరంతరం ముందుండి పనిచేస్తామని ఆమె వివరించారు.



## కాసాని జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలు

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ జన్మదిన వేడుకలను బుధవారం కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పెద్ద కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు ఆయనకు తెలిపారు. రాజకీయా పార్టీలకు అతీతంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు. తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లంపేట మాజీ సర్పంచ్ మాదాసు వెంకటేష్, నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్, చందు ముదిరాజ్, రంగరాయ ప్రసాద్, సలీం తదితరులు పాల్గొన్నారు.



## గాజులరామారం డివిజన్‌లో రూ.79 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) గాజులరామారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో రూ.79 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు. శ్రీ వెన్ ఎంక్లేవ్‌లో రూ.38 లక్షలు, సరస్వతి ఆర్కేడ్‌లో రూ.20 లక్షలు, మెట్కానీ గూడలో రూ.21 లక్షల నిధులతో ఈ పనులను చేపట్టనున్నారు.
ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.
తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే నియోజకవర్గంలోని వివిధ కాలనీల్లో కోట్లాది రూపాయలతో అంతర్గత డ్రైనేజీలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనూ అదే తరహాలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.
గత పదేళ్ల టీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని కూన శ్రీశైలంగౌడ్ విమర్శించారు. ప్రజల అవసరాలను పట్టించుకోకుండా నాయకులు కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించుకున్నారని ఆరోపించారు.
ఈప్రాంతాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.
ఈకార్యక్రమంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్‌తో కాలనీ అధ్యక్షులు సభ్యులు శ్రీధర్ గౌడ్, సోమరాజు, రాజశేఖర్ రెడ్డి, కేశవ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సునీల్, భూపాల్ రెడ్డి కాలనీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెగించి కొట్లాడితే తెలంగాణ వచ్చింది

### - ఉద్యమకారుల హక్కుల కోసం

### మరో ఉద్యమం తప్పదా...బోయి వెంకటరమణ

హైద్రాబాద్ ఆగస్టు 19(ప్రజాకలం న్యూస్)

లాఠీ దెబ్బలు తిన్నాం,కేసులు మోసినం , ఉద్యోగాలు వదులుకున్నాం, కుటుంబాలను సైతం పణంగా పెట్టాం ఎందుకు? మన పిల్లల భవిష్యత్తు కోసం! మన తెలంగాణ బంగారు తెలంగాణగా మార్చు తేవాలని! ఈరోజు మన కల నెరవేరిందా..? ప్రత్యేక రాష్ట్రం వచ్చింది.అంత వరకే, కానీ కల సాకారం కాలే, నాయకుల కలలు నెరవేరినాయి. ఉద్యమకారులని ఈ నాయకులు రోడ్డున పడేశారు. ఇది కేవలం నాయకుల వల్ల తెలంగాణ రాలేదు. వీధిలో నిలబడి నినదించిన ప్రతి ఉద్యమకారుడి రక్తాన్ని చెమటగా చిందిస్తే,తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చింది.కానీ ఈరోజు ఆ ఉద్యమకారుడి పరిస్థితి ఏమిటి?
2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో స్పష్టంగా రాసింది. ప్రతి ఉద్యమకారునికి నెలకు 25 వేల గౌరవ పెన్షన్, 250 గజాల గృహ స్థలం ఇస్తాం అని.ఆ మెనఫెస్టో మీద మనం నమ్మకం పెట్టుకున్నాం. ఆ హామీ మీద ఓటు వేసాం.కానీ ఈరోజు వరకు ఆ జీవో రాలేదు.ఆ ఫైల్ కదలేదు. ఉద్యమకారుడు ఇంకా అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఉద్యమకారుడు ఇంకా రోజు కూలీ కోసం ఎదురు చూస్తున్నాడు.
ఇది న్యాయమా? ఇది మనం సాధించుకున్న తెలంగాణ లక్షణమా...?
మేము భిక్షం అడగడం లేదు. మేము అడుగుతుంది,మా స్వాభిమానం! మా త్యాగానికి గుర్తింపు!ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. సెప్టెంబర్ 27 లోపు 25 వేల పెన్షన్, 250 గజాల స్థలానికి సంబంధించిన జీవో విడుదల చేయండి.మీరు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ద్వారా తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం అంటే నమ్మకం" అని మరోసారి నిరూపించండి.



ఒకవేళ మా మాట వినకపోతే... తెలంగాణ సాధించుకునేందుకు ఎలాంటి పోరాటం చేసామో, ఆ హక్కులు సాధించుకునేందుకు కూడా అదే స్థాయిలో ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం చేస్తాం.ప్రతి జిల్లాలో ధర్నాలు చేస్తాం,ప్రతి మండలంలో దీక్షలు చేస్తాం, చివరికి హైద్రాబాద్ లో లక్షల మందితో ఉద్యమకారుల మహా గర్జన" చేస్తాం.మా డిమాండ్ ఒక్కటే హామీ నెరవేర్చు! గుర్తింపు ఇవ్వు!
జై తెలంగాణ! జై ఉద్యమకారుడు!
ఉద్యమాబినందనలో..మీ తెలంగాణ ఉద్యమకారులు,
బి.వి.రమణ అంబర్పెట్ నియోజకవర్గం,
తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు.

# చట్టంపై అవగాహన కల్పించుకొని బాధ్యతతో, గౌరవంగా మనుగడ సాగించాలి

### - జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవి లత




యాదగిరిగుట్ట, ఆగస్టు 19 (ప్రజా కలం)

ఎంతో ప్రగతి చెందుతున్న నేటి ప్రపంచంలో మానవ అక్రమ రవాణా చేయటం,వ్యభిచార కోపంలోకి పంపటం అమానుషం అని జిల్లా జడ్జి వి.మాధవి లత అన్నారు దీనిని అరికట్టడంలో అందరూ బాధ్యతగా కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు,జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు వారి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాంటీ-హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ మరియు జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో పాత యాదగిరిగుట్టలోని సాహితి కన్వెన్షన్ హాల్ లో మానవ అక్రమ రవాణ బాదితులకు ఏర్పరిచిన జాతీయ న్యాయ సేవల పథకంపై,మానవ అక్రమ రవాణా చట్టం,శిక్షల అమలు, సమాజం మీద పడే ప్రభావం అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వి.మాధవి లత మానవ అక్రమ రవాణ బాదితులకు న్యాయ సేవ సంస్థ సంబంధిత శాఖల సమన్వయంతో పునరావాసం, పరిహారం,న్యాయ సేవలు అందించనున్నట్లు,ఎంతో ప్రగతి చెందుతున్న నేటి ప్రపంచంలో రవాణా చేయటం,వ్యభిచార కోపంలోకి పంపటం అమానుషం అని దీనిని అరికట్టడంలో అందరూ బాధ్యతగా కృషి చేయాలని, రాజ్యాంగ హక్కు అందరికి కల్పించిందని గౌరవంగా బ్రతికే విదంగా బాధితులకు చేయోత ఇవ్వాలని తెలిపారు,ఇంతే కాకుండా పునరావాసంలో భాగంగా అన్ని శాఖల జిల్లా అధికారులతో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించటమే కాకుండా వారికి మద్దత్తుగా సేవలు అందిస్తారని తెలిపారు.యాదగిరిగుట్ట డిఎస్పి శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ బాదితులను గర్తించి వారి పిల్లలకు ఉన్నత విద్యను అందించటములో తమ పోలీసు శాఖ కృషి చేసిందని,లైంగిక వ్యాపారం నేరమని,కఠినమైన శిక్షలు ఉన్నవని,చట్టంపై అవగాహన కల్పించుకొనిబాధ్యతతో, గౌరవంగా మనుగడ సాగించాలని తెలిపారు. యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణపై యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ కొత్తగా ఈ జిల్లాలో ఏర్పడిందని,జిల్లాలో మానవ అక్రమ రవాణపై ఎప్పటి కప్పుడు డేగ కన్ను వేసి చర్యలు తీసుకుంటామని, అదేవిదంగా అవగాహన కల్పించటం,బాదితులకు పునరావాసం కల్పించటంలో కృషి చేస్తుందని తెలిపారు. యాదాద్రి బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీహరి మాట్లాడుతూ ఎవరికైనా న్యాయ సలహా,సేవలు కావాల్సివస్తే తమ న్యాయవాదులు తగిన సేవలు అందిస్తారని తెలిపారు.చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు బి. జయశ్రీ,డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగిరెడ్డి,జిల్లా సంక్షేమ అధికారి సి.హెచ్.శ్రీనివాస్,జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి అధికారి పద్మ,జిల్లా ఎస్ సి డెవలప్మెంట్ అధికారి సురేష్, జిల్లా యూత్ మరియు స్పోర్ట్స్ అధికారి శ్యామ్ సుందర్,జిల్లా బాలల సంక్షేమ అధికారిని అనంతలక్ష్మి,జిల్లా విద్యా శాఖ సియంఒ లింగారెడ్డి,జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్ డి పియం సుధాకర్,స్వామి రామనంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ డిటిఒ గుర్రం వెంకటేష్ లు,సఖి కేంద్రం సెంట్రల్ అడ్మిన్ వినీల, సార్ప్ఎన్ జిఒ డాక్టర్ ప్రమీల వారి శాఖల ద్వారా బాధితులకు,ప్రజలకు అందించే సేవలు,సంక్షేమ పథకాల గురించి వివరించారు.స్కీడ్ ఎన్ జిఒపిడి నాగరాజు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా బాదితులకు,ఎయిడ్స్ ఉన్న వారికి ఉచిత సేవలు అందిస్తున్నామని,వారు సంఘంలో నిలదొక్కుకోవటానికి చేయూత ఇస్తున్నామని తెలిపి, బాధితులకు కావాల్సిన లబ్ధిపై అధికారులకు దరఖాస్తు సమర్పించారు.ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ కమీషనర్ శ్రవణ్, యాదాద్రి యంపిడిఒ,సి ఐ భాస్కర్,సబ్ ఇన్స్పెక్టర్ తేజం రెడ్డి,స్కీడ్ ఎన్ జి ఒ జిల్లా కోఆర్డినేటర్ భాను కుమార్, బాదితులు,ప్రజలు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలపై రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం

బొమ్మలరామారం ఆగస్టు 19 (ప్రజా కలం)

ఎల్ నీనో ప్రభావంతో వరి పంటకు సరిపడా నీరు లేకపోతే వరి సాగు చేయకూడదని మండల వ్యవసాయ అధికారి దుర్గేశ్వరి మండల రైతులకు సూచించారు బుధవారం రోజున మండలంలోని కాజీపేట గ్రామంలో జొన్న మరియు కూరగాయల పంటలను సందర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరూ ఆరుతడి పంటలైన కందులు, ఉలువలు, పెసలరు, మినుములు, జొన్న వేరుశెనగ, కూరగాయల, సాగు చేయాలని రైతులకు సూచించారు రైతులందరూ తమ వ్యవసాయ భూముల్లో ఖాళీ ఉంచకుండా ఆరుతడి పంటలు వేసుకొని రైతులు పూర్తి రైతు భరోసా పొందాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఏఈఓ



సీమ,రైతులు మల్లేష్, గుండ్ల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలి

### - ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసరావు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజా కలం : మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండి తమ జీవితాలను కాపాడుకోవాలని ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసరావు




సూచించారు. బుధవారం ఆయన మండలంలోని జంగమాయపల్లి గ్రామంలో నిర్వహించిన సైబర్ నేరాలు, డ్రగ్స్, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలతో పాటు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ప్రయాణం చేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, హెల్మెట్ ధరించి ప్రయాణించాలని ఆయన సూచించారు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎందరో కేవలం హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అంతేగాని నిర్లక్ష్యంగా వ్యవహరించి తమ కుటుంబ సభ్యులను దుఃఖంలోకి నెట్టకూడదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాములు, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి, ఎస్ఐ సుబ్రహ్మణ్య చారి, ఉప సర్పంచ్ సిద్ధిరాములు, కార్యదర్శి ప్రదీప్, విపిఓ వెంకటరమణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలి: కోదండరాం

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) తెలంగాణ జన సమితి పార్టీ మేడ్చల్ జిల్లా కమిటీ సమావేశం రాష్ట్ర కార్యాలయంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కోదండరాం అతిధులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్, బైరి రమేష్ హాజరై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో మేడ్చల్ జిల్లాలో పార్టీ అభివృద్ధి గురించి పార్టీ నిర్మాణం గురించి చర్చించారు. ఈసమావేశంలో మారం లక్ష్మారెడ్డిని అధ్యక్షునిగా, దయాకర్ ప్రధాన కార్యదర్శిగా, శ్రీనివాసును ఉపాధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగింది. పూర్తిస్థాయి కమిటీని త్వరలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి ఎన్నుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అశోక్ రెడ్డి, మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షులు అంజనేయులు, యువజన విభాగం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎర్ర వీరన్న, మేడ్చల్ జిల్లా యూజన విభాగం అధ్యక్షులు రాజు ముదిరాజ్, వెంకట చారి, లక్ష్మణ్, సూరం నరసింహులు, రవి, శ్రీనివాసరెడ్డి, సుమంత్ రెడ్డి, మహేందర్ నాయకులు పాల్గొన్నారు



## బోనాలకు మంత్రులు అడ్లూరి, శ్రీధర్ బాబుకు మాజీ మేయర్ అజయ్ యాదవ్ ఆహ్వానం..

మేడిపల్లి ఆగస్టు 19(ప్రజాకలం న్యూస్)

బోడుప్పల్‌లో జరగనున్న బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ బుధవారం వారి కార్యాలయాలలో కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్,చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షులు పోగుల దిలీప్ రెడ్డి, బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు సుమన్ భూక్యా, కిరణ్ కుమార్ రెడ్డి, చీరాల నర్సింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జక్క రాములు,ధానగళ్ల యాదగిరి,గుర్రాల వెంకటేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.





# గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ తిరుపతి మృతి

## నివాళులర్పించిన సీపీ సాయి చైతన్య

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 19:

రెంజల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ, ప్రస్తుతం ఆర్మూర్ ఏసీపీ కార్యాలయంలో అటాచ్డ్‌గా పనిచేస్తున్న తలారి తిరుపతి (54) (హెచ్.సి 1549) మంగళవారం ఆకస్మిక గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మృతితో పోలీస్ శాఖలో తీవ్ర విషాదం నెలకొంది.బుధవారం ఆర్మూర్‌లో నిర్వహించిన తిరుపతి అంత్యక్రియలకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ (సీపీ) శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్ స్వయంగా హాజరయ్యారు. తిరుపతి పార్థివదేహానికి పుష్పగుచ్ఛం సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ కష్టసమయంలో తోటి సిబ్బందిగా పోలీస్ శాఖ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని సీపీ భరోసా ఇచ్చారు. తిరుపతి మరణం పోలీస్ శాఖకు తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ, బోధన్ రూరల్ సీఐ విజయబాబు, రెంజల్ ఎస్సై ఎం. గంగాధర్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు షకిల్ పాషా మరియు పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొని అంతిమ నివాళులు అర్పించారు.

# మహిళా సంఘాల బలోపేతానికి ఐకేపీ కృషి

- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర ఐకేపీ సంస్థ అధ్యక్షుడు కుంట గంగారెడ్డి

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 19:

మహిళల ఆర్థికాభివృద్ధి, సామాజిక సాధికారత కోసమే ఐకేపీ నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర ఐకేపీ సంస్థ అధ్యక్షుడు కుంట గంగారెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా



కమ్మర్‌పల్లి మండలం కొనసముందర్ గ్రామంలోని శివ ఫంక్షన్ హాల్‌లో బుధవారం గ్రామ సమైక్య మహిళా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఐకేపీ సీసీ అడెల్లి రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గంగారెడ్డితో పాటు ఏపీఎం కిరణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు సభ్యులంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామ సమైక్య మహిళా సంఘాల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం వివరాలు:
గ్రామ మహిళా సంఘాల అధ్యక్షురాలు: పోతనక మౌనిక
ఉపాధ్యక్షురాలు: ఆది గంగా నర్సు
కార్యదర్శి: అల్లకొండ శ్యామలసహాయ కార్యదర్శి: భోగం సరిక
వివో సంఘాల అధ్యక్షులు: ప్రతిభ, ఇందిర
కార్యవర్గ సభ్యురాలు: సరస్వతి (శ్రీనిధి మేడం)

ఈ సమావేశంలో ఐకేపీ సీసీ పీరియా నాయక్, గ్రామ ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో కెమెరా సృష్టికర్త అయిన లూయిస్ జాక్విస్ మండేడాగురే చిత్రపటానికి ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేర్ల విట్టల్ పూలమాల వేసి, జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ ఫోటోగ్రాఫర్లైన త్యార్ల ప్రసాద్, గూడ రామకృష్ణ లను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పద్మకృష్ణ, కోశాధికారి గూడ రామకృష్ణ ఉపాధ్యక్షులు షేర్ల వినోద్ , జిల్లా ఉపాధ్యక్షుడు బి కార్తీక్ ,హనుమంతు, రాజు, రవికుమార్ , భరత్, ఎల్లేష్, శివ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





జప్తి జానకం పల్లి గ్రామంలో....

నాగిరెడ్డి పేట మండలంలోని జప్తి జాన్కంపల్లి గ్రామ పాఠశాలలో బుధవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అమ్మ ఫోటో స్టూడియో రాజు ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త లూయిస్ జాకాస్ మండే డాగురె గుర్తుగా పిల్లలకి వాక్ క్ష?య్రోన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మాటల్లో చెప్పలేని భావాలను కాలంలో ఆగిపోయిన జ్ఞాపకాలను ఒక్క క్లిక్ తో శాశ్వతంగా నిలిపే అద్భుత కలే ఫోటోగ్రఫీ అని తెలిపారు. 1839 ఆగస్టు 19న ప్రారంభమైన ప్రయాణం ఈ రోజు ప్రతి ఒక్కరి చేతులో ఒక కెమెరా వచ్చి ప్రతి ఒక్కరికి ఫోటోగ్రఫీ చేరువ అయింది అని గుర్తుచేశారు. అందరికీ ఫోటోగ్రఫీ దే శుభాకాంక్షలు తెలియజేశారు. తాను చదువుకున్న స్కూల్ లో డొనేట్ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో ఫరూక్, రాజు, గణేష్, ఫోటోగ్రాఫర్ లు పాల్గొన్నారు.

# వర్షాకాలం ఆరోగ్యఅతిథి 'అడవి కాకర'

## - ఇది మల్టీ విటమిన్లకు చిరునామా

## - దీనిలో విటమిన్ ఏ, సి, బి 9 తో పాటు ఐరన్, మెగ్నీషియం, పొటాషియం లభ్యం

హైదరాబాద్, కామారెడ్డి
ఆగస్టు 19 (ప్రజా కలం ప్రతినిధి)

వర్షాకాలం సీజన్ ప్రారంభమైందంటే చాలు... వంటింట్లోంచి వచ్చే ఘుమఘుమల్లో ఇట్టే తేడా కనిపిస్తుంది. అల్లం, వెల్లుల్లి, పుదీనా తదితరాల వాడకం ఎక్కువవుతుంది. మార్కెట్‌లో గుమ్మడికాయ, కాకరకాయ, బెండకాయ, పొట్లకాయ లాంటి కూరగాయల హవా మొదలవుతుంది. అయితే ఏడాది పొడవునా దొరికే వీటిని పట్టించుకోకుండా... వానాకాలపు ఆరోగ్య అతిథి కోసం తెగ వెదుకుతుంటారు గృహిణులు. అదే బొంత కాకరకాయ.... కొన్ని ప్రాంతాల్లో బోడ కాకరకాయ, అడవి కాకరకాయ అంటారు. కేవలం మాన్‌సూన్ సీజన్‌లోనే కనిపించే బొంత కాకరకాయ ఎంతో అపురూపమైన కూరగాయ. ధర కాస్త ఎక్కువగా ఉన్నప్పటికీ ఆరోగ్య కారణాలతో ఈ సీజన్‌లో వీటిని తప్పక తింటుంటారు.




**దీనికి ఒక్కో చోట ఒక్కో పేరు...**

భారతదేశం ఎంతో వైవిధ్యమైన దేశమని చెప్పడానికి బొంత కాకరకాయను చూపొచ్చు. ఎందుకంటే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో దీనిని పిలుస్తుంటారు. తెలుగువాళ్లు అడవి కాకరకాయ, బోడ కాకరకాయ, బొంత కాకరకాయ అంటారు. అదే హిందీలో – కాకోడా, మరాఠీలో – కంటోలి, గుజరాతీలో – కంటోలా, తమిళంలో– మూకు పావక్కాయ్, మలయాళంలో – కొట్టుపావక్కా, కన్నడలో – మాడహాగలకాయి... ఇలా వీటికి ఎన్నో పేర్లు. దీని తోలుపై మెత్తని ముళ్లు ఉండడం వల్ల ఇంగ్లీష్‌లో 'స్పైనీ గార్డ్' అంటారు. దేశమంతా ఈ కూరగాయ ప్రాచుర్యంలో ఉన్నప్పటికీ... మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రజలు అమితంగా బొంత కాకరకాయ రుచుల్ని ఆస్వాదిస్తారు.

**ఇది మల్టీ విటమిన్లకు చిరునామా...**

పేరును బట్టి బొంత కాకరకాయ, మామూలు కాకరకాయలాగానే చేదుగా ఉంటుందని అనుకుంటే పొరపాటే. నిజానికి ఇవి రెండూ ఒకే కుటుంబానికి చెందినా కూడా కాకరకాయంత చేదు ఇందులో ఉండదు. పైగా రెండిటి రూపం వేరు. కాకరకాయ పొడుగ్గా, తోలంతా గచ్చులు గచ్చులుగా ఉంటుంది. బొంత కాకరకాయ పరిమాణం చిన్నది. గుప్పిట్లో ఒదిగిపోతుంది. తీగబాకే ఈ కాకరకాయ చెట్లకి ఎక్కువ ఆలనా పాలనా, నీళ్ల అవసరం ఉండదు. వర్షాలు పడగానే చిగురించి మొక్కగా పెరిగి, తీగ పాకుతుంది. మనదేశంతో పాటు బంగ్లాదేశ్, శ్రీలంకల్లో వీటిని విరివిగా పండించడమే కాకుండా వినియోగిస్తారు కూడా. బొంతలో గింజలు చిన్నవి. కండ ఎక్కువగా ఉండే కూరగాయ ఇది. అందుకే రకారకాల పద్ధతుల్లో రుచికరంగా వండుకోవచ్చు. కూరలే కాకుండా... పచ్చళ్లు, వరుగులు కూడా పెట్టుకోవచ్చు. సాధారణ కాకరకాయ చేదుకు దూరంగా పరుగెత్తే పిల్లలు బొంత కాకరకాయ కూరంటే ఇష్టంగా తింటారు. వేయించిన నువ్వులు, బెల్లం కలిపి కూర చేస్తే ఎవరైనా ఇష్టంగానే తింటారు.

**ఆరోగ్యప్రదాయిని అడవి కాకర...**

ఆరోగ్యానికి వీటిని చిరునామాగా చెబుతారు. బొంత కాకరకాయల్లో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ బి9తో పాటు ఐరన్, మెగ్నీషియం, పొటాషియం లాంటి ఖనిజాలున్నాయి. ఇన్ని రకాల విటమిన్లు, మినరల్స్ ఉన్నాయి కాబట్టి న్యూట్రిషనిస్టులు బొంత కాకరకాయను 'మల్టీ విటమిన్ పిల్' అని, 'లిటిల్ పవర్‌హౌజ్' అని రికమండ్ చేస్తారు.

**ఇంకా వీటి వల్ల కలిగే విశిష్ట లాభాలేంటో చూద్దాం...**

1.రక్తపోటు నియంత్రణ : ఆధునిక జీవనంలో అందరినీ ఇబ్బంది పెడుతోన్న సమస్య అధిక రక్తపోటు. సీజనల్‌గా లభించే బొంత కాకరకాయని తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులోకి వస్తుంది. ఒక్క కూరగాయ వల్ల ఇది సాధ్యమా? అనే సందేహం రాకమానదు. కానీ ఇది నిజం. ఈ కాకరకాయలో ఎక్కువగా పీచుపదార్థాలుంటాయి. తీసుకున్న ఆహారంలోని చక్కెరలను నెమ్మదిగా గ్రహించేలా చేసి చక్కెర స్థాయులను, తద్వారా బీపీని నియంత్రిస్తుంది. కాబట్టి షుగర్ ఉన్న వాళ్లకి ఈ కూరగాయ ఎంతో మేలు చేస్తుంది.

2. జీర్ణవ్యవస్థకు సహాయకారి : పేగుల్లో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా పెరిగేలా సహాయపడుతుంది. గట్ ఆరోగ్యంగా ఉండేలా సహాయపడుతుంది. పీచుపదార్థాల వల్ల జీర్ణం సాఫీగా సాగేలా చేస్తుంది.

3.చర్మ సంరక్షణ: గరకుగరుకుగా ఉండే బొంత కాకరకాయ చర్మ సంరక్షణకు విశేషంగా దోహదపడుతుంది. దీనికి కారణం ఇందులో తేమ అధికంగా ఉంటుంది. అందుకే చర్మాన్ని తాజాగా ఉంచుతుంది. ఇంకా ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనాల్స్ కణాలు దెబ్బతినకుండా చూస్తాయి. జీవనశైలి వ్యాధులను అరికడుతుంది. విటమిన్ ఎ, సి ల వల్ల కొల్లాజన్‌ను ఉత్పత్తి చేసి... శరీరంలోని కణాలు దెబ్బతినకుండా సహాయపడుతుంది. చర్మం ముడతలు పడకుండా నివారిస్తుంది. దీనిని యాంటీ ఏజింగ్ ఏజెంట్‌గా పేర్కొంటారు. అలాగే వీటిని ఈ సీజన్‌లో తినడం వల్ల ముఖంపై మొటిమలు, దద్దుర్లు లాంటి వాటిని అరికట్టవచ్చు.

4.బరువు తగ్గుదలకు : ఈ కూరగాయలో తక్కువ క్యాలరీలున్నాయి కాబట్టి బరువు నియంత్రణకు చక్కగా ఉపయోగపడుతుంది. పీచుపదార్థాలు ఎక్కువగా ఉన్నందువల్ల తరచుగా ఆకలి వేయదు. కడుపు నింపడమే కాకుండా చక్కటి పోషక పదార్థాలను శరీరానికి అందిస్తూ బొంత కాకరకాయ ఎంతో మేలు చేస్తుంది. అన్ని వయసుల వారికీ మంచిది. పీసీఓఎస్‌తో బాధపడుతున్న వాళ్లూ వీటితో లాభపడవచ్చు.

5.కంటి ఆరోగ్యానికి : బొంత కాకరకాయలో కెరోటినాయిడ్స్, బీటా కెరోటిన్, విటమిన్ ఎ ఉండడం వల్ల కంటి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. దృష్టిని మెరుగుపరుస్తుంది.

ఇలా బొంత కాకరకాయలో ఉన్న సుగుణాలెన్నో. అందుకే పోషకాలకు సంబంధించి పవర్ హౌజ్‌గా దీన్ని పేర్కొంటారు. అయితే ఆకుపచ్చగా ఉన్న బొంత కాకరకాయలనే తినాలి. పండిన వాటి జోలికి వెళ్లొద్దు. మెత్తని ముళ్ల తొక్కలోనే ఎన్నో పోషకాలున్నాయి కాబట్టి తొక్కతో పాటే వండాలన్నది మర్చిపోకూడదు. ఈ సీజన్‌లో మాత్రమే వచ్చే బొంత కాకరకాయ ఒకరకంగా ఆరోగ్యానికి ఔషధం లాంటిది. అన్నంలోకి పులుసుకూర, రొట్టెల్లోకి ఫ్రైతో పాటు అనేక రకాలుగా ఆరగించొచ్చు. ఆరోగ్యాన్ని పొందొచ్చు.

**దీని విత్తనాలకూ భలే గిరాకీ....**

బొంత కాకరకాయ చెట్టులో అన్నీ ఉపయోగకరమే. అందుకే పది కిలోల విత్తనాల ధర మూడు నుంచి అయిదు వేల రూపాయల వరకు ఉంటుంది. ఎండిన వేర్లను కూడా కిలోకు నాలుగు వందల చొప్పున అమ్ముతుంటారు. ఆకులు, వేర్లు, కాండం, విత్తనాలను ఆయుర్వేద వైద్య విధానంలో విరివిగా ఉపయోగిస్తుంటారు. తలనొప్పి, పైల్స్, పాముకాటు తదితర సమస్యల పరిష్కారంలో ఈ చెట్టు వివిధ భాగాలను వినియోగిస్తారు. చత్తీస్‌గఢ్‌లో కొన్ని ఆదిమ జాతి తెగలు రుమాటిజమ్, జ్వరం, డయేరియాలాంటి అనారోగ్యాలను బాగు చేసేందుకు బొంత కాకరకాయ వేర్లను ఉపయోగించడం విశేషం.

వంద గ్రాముల బొంత కాకరకాయలో..
క్యాలరీలు – 17
నీటి శాతం – 84.1 శాతం
కార్బోహైడ్రేట్లు – 7.7 గ్రాములు
ప్రొటీన్లు – 3.1 గ్రాములు
కొవ్వు – 3.1 గ్రాములు
ఫైబర్ – 3 గ్రాములు
మినరల్స్ – 1.1 గ్రాము



# GO No.97ను వెంటనే రద్దు చేయాలి

## ఐటీఐ--పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థలను విలీనం చేయడం కాదు అభివృద్ధి చేయాలి

## విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దు ~ PDSU

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 19:

ఐటీఐ,డిప్లొమా విద్యా వ్యవస్థలను విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నం.97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పై డి ఎస్ యూ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడం జరిగింది.

ఈ సందర్భంగా పి డి ఎస్ యూ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కర్క గణేష్, గౌతం కుమార్ లు మాట్లాడుతూ,

"విలీనం వద్దు -- విద్యా వ్యవస్థలను బలోపేతం చేయాలి", జీఓ నం.97 రద్దు చేయాలి", "విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి" అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారన్నారు. పోలీసులు విద్యార్థులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కొంతసేపు విద్యార్థులకు పోలీసులకి మధ్య తోపులాట చోటుచేసుకుందనీ తెలిపారు. అనంతరం విద్యార్థులు కళాశాల గేటు దాటి రోడ్డుపైకి వచ్చి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారన్నారు.

విలీనం కాదు,రెండు విద్యా వ్యవస్థల అభివృద్ధి కావాలి

ఐటీఐ విద్యకు, పాలిటెక్నిక్ డిప్లొమా విద్యకు వాటి స్వంత విద్యా విధానం, శిక్షణా విధానం, కోర్సుల నిర్మాణం, నైపుణ్యాల లక్ష్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. రెండు విభిన్న విద్యా వ్యవస్థలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం వల్ల భవిష్యత్తులో విద్యా ప్రమాణాలు, కోర్సుల ప్రత్యేకత, ప్రయోగాత్మక శిక్షణ, విద్యార్థుల ఉన్నత విద్య--ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ఐటీఐ కళాశాలలను, పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేయడం గురించి కాకుండా రెండు వ్యవస్థలను విడివిడిగా బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.



ఐటీఐలను బలోపేతం చేయడానికి కొత్త కోర్సులు, ఆధునిక యంత్రాలు, నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఎందుకు ఏర్పాటు చేయకూడదనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టులు, ఆధునిక ల్యాబ్‌లు, పరికరాలు, హాస్టల్ సౌకర్యాలు ఎందుకు కల్పించకూడదనీ ప్రశ్నించారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాల్సిన ప్రభుత్వం విలీనాలపై కాకుండా ప్రభుత్వ విద్యాసంస్థల మౌలిక వసతులు, అధ్యాపకులు, ప్రయోగశాలలు, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాలని పి డి ఎస్ యూ డిమాండ్ చేసింది. విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా జీఓ నం.97ను అమలు చేయడం సరికాదని, ప్రభుత్వం వెంటనే విద్యార్థులు, అధ్యాపకులు, నిపుణులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. జీఓ నం.97ను వెంటనే రద్దు చేసి, ఐటీఐ--పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థలను ప్రత్యేకంగా అభివృద్ధి చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ నిజామాబాద్ జిల్లా నాయకులు ప్రిన్స్, సృజన, మున్నా, పవన్, అరవింద్, రాజు, అర్జున్, ప్రశాంత్, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

# నెట్ జీరో దిశగా 'గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్'

## గ్రీన్ భవనాల నుంచి సుస్థిర నిర్మిత వాతావరణం వైపు అడుగులు

## నవంబర్ 26 నుంచి 28 వరకు ముంబైలో సదస్సు

**ముంబై, ఆగస్టు 19 (ప్రజా కలం ప్రతినిధి)**
దేశంలో వేగంగా విస్తరిస్తున్న నిర్మిత వాతావరణ రంగాన్ని సుస్థిరత వైపు మళ్లించేందుకు 'గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్--2026' వేదిక కానుంది. సీఐఐ--ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నవంబర్ 26 నుంచి 28 వరకు ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ సదస్సు నిర్వహించనున్నారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ఆర్థిక రంగం, విద్యా సంస్థలు, దేశ, విదేశాలకు చెందిన సుస్థిరత నిపుణులు ఇందులో పాల్గొననున్నారు.

'సుస్థిర భవిష్యత్తును నిర్మిద్దాం--మంచి చేద్దాం, మంచి అనుభూతిని పొందుదాం. కలిసి మరింత హరిత ప్రపంచాలను నిర్మిద్దాం' అనే ఇతివృత్తంతో సదస్సు జరగనుంది. తక్కువ కార్బన్ ఉద్గారాలు, వాతావరణ మార్పులను తట్టుకునే నిర్మాణాలు, నెట్-జీరో లక్ష్యాల సాధనకు అవసరమైన విధానాలు, సాంకేతికత, ఆవిష్కరణలు, పెట్టుబడులపై చర్చించనున్నారు.

**16.33 బిలియన్ చదరపు అడుగులు**

దేశంలో గ్రీన్ బిల్డింగ్ ఉద్యమం గణనీయంగా విస్తరిస్తోందని నిర్వాహకులు తెలిపారు. గత 25 ఏళ్లలో ఐజీబీసీ పరిధిలో 20 వేలకుపైగా ప్రాజెక్టులు నమోదయ్యాయి. వీటి పరిధి 16.33 బిలియన్ చదరపు అడుగులకు చేరింది. ప్రపంచంలోనే ఇది రెండో అతిపెద్ద గ్రీన్ బిల్డింగ్ విస్తీర్ణమని పేర్కొన్నారు. ఇప్పటివరకు గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్‌కు రెండు లక్షలకుపైగా మంది హాజరయ్యారు.

**బాధ్యతాయుత నిర్మాణాలే లక్ష్యం**

భారతదేశం అభివృద్ధిలో కీలక దశలో ఉందని సీఐఐ--ఐజీబీసీ జాతీయ ఛైర్మన్ సి. శేఖర్ రెడ్డి అన్నారు. రాబోయే దశాబ్దాల భవిష్యత్తును నిర్దేశించే నగరాలు, మౌలిక సదుపాయాలను ప్రస్తుతం నిర్మిస్తున్నామని తెలిపారు. 'నిర్మించాలా లేదా?' అనే ప్రశ్న కంటే 'ఎంత బాధ్యతాయుతంగా నిర్మించగలం?' అనేదే ముఖ్యమని పేర్కొన్నారు. సుస్థిరత ప్రతి అభివృద్ధి నిర్ణయంలోనూ ప్రాథమిక అంశంగా మారాలని ఆయన అన్నారు.

**విస్తృత స్థాయి అమలే తదుపరి దశ**

గ్రీన్ బిల్డింగ్ రంగంలో తదుపరి దశ నిబద్ధత నుంచి విస్తృత స్థాయి అమలుకు మారాల్సిన అవసరం ఉందని సీఐఐ--ఐజీబీసీ జాతీయ వైస్ ఛైర్మన్ ఏ.ఆర్. ఉన్నికృష్ణన్ తెలిపారు. వ్యక్తిగత ప్రాజెక్టులకు మాత్రమే పరిమితం కాకుండా నగరాలు, మౌలిక సదుపాయాల్లో సమగ్ర మార్పు తీసుకురావాల్సి ఉందన్నారు. పరిశ్రమలు, ప్రభుత్వం, ఆర్థిక రంగం, సాంకేతిక సంస్థలు, విద్యా రంగం మధ్య బలమైన భాగస్వామ్యాలు అవసరమని పేర్కొన్నారు.

**3 వేల మందికి పైగా ప్రతినిధులు**

గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్--2026కు 3 వేల మందికిపైగా ప్రతినిధులు, 10 వేల మందికిపైగా వ్యాపార సందర్శకులు హాజరవుతారని అంచనా. 150 మందికిపైగా నిపుణులు, ఆలోచనా నాయకులు, 100కుపైగా సంస్థాగత, పరిశ్రమ భాగస్వాములు పాల్గొననున్నారు. సదస్సుతో పాటు గ్రీన్ బిల్డింగ్ ఎక్స్‌పోను నిర్వహించనున్నారు. గత ఏడాది సదస్సులో వెయ్యికిపైగా వ్యాపార సమావేశాలు జరగగా, మూడు రోజుల కార్యక్రమానికి 8 వేల మందికిపైగా ప్రతినిధులు, సందర్శకులు హాజరయ్యారు.

Confederation of Indian Industry

# గెలాక్సీ ఫోల్డ్8 కొనుగోలుదారులకు 'గెలాక్సీ ఫరెవర్'

## - 24 నెలల వడ్డీలేని ఈఎంఐ.. 55 శాతం వరకు బైబ్యాక్ హామీ

## - శామ్‌సంగ్ కేర్ ప్లస్‌తో అదనపు రక్షణ



**హైదరాబాద్, ఆగస్టు 19 (ప్రజా కలం ప్రతినిధి)**
ప్రీమియం ఫోల్డబుల్ ఫోన్‌లను యువతకు మరింత అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో శామ్‌సంగ్ ఇండియా 'గెలాక్సీ ఫరెవర్' పేరుతో కొత్త యాజమాన్య పథకాన్ని ప్రవేశపెట్టింది. గెలాక్సీ జెడ్ ఫోల్డ్8 అల్ట్రా, గెలాక్సీ జెడ్ ఫోల్డ్8 కొనుగోలుదారులకు ఈ పథకం కింద 24 నెలల వడ్డీలేని ఈఎంఐ, శామ్‌సంగ్ కేర్ ప్లస్ పరికర రక్షణ, 55 శాతం వరకు హామీతో కూడిన బైబ్యాక్ విలువ లభించనున్నాయి.

పథకం ద్వారా ప్రస్తుత ఫోన్‌ను కొనసాగించడంతోపాటు, భవిష్యత్తులో కొత్త గెలాక్సీ ఫ్లాగ్‌షిప్ ఫోన్‌కు మారాలనుకునే వినియోగదారులకు ముందుగానే స్పష్టమైన అప్‌గ్రేడ్ మార్గాన్ని శామ్‌సంగ్ అందిస్తోంది. మార్కెట్‌లో పాత ఫోన్‌కు లభించే పునర్విక్రయ ధరపై పూర్తిగా ఆధారపడాల్సిన అవసరం లేకుండా నిర్ణీత నిబంధనల ప్రకారం బైబ్యాక్ సదుపాయం పొందవచ్చు.

**నెలకు రూ.9,417 నుంచి..**

గెలాక్సీ జెడ్ ఫోల్డ్8 అల్ట్రాను ఈ పథకం ద్వారా నెలకు రూ.9,417 చొప్పున పొందవచ్చు. ఇందులో రూ.8,334 పరికర ఈఎంఐ, రూ.1,083 పథకం రుసుము ఉంటుంది. గెలాక్సీ జెడ్ ఫోల్డ్8 నెలకు రూ.8,584 నుంచి లభిస్తుంది. ఇందులో రూ.7,500 పరికర ఈఎంఐ, రూ.1,084 పథకం రుసుము ఉంటాయి. రెండు పథకాలు 24 నెలల వడ్డీలేని ఈఎంఐపై ఆధారపడి ఉంటాయి.

**బైబ్యాక్ విలువ ఇలా..**

వినియోగదారులు ఎప్పుడు అప్‌గ్రేడ్ అవుతారన్న దాని ఆధారంగా పరికర ఇన్‌వాయిస్ విలువపై బైబ్యాక్ హామీ మారుతుంది. 10, 11వ నెలల్లో 55 శాతం, 12, 13వ నెలల్లో 50 శాతం, 14 నుంచి 18వ నెల వరకు 45 శాతం, 19 నుంచి 25వ నెల వరకు 40 శాతం వరకు విలువ లభిస్తుంది.

**ప్రమాదవశాత్తు నష్టానికీ రక్షణ**

ఈ పథకంలో శామ్‌సంగ్ కేర్ ప్లస్ పరికర రక్షణ కూడా భాగంగా ఉంటుంది. ప్రమాదవశాత్తు జరిగే నష్టం, ద్రవ పదార్థాల వల్ల కలిగే నష్టాలకు రక్షణ లభించడంతోపాటు క్లెయిమ్ ప్రాసెసింగ్ రుసుము ఉండదని సంస్థ తెలిపింది.

వినియోగదారులు తమ ఫోన్‌ను పూర్తిగా కొనుగోలు చేసి సొంతం చేసుకునే సాధారణ విధానాన్ని కొనసాగించవచ్చని, అయితే ముందస్తు అప్‌గ్రేడ్ అవకాశాలు, పరికర రక్షణ, బైబ్యాక్ హామీ కోరుకునేవారికి 'గెలాక్సీ ఫరెవర్' ప్రత్యామ్నాయంగా ఉంటుందని శామ్‌సంగ్ పేర్కొంది.

# అభిజిత్ దిప్కే తో భేటీయైన తుషార్ గాంధీ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 19:
బుధవారం ఉదయం మహారాష్ట్ర ఔరంగాబాద్‌లోని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఫౌండర్ అభిజీత్ దిప్కే గారిని ఆయన నివాసంలో మహాత్మా గాంధీ మనువడు తుషార్ అరుణ్ గాంధీ మర్యాద పూర్వకంగా కలిశారు. మొన్న దేశ రాజధాని డిల్లీ నడిబొడ్డున జంతర్ మంతర్ ను గడగడలాడించి, ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేయించి, బ్రాహ్మణీయ ఫాసిజాన్ని చెక్ పెట్టిన డైనమిక్ విద్యార్థి నాయకులు దిప్కేతో సుదీర్ఘంగా మాట్లాడారు. దేశమంతట తమ జెన్-జీ తరం యావత్ ప్రజానీకాన్ని ప్రేరేపించి ఉత్తేజపరిచారని ఆయన అన్నారు. తనను కూడా వారు నిర్వహించిన శాంతియుత జెన్- జీ మహోద్యమం చాలా స్ఫూర్తినించిందని గాంధీ అన్నారు. ఈ సందర్భంగా వారితో అనేక సామాజిక రాజకీయ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ శుభ సమావేశంలో మహారాష్ట్ర నాయకులు ఇందర్జీత్ మోహితే, మయూర్ షిర్కే, మోయిజ్ బాద్‌షా "ముస్లిం మేధావుల ఫోరం" నాయకులు ఫిరోజ్ మిరిబోర్వాల తదితరులు పాల్గొన్నారు. ఔరంగాబాద్‌కు చెందిన ప్రఖ్యాత కామ్రేడ్ అమోల్ సరోదే కూడా హాజరయ్యారు.





# బీడు భూముల్లో ఫాంఫాండ్ లు నిర్మించుకునేలా రైతులను ఒప్పించాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 19 ప్రజా కలం : ఎల్లారెడ్డి మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీల్లో బీడు భూముల్లో ఫామ్ పాండు నిర్మించుకునేలా రైతులను ప్రోత్సహించాలని ఎంపీడీవో తాహెరా బేగం అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వారికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లోని పెద్ద రైతులను గుర్తించి ఉపాధి హామీ పథకంలో భాగంగా సాగునీరులేని, వ్యవసాయానికి పనికిరాని భూముల్లో ఫారం పాండ్లు నిర్మించుకునేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో ఈజీఎస్ ఏపిఓ వినోద్ గౌడ్, ఏఈవోలు ముఖీద్, రాజా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# నిజామాబాద్‌లో కాంగ్రెస్ SIR 2శిక్షణ తరగతులు

## హాజరైన మంత్రి సీతక్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 19:**
నిజామాబాద్ పట్టణంలోని ఎంకే గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా SIR 2 శిక్షణ కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ శిక్షణా




తరగతుల్లో నిజామాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, టీజీఎండీసీ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి వారితో కలిసి శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు.

రాబోయే రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహాలపై ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలిష్టం చేయడమే లక్ష్యంగా ఈ SIR 2 శిక్షణను నిర్వహించారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు, మండలాల అధ్యక్షులు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, మున్సిపల్ ఛైర్మన్లు, బూత్ స్థాయి ఏజెంట్లు, సూపర్‌వైజర్లు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



# ఎమ్మార్పీఎస్ నూతన మండల అధ్యక్షునిగా మొగిలి పాక యాదగిరి మాదిగ నియామకం

## - మాదిగల ఐక్యత దేశానికి వెన్నుముక్క

## - అలుపెరుగని పోరాట యోధుడు మందకృష్ణ మాదిగ

## యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జి బిర్రు మహేందర్ మాదిగ

భుదాన్ పోచంపల్లి ఆగష్టు 19 ( ప్రజా కలం )
ఎమ్మార్పీఎస్ పోచంపల్లి మండల ఇంచార్జ్ ఇటుకల దేవేందర్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ పోచంపల్లి మండల కమిటి ఎన్నిక సమావేశం పోచంపల్లి మండల కేంద్రం బాలాజీ ఫంక్షన్ హాల్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ జిల్లా ఇంచార్జి బిర్రు మహేందర్ మాదిగ హాజరు అయ్యారు. ఎమ్మార్పీఎస్ పోచంపల్లి మండలం నూతన అధ్యక్షునిగా మోగిలిపాక యాదగిరి ని నియమించారు. అనంతరం జిల్లా ఇంచార్జి బిర్రు మహేందర్ మాదిగ,మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వర్గీకరణ ఫలాలు అందుకోవాలి సూచించారు, మాదిగ జాతి అన్ని రంగాల్లో ముందుకు తేవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణమాదిగ 32సం" రాలుగా అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఎమ్మార్పీఎస్ లక్ష్యం అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమేనని అన్నారు. మాదిగ జాతి హక్కులు కోసం ఆత్మగౌరం కోసం, శ్రమిస్తున్నారు.ఆయన ఉద్యమానికి మద్దతుగా యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం నుంచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. సెప్టెంబర్ 9న వరంగల్ వేదికగా ఎమ్మార్పీఎస్ జాతీయ మహా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గానికై నియామక పత్రాన్ని అందించారు. మండల వ్యాప్తంగా అన్ని వర్గాలకు అండగా ఉండాలని కమిటి సభ్యులకు సూచించారు. నూతనంగా ఎన్నుకోబడిన సభ్యులు అధికార ప్రతినిధి కాంజర్ల గణేష్ మాదిగ, ఉపాఅధ్యక్షులు కొండమడుగు నర్సింహ, ప్రధాన కార్యదర్శి కందుకూరి పరమేష్,
కార్యదర్శి మూటపురం రాములు మాదిగ, సహాయ కార్యదర్శిలు సూరిగురి మధు మాదిగ, ప్రచార కార్యదర్శి వంగురి పరమేష్ మాదిగ యంఎస్ పి,మండల అధ్యక్షులుగా మీసాల నర్సింహా,ని నియమించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ ఇటుకల దేవేందర్ మాదిగ , పిల్లయిపల్లి గ్రామ సర్పెంచ్ పెరుమాళ్ళ మహా లక్ష్మి దానయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు యాకరి నర్సింగరావు, మాజీ మండల అధ్యక్షులు పాముకుంట్ల బసవయ్య, జిల్లా నాయకులు మచ్చ నర్సింహా,వంగూరి స్వామి, నాయకులు సిరిపంగి మహేష్, కోతులారం యాదగిరి, మొగిలిపాక శంకరయ్య , గోపాల్,యాదగిరి, పాముకుంట్ల దయాకర్, సందేనా పరమేష్,మనే,భాస్కర్,నాయకులు పాల్గొన్నారు.



# పోచంపల్లి లో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

## కెమెరా సృష్టికర్త లూయిస్ డాగెర్‌కు ఘన నివాళి -ఎస్సై జగన్

## జెండా ఆవిష్కరించిన కేమ విష్ణుమూర్తి

భుదాన్ పోచంపల్లి ఆగష్టు 19 ( ప్రజా కలం )
పోచంపల్లి మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పంచ ఫోటోగ్రఫీ డే మండల ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేమ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎస్సై ఎస్ జగన్ తో పాటు జిల్లా అధ్యక్షులు భోగచంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కేమ విష్ణుమూర్తి జెండాను ఆవిష్కరించగా ఈ సందర్భంగా ఎస్సై ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్ రే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన శాఖ కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షులు భోగ చంద్రశేఖర్ ప్రారంభించగా అనంతరం ఇటీవల మరణించిన ఫోటోగ్రాఫర్లు చక్క రమేష్, ఎలగందుల సత్యనారాయణ కుటుంబాలకు నిత్యవసర వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రచ్చరాజు, చింతల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రవ్వ నవీన్, ఉపాధ్యక్షులు చెక్క మల్లేష్, కోశాధికారి సకినాలసిద్దేశ్వర, సహాయ కార్యదర్శి దొడ్డమోని వంశీధర్, గౌరవ సలహాదారులు రచ్చ వినోద్ కుమార్, మాజీ అధ్యక్షులు దోర్నాల గణేష్, గుద్దేటి పాండు,కార్యవర్గ సభ్యులు ఏరువ విగ్నేష్, వంగూరి నరేష్, పుట్టపర్తిని కృష్ణ, దోర్నాల కరుణాకర్, చెరుపల్లి లక్ష్మణ్, భోగ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# దేశభక్తిని ప్రశ్నించడం సరికాదు

## - ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు



హైదరాబాద్, ఆగస్టు 19 (ప్రజా కలం ప్రతినిధి)

వందేమాతరం అంశాన్ని అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీపై దేశభక్తి లేదన్నట్లు బీజేపీ ప్రచారం చేయడం సరికాదని ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్ నాయకులు పోషించిన పాత్రను విస్మరించి రాజకీయ లబ్ధి కోసం దేశభక్తి అంశాన్ని ఉపయోగించుకోవడం తగదని విమర్శించారు.

సోనియా గాంధీ ప్రధానమంత్రి పదవిని సైతం తిరస్కరించి ప్రజల పక్షాన నిలిచారని హనుమంతరావు పేర్కొన్నారు. సోనియా గాంధీతో పాటు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, రాహుల్‌గాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వంటి కాంగ్రెస్ నేతల దేశభక్తిని ప్రశ్నించడం సరైంది కాదన్నారు. స్వాతంత్ర్య పోరాట వారసత్వం కాంగ్రెస్ నాయకులకు ఉందని గుర్తు చేశారు.

**రామాలయ ట్రస్ట్ నిధులపై విచారణ జరపాలి**

అయోధ్య రామాలయ ట్రస్ట్‌లో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని హనుమంతరావు డిమాండ్ చేశారు. భక్తులు హుండీల ద్వారా సమర్పించిన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ట్రస్ట్ నిధుల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

**బీసీలకు సముచిత ప్రాధాన్యం ఏది?**

తనను తాను ఓబీసీగా పేర్కొంటున్న ప్రధాని నరేంద్ర మోదీ బీసీ వర్గాల సమస్యల పరిష్కారంపై తగిన శ్రద్ధ చూపడం లేదని హనుమంతరావు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తున్నామని చెబుతున్నప్పటికీ బీసీలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. సామాజిక న్యాయం విషయంలో కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.

దేశంలోని అన్ని కులాలు, వర్గాలు, భాషలు, ప్రాంతాలకు సమాన ప్రాధాన్యం ఉండాలని ఆయన అన్నారు. కులాలు, ప్రాంతాలు, వర్గాల మధ్య విభజన సృష్టించే రాజకీయాలకు స్వస్తి పలకాలని సూచించారు.

**గ్రామాల్లో ప్రజల్లో అవగాహన**

రాముడి పేరుతో రాజకీయాలు చేయడం కాకుండా గ్రామాల్లో రాముడికి జరుగుతున్న అన్యాయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని హనుమంతరావు తెలిపారు. "నా పేరే హనుమంతుడు.. నాకంటే భక్తుడు ఎవరు ఉన్నారు" అని పేర్కొంటూ, రామభక్తి పేరుతో జరుగుతున్న రాజకీయాలను ప్రజలు గమనించాలని అన్నారు. వందేమాతరం, రామాలయం వంటి అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.




# బీజేపీ జిల్లా మహిళా మోర్చా కార్యవర్గం ఎన్నిక

మెదక్ ఆగస్టు 19 (ప్రజా కలం ప్రతినిధి)

బీజేపీ మెదక్ జిల్లా మహిళా మోర్చా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పట్లోళ్ల మల్లిక అశోక్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శులుగా బోడిగ అఖిల భరత్, మేకల లావణ్య, ఉపాధ్యక్షులుగా పబ్బా రాజమణి, లక్ష్మణ్, సీహెచ్ శైలజ, శ్రీనివాస్, కే.మౌనిక, ఎల్.మమత, సూర్యబాబు, కోశాధికారిగా నాయిని యశోద ప్రసాద్‌లను ఎంపిక చేశారు.

కార్యదర్శులుగా అలకంటి నాగలక్ష్మి, సీహెచ్ మాధవి, వడ్ల రాజేశ్వరి, పి.ప్రసన్న, ఏం.రాణి, ఈర్ల రేఖ, సువర్ణ, కే.విజయ, ప్రవళికలను నియమించారు. అధికార ప్రతినిధిగా ఏ.ఉమాదేవి, సోషల్ మీడియా విభాగానికి పాలడుగు సవితను ఎంపిక చేశారు.

కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఈర్ల రంజిత్‌రెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రాములు నాయక్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు జ్ఞాన్‌సింగ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన మహిళలకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# వీరహత్ అలీని పరామర్శించిన పలువురు ప్రముఖులు

గజ్వేల్:19 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యూజే ) అధ్యక్షుడు కె. వీరహత్ అలీ మాతృమూర్తి బాషారత్ ఉన్నిసా బేగం అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు గజ్వేల్‌లోని వీరహత్ అలీ



నివాసానికి చేరుకుని బాషారత్ ఉన్నిసా బేగం భౌతికకాయానికి నివాళులర్పించారు.అనంతరం వీరహత్ అలీతో పాటు ఆయన కుటుంబ సభ్యులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి,ఎమ్మెల్సీలు డాక్టర్ యాదవ రెడ్డి,దేశపతి శ్రీనివాస్, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఐజేయూ జాతీయ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్,మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్,మాజీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు నందిని సిధారెడ్డి, దేవి ప్రసాద్,వంటేరు ప్రతాప్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నగునూరి శేఖర్ పరామర్శించారు.అలాగే సీనియర్ జర్నలిస్టులు ఫైసల్ అహ్మద్,రంగాచారి, గజ్వేల్-మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన,మాజీ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్సింగరావు,పలువురు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలిపారు.అనంతరం బుధవారం సాయంత్రం జరిగిన బాషారత్ ఉన్నిసా బేగం అంత్యక్రియల్లో పలువురు ప్రముఖులు,జర్నలిస్టులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ రోడ్లపై ఆలయ టెండర్లా..?

## - ఆలయ టెండర్లపై బీజేపీ కౌన్సిలర్ల ఫైర్.
## - రూ.70 లక్షల ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపణ.

వేములవాడ, ఆగస్టు 19 ( ప్రజా కలం ప్రతినిధి) :

మున్సిపల్ స్థలాలను వినియోగించుకుంటూ రాజన్న ఆలయ అధికారులు పాదరక్షల స్టాండ్లకు టెండర్లు నిర్వహించడంపై బీజేపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన పాదరక్షల స్టాండ్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.బుధవారం వేములవాడలోని శ్రీ భీమేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రూ.36 లక్షల టెండర్ ఆలయ అధికారులు నిర్వహించిన పాదరక్షల టెండర్ సుమారు రూ.36 లక్షలకు ఖరారైందని కౌన్సిలర్లు తెలిపారు. టెండర్‌కు ప్రత్యేక స్థలం కేటాయించకుండా మున్సిపల్ రోడ్లపైనే షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపార కార్యకలాపాలు



నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఆలయ పరిసరాల్లో నాలుగైదు స్టాండ్లు ఏర్పాటు చేయడంతో మున్సిపల్ రోడ్లు, స్థలాలు ప్రైవేటు కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని పేర్కొన్నారు.భక్తులకు ఇబ్బందులు ఆలయ గోడలకు ఆనుకొని పాదరక్షల స్టాండ్లు ఏర్పాటు చేయడంతో పరిసరాల పరిశుభ్రత దెబ్బతింటోందని, భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా ఉంచాలని కోరారు. మున్సిపాలిటీకి ఆదాయమే..ఆలయ పరిసరాల్లోని మున్సిపల్ స్థలాలను గుర్తించి మున్సిపల్ ఖాతాలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పాదరక్షల స్టాండ్లకు టెండర్లు నిర్వహిస్తే రూ.36 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించకపోతే మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ఆర్‌జేడీ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో బీజేపీ కౌన్సిలర్లు కొండ్లెపు ముత్యం, వంగాల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్‌తోపాటు బీజేపీ నాయకులు బోనాల శివ, రేగుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పీపుల్స్ హాస్పిటల్‌పై డీఎంహెచ్‌ఓ అధికారుల కొరడా!




పటాన్ చేరు ఆగస్టు 19 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు పరిధిలోని పీపుల్స్ హాస్పిటల్‌పై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు.డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిర్మల ఆధ్వర్యంలో ఆసుపత్రిని తనిఖీ చేసి, నిబంధనల ఉల్లంఘనలపై అధికారులు చర్యలు చేపట్టారు తనిఖీల్లో గుర్తించిన లోపాలపై ఆసుపత్రి యాజమాన్యానికి రూ.25 వేల జరిమానా విధించడంతో పాటు నోటీసులు జారీ చేశారు.ఆసుపత్రుల్లో నిబంధనలు,వైద్య ప్రమాణాలు, రోగులకు అందుతున్న సేవలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ఈ తనిఖీ ప్రాధాన్యత సంతరించుకుంది.

**రూ.25 వేల జరిమానా.. నోటీసులతో హెచ్చరిక!**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిబంధనల అమలుపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారనే సంకేతాన్ని ఈ చర్య ఇచ్చింది.రోగుల ఆరోగ్యం,భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని అధికారుల




చర్య స్పష్టం చేస్తోంది పీపుల్స్ హాస్పిటల్‌పై చర్యలతో ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాల్లో చర్చ మొదలైంది.ఇకపై నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై మరింత కఠిన చర్యలు ఉంటాయా?అన్నది ఆసక్తికరంగా మారింది.

# కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలం: నీలం మధు.

## పటాన్‌చెరులో ఘనంగా సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం

పటాన్ చేరు ఆగస్టు 19 (ప్రజా కలం) ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముకని, పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి ప్రజలకు చేరువ చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు బుధవారం పటాన్‌చెరు అశోక్‌నగర్‌లోని సితార హోటల్‌లో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్తో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతంపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. నీలం మధు మాట్లాడుతూ.. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచుకుని ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి బూత్‌లో కాంగ్రెస్‌ను బలమైన సంస్థగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పీసీసీ అబ్జర్వర్ శ్రీనివాస్ బాబు, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపక్ రాథోర్, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, మాజీ మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కెసిఆర్ వస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయి- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

మెదక్ ఆగస్టు 19(ప్రజాకలం ప్రతినిధి) కెసిఆర్ వస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయి అని మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు.బుధవారం కొల్చారం మండల కేంద్రమైన బాబా ఫంక్షన్ హాల్లో మండల అధ్యక్షులు గౌరీ శంకర్ గుప్త, మండల యూత్ అధ్యక్షులు సంతోష్ రావు ఆధ్వర్యంలో మండల బీఆర్ఎస్ పార్టీ విస్తృత సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్లో గౌరవ మర్యాదలు మంట కలిశాయిహా. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక స్కాలర్షిప్లు, కెసిఆర్ కిట్టు, న్యూట్రిషన్ కిట్టులు పోయాయిహా. కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పోయాయి, ఆడబిడ్డల ఉసురు కాంగ్రెస్కు తగులుతుందిహా. పథకాలు తీసేయడం తప్ప కొత్త పథకాలు అమలు లేదుహా, మళ్లీ కెసిఆర్ రావాలంటే ప్రతి కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలి పార్టీని బలోపేతం చేయాలిహామళ్లీ కెసిఆర్ వస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గౌరీశంకర్, యువత విభాగం అధ్యక్షుడు కొనపూర్ సంతోష్‌రావు, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు యబన్నగారి



రవితేజరెడ్డి, సీనియర్ నాయకులు నరేందర్‌రెడ్డి, బాగారెడ్డి, రాజాగౌడ్, మాజీ జడ్పీటీసీ సంతోష్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్, సర్పంచ్‌లు, నాయకులు శ్యామ్ రావు, వేమారెడ్డి, అరె రవీందర్, సాయిని సిద్ధిరాములు, కోమ్ముల సురేష్, ధనరాజ్ బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com



## జిహెచ్ఎంసిలో బంజారాలకు 30 ఎస్టి రిజర్వ్ స్థానాలు కేటాయించాలి:

### సేవలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ నాయకులు సభావత్ రామచంద్ర నాయక్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో బంజారా సామాజిక వర్గానికి 10 శాతం ప్రాతిపదికన 30 ఎస్టి రిజర్వ్ కార్పొరేటర్ స్థానాల్లో కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సభావత్ రామచంద్రనాయక్ చౌహాన్ ప్రజా పాలన ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి, పరిసరాల ప్రాంతాల్లో దశాబ్దాలుగా స్థిర నివాసం ఉంటున్న బంజరులకు స్థానిక సంస్థలలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ నగరంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి లక్షలాది మంది ఎస్టీ బంజారా ప్రజలు స్థిర నివాసం ఏర్పరచుకున్నారని తెలిపారు. అనేక కుటుంబాలు వంద నుంచి 150 ఏళ్లుగా హైదరాబాద్ పరిసరాల ప్రాంతంలో నివాసం ఉంటున్నారని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బంజారా జనాభా సుమారు 7 లక్షల నుండి తొమ్మిది లక్షల వరకు ఉందని ఆయన పేర్కొంటూ గతంలో మున్సిపల్ కార్పొరేషన్ లో బంజారాలకు కేటాయించిన కార్పొరేషన్ షీట్లతో పాటు రిజర్వుడు స్థానాలు పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. జనాభా ప్రాతిపదికన బంజారాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా వారి రాజకీయ , సామాజిక, అభివృద్ధికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీతో బంజారా సమాజానికి దశాబ్దాలుగా అనుబంధం ఉందని రామచంద్రనాయక్ ప్రభుత్వాన్ని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ హయాం నుంచి కాంగ్రెస్ పార్టీని బంజారా సమాజం విశ్వసిస్తూ వస్తుందని పేర్కొన్నారు. ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం బంజారా సమాజానికి తగిన గుర్తింపు న్యాయం చేస్తుందన్న నమ్మకం తమకు ఉందని పేర్కొన్నారు. బంజారా సమాజం జనాభా సామాజిక పరిస్థితులను పరిగణలకు తీసుకొని రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో 30 ఎస్టి రిజర్వుడ్ స్థానాలు కేటాయించి తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సేవలాల్ సేన మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజు నాయక్, ప్రధాన కార్యదర్శి, గిరిసింగ్ నాయక్ కార్యదర్శి, బాల్ సింగ్ నాయక్, కార్మిక సేన అధ్యక్షుడు సంతోష్ నాయక్, ఉపాధ్యక్షుడు వినోద్ నాయక్, కుత్బుల్లాపూర్ సేవాలాల్ సేన అధ్యక్షుడు తారచందు నాయక్, ఉపాధ్యక్షుడు రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర ఎంతో ఉంది: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్.

కూకట్ పల్లి, ఆగస్టు 19, ప్రజా కలం ప్రతినిధి:

హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర ఎంతో ఉందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకుడు వి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కూకట్ పల్లి ఎల్లమ్మబండలోని పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను




సంఘం నిర్వాహకుల నుంచి అడిగి తెలుసుకున్నారు. తను కూకట్ పల్లి డిప్యూటీ కమిషనర్ గా పని చేసినప్పుడు ఎల్లమ్మబండ కాలనీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్టు గుర్తు చేశారు. పాలమూరు జిల్లా అంటేనే వలస కార్మికుల జిల్లా అని పేరుంది, ఎల్లమ్మబండతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో పాలమూరు వాసులు నివాసం ఉంటున్నారని అన్నారు. హైదరాబాద్ మహానగర నిర్మాణంలో, అభివృద్ధిలో పాలమూరు కార్మికుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు వలసలు తగ్గాయి, పాలమూరు రంగారెడ్డి ఎత్తి పోతల ద్వారా పుష్కల నీటిని అందించడంతో వలస కార్మికులు వలసల బాట మాని వ్యవసాయం చేసుకుంటున్నారని అన్నారు. పాలమూరు బిడ్డలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంఏ కరీమ్, ప్రధాన కార్యదర్శి గోపాస్ రవీందర్, సీనియర్ జర్నలిస్టులు ఆర్ కే దయాసాగర్, సామల రాము, బిఆర్ఎస్ నాయకులు డి. అనిల్ రెడ్డి, కాంట్రాక్టర్ శంకర్, సంఘం వ్యవస్థాపక సభ్యులు దేవయ్య, యాదగిరి, నరసింహా, మాచర్ల భద్రయ్య, బోయ రాజు తదితరులు పాల్గొన్నారు.

## బీరంగూడలో కల్వర్టు పనులు.. ఇక వేగమే..

### బీరంగూడలో అభివృద్ధికి పనులపై ఎమ్మెల్యే సీరియస్..

పటాన్‌చెరు, ఆగస్టు 19 (ప్రజా కులం) ప్రతినిధి

అమీన్పూర్ పరిధిలోని బీరంగూడ సాయికృపా కాలనీలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, అమీన్పూర్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి బుధవారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న కల్వర్టు పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కాలనీలో నూతన సీసీ రోడ్లు,భూగర్భ మురుగునీటి వ్యవస్థ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కమ్యూనిటీ హాల్ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు నరసింహా గౌడ్, మాజీ సభ్యులు మల్లేష్, కొల్లూరి చంద్రకళ గోపాల్, నవనీత జగదీష్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు..



# మహేశ్వరం గ్రామ ప్రజలను చల్లగా చూడాలి

### వైభవంగా శ్రీ గడికోట మైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం

### గడికోట మైసమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు



మహేశ్వరం, ఆగస్టు 19, (ప్రజా కలం)

మహేశ్వరం మండల కేంద్రంలోని శ్రీ గడికోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. మూడు రోజుల పాటు నిర్వహించిన పూజా కార్యక్రమాలకు గ్రామ ప్రజలు, యువకులు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ నెల 17న గోపూజ, గణపతి పూజ, పుణ్యవచనం, పంచగవ్యము, యాగశాల ప్రవేశం, దీక్షా ఋత్విక్ వరణం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, నవగ్రహ వాస్తు, సర్వతోభద్ర మండల ఆరాధన, అంకురారోపణ, అగ్నిప్రతిష్ఠ, హోమాలు, జలాధివాసం, మంగళహారతి, స్వస్తి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. 18న ప్రాతఃకాల పూజల అనంతరం ఆవాహిత మండప దేవత హోమాలు నిర్వహించారు. అనంతరం గణపతి, రుద్ర, నవగ్రహ, అమ్మవారి మూల మంత్ర హోమాలను అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. 19న ప్రాతఃకాల పూజలు, దీక్షా హోమాలతో పాటు యంత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం 8.29 గంటలకు అమ్మవారి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. అనంతరం బింబ కళాన్యాసం, గర్త పూజలు, కళాన్యాసం, దిష్టికుంభం, బలి ప్రధానం, మహాపూర్ణాహుతి , విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అనంతరం సుమారు 5000 మందికి అన్నదాన కార్యక్రమం చేశారు. డప్పు చప్పుళ్ల మధ్య పూనకాల తో అమ్మవారికి మహిళలు బోనాలు తీశారు. నైవేద్యం సమర్పించారు. తమ పిల్లా పాపలతో, పాడి, పంటలతో చల్లంగా చూడాలని అమ్మవారిని, మనసారా కోరుకున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ పార్టీ ఇంచార్జ్ అందెలా శ్రీరాములు యాదవ్, మాజీ జడ్పి ఛైర్ పర్సన్ తీగల అనిత రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని



విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మునగపాటి నవీన్, ఉప సర్పంచ్ జోరల రమేష్, శివగంగ దేవాలయ చైర్మన్ అల్లే కుమార్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వివిధ పార్టీల నాయకులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, ఉప సర్పంచ్ జోరాల రమేష్ , శివగంగ ఆలయ చైర్మన్ అల్లే కుమార్, విగ్రహ దాత స్వర్ణ గంటి ఆనందం ,కర్రోళ్ల చంద్రయ్య, అంబయ్య యాదవ్, పోతర్ల సుదర్శన్ యాదవ్, కాకి ఈశ్వర్, కూన యాదయ్య, ఒత్తుల రఘుపతి, పోల్కం బాలయ్య, కర్రోళ్ల రాములు,మోదీని శివమూర్తి, నిమ్మగూడ సుధీర్ గౌడ్, మాజీ సర్పంచ్ ప్రియాంక రాజేష్, ఎట్టయ్య, ముదిరాజ్ సంఘం,కురుమ సంఘం అంబెడ్కర్ సంఘం, గంగ పుత్ర సంఘం, అఖిల భారత యాదవ సంఘం,బేడా బుడగ జంగాల సంఘం,మున్నూరుకాపు సంఘం, రజక సంఘం, పద్మశాలి సంఘం,వీర శైలి లింగాయత్ సమాజం బ్రదర్స్ స్క్వాడ్ (యమ్మీ ఫుడ్ కోర్ట్), గౌడ సంఘం ఆర్య వైశ్యా సంఘం, బైండ్ల సంఘం, ముష్టి గొల్ల యాదవ సంఘం, రాజా రాజేశ్వరి డ్రైవర్స్ అసోసియేషన్,రెడ్డి సంఘం, మెడికల్ అసోసియేషన్,ఉప్పరి సంఘం, విశ్వ కర్మ సంఘం కుమ్మరి సంఘం, నాయి బ్రాహ్మణా సంఘం, ఆరె కటిక సంఘం, వడ్డెర సంఘం, పూసల సంఘం మాల సంఘం, దాసరి సంఘం,పిట్టల సంఘం మహేశ్వరం గ్రామ మాజీ సర్పంచులు ఉప సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు , జడ్పిటిసిలు గ్రామ వార్డు సభ్యులు, అన్ని కుల సంఘాల నాయకులు గ్రామ పెద్దలు, గ్రామ మహిళలు యువకులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఫొటోలో చరిత్ర.. ఫొటోగ్రాఫర్‌లో కళ..

- జ్ఞాపకాల కాపలాదారులు.. ఫొటోగ్రాఫర్లు..
- ఇస్నాపూర్‌లో ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం..
- జెండా ఎగురవేసి.. కేక్ కట్ చేసిన నీలం మధు..
- ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి అండగా ఉంటా: నీలం మధు





పటాన్‌చేరు, ఆగస్టు 19 (ప్రజా కలం ప్రతినిధి ) కాలం గడిచినా జ్ఞాపకాలను చెరిగిపోకుండా కళ్లముందు నిలిపేది ఫొటో. చరిత్రను చిత్రాల్లో పదిలపరుస్తూ, తరతరాలకు జ్ఞాపకాలను అందిస్తున్న ఫొటోగ్రాఫర్లు సమాజానికి చేస్తున్న సేవలు అమూల్యమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫొటోగ్రాఫర్ల సంఘం కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన నీలం మధు జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక ఫొటో కేవలం చిత్రం కాదు..ఒక కాలానికి, ఒక సంఘటనకు, ఒక జ్ఞాపకానికి శాశ్వత సాక్ష్యం అని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలు, సామాజిక పరిణామాలు, కుటుంబ వేడుకలు సహా సమాజంలోని ప్రతి కీలక ఘట్టాన్ని చిత్రాల్లో భద్రపరిచే ఫొటోగ్రాఫర్ల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఫొటోగ్రాఫర్ల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని నీలం మధు తెలిపారు. గతంలో తాను కల్పించిన ఆరోగ్య బీమా పథకం తమకు ఎంతో ఉపయోగపడిందని సంఘం సభ్యులు గుర్తుచేసుకున్నారు. ఫొటోగ్రాఫర్ల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి నిరంతరం అండగా ఉంటానని నీలం మధు హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాజేశ్వర్, ఇస్నాపూర్ అధ్యక్షుడు నరేందర్, శ్రీధర్, ప్రధాన కార్యదర్శి సందీప్, కౌన్సిలర్లు సంఘన్నగారి గోపాల్, దస్తగిరి, లక్ష్మా రెడ్డి, మురళి, కృష్ణ యాదవ్, శంకర్, పవన్, రవి, రాజేష్, ఫొటోగ్రాఫర్ల సంఘం ప్రతినిధులు, సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



## లలితభాయికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నివాళి.

దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 19.

బీఆర్ఎస్ పార్టీ రాయపోల్ మండల అధ్యక్షులు రాయపోల్ వెంకటేశ్వర శర్మ అమ్మమ్మ లలితభాయి ఇటీవల మృతి చెందడంతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, సోలిపేట సతీష్ రెడ్డితో కలిసి బుధవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. లలితభాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యాదగిరి, సర్పంచులు మాసంపల్లి రాజు, మహమ్మద్ పర్వేజ్, సీనియర్ నాయకులు రంగారెడ్డి, జీవన్ రెడ్డి, రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజుగౌడ్, బాగిరెడ్డి, ఉప సర్పంచులు రాజు, సంతోష్, వార్డు సభ్యులు పరశురాములు, మాజీ సర్పంచ్ తిరుపతి నర్సింలు, నాయకులు షాదుల్లా, జగపతి రెడ్డి, భార్గవ్, నందు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## 22ఏపై అమీన్‌పూర్ గళం!..

### -22ఏ ఉచ్చులో అమీన్‌పూర్ ఆస్తులు!..బాధితుల గోడు..

పటాన్‌చెరు, ఆగస్టు 19 (ప్రజా కలం) ప్రతినిధి

22ఏ నిషేధిత జాబితాలో తమ ఇళ్లు,స్థలాలు చేరడంతో అమీన్‌పూర్‌కు చెందిన వందలాది మంది పేద మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి దశాబ్దాలుగా నివాసముంటున్న ఆస్తులను అమ్ముకోలేక తాకట్టు పెట్టలేక ఇబ్బందులు పడుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో బాధితులు తెలంగాణ భవన్‌కు తరలివచ్చి తమ గోడును బీఆర్ఎస్ నాయకత్వానికి వివరించారు.పిల్లల చదువులు, బిడ్డల పెళ్లిళ్లు,వైద్య ఖర్చుల కోసం పైసా పైసా కూడబెట్టి కొనుగోలు చేసిన స్థలాలు, నిర్మించుకున్న ఇళ్లు ఇప్పుడు దేనికీ ఉపయోగపడకుండా పోయాయని వాపోయారు ప్రభుత్వ పరిపాలనా తప్పిదాలను అధికారులపై నెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన బాధితులు,పేదల ఆస్తులను వివిధ నిబంధనల పేరుతో నిషేధిత జాబితాలో చేర్చడం అన్యాయమని మండిపడ్డారు.అర్హులైన భూ యజమానుల ఆస్తులను 22ఏ జాబితా నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.బాధితులకు అండగా నిలుస్తామని బీఆర్ఎస్ నాయకత్వం స్పష్టం చేసింది. 22ఏ పేరుతో పేదల ఆస్తులకు అన్యాయం జరిగితే అసెంబ్లీలోనూ, క్షేత్రస్థాయిలోనూ పోరాడతామని పేర్కొంది..



# దొంగే దొంగ అన్నట్లుంది

## గత పాలకవర్గం అక్రమాలపై ఆధారాలతో బయటపెడతాం

## - మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు.



వేములవాడ, ఆగస్టు 19 ( ప్రజా కలం ప్రతినిధి) : పట్టణంలో అక్రమ నిర్మాణాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు స్పష్టం చేశారు,మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలకవర్గ హయాంలో జరిగిన అక్రమ నిర్మాణాలు, అనుమతుల వ్యవహారాలను పూర్తి ఆధారాలతో త్వరలోనే ప్రజల ముందుంచుతామని తెలిపారు. గత పాలకవర్గంలో పనిచేసిన వారు ప్రస్తుత పాలకవర్గానికి సలహాలు, సూచనలు ఇస్తారని భావిస్తే అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు,ఇలాంటి ప్రచారంతో వారే ప్రజల ముందు చులకన అవుతున్నారని అన్నారు, గత ఐదేళ్లలో మంజూరైన నిర్మాణ అనుమతులు, జరిగిన అక్రమాలపై పూర్తి వివరాలను వెలికితీస్తామని పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు..

జగిత్యాల బస్టాండ్ ప్రాంతంలో ఓ నిర్మాణదారుడికి ఒకచోట అనుమతి ఇచ్చినా.. నిబంధనలకు విరుద్ధంగా మరోచోట నిర్మాణం చేపట్టినట్లు చైర్మన్ తెలిపారు, దీనిపై ఫిర్యాదు అందగానే అధికారులు నోటీసులు జారీ చేశారని, ఈ నెల 3న సదరు నిర్మాణ అనుమతిని రద్దు చేసినట్లు వివరించారు,అయితే ఈ చర్యలు తమ వల్లే జరిగాయని కొందరు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 11వ వార్డులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంలో ప్రస్తుత పాలకవర్గం ఎలాంటి లోపాయికారీ ఒప్పందాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. తమ పాలనలో అమ్యామ్యాలకు తావులేదని, పట్టణ అభివృద్ధే లక్ష్యమని పేర్కొన్నారు.

ఫిర్యాదుల ఆధారంగానే కూల్చివేతలు..

పట్టణంలో అక్రమ నిర్మాణాలపై బీఆర్ఎస్ నాయకులే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసిన విషయాన్ని చైర్మన్ గుర్తుచేశారు. ఆ ఫిర్యాదుల ఆధారంగానే అధికారులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతలు వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు కాదని, పూర్తిగా చట్టబద్ధంగానే జరుగుతున్నాయని స్పష్టం చేశారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై విమర్శలు సహించం..

స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై కొందరు వ్యక్తులు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని పుల్కం రాజు తీవ్రంగా ఖండించారు,వ్యక్తిగత సానుభూతి పొందేందుకు తమ నాయకుడిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.అక్రమ నిర్మాణాల వెనుక ఎవరి హస్తం ఉందో వేములవాడ ప్రజలకు తెలుసని అన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే దుష్ప్రచారం..

పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ప్రస్తుత పాలకవర్గంపై దుష్ప్రచారం చేస్తున్నాయని చైర్మన్ ఆరోపించారు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు.

పట్టణాన్ని సొంత కుటుంబంగా భావించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పాలన సాగిస్తున్నామని తెలిపారు, అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శక పాలన అందిస్తున్నామని పుల్కం రాజు స్పష్టం చేశారు.



## భక్తిశ్రద్ధలతో అభయాంజనేయుడి ఉత్సవం

### -అభయాంజనేయుడి సన్నిధిలో ఆధ్యాత్మిక సందడి..

పటాన్‌చెరు, ఆగస్టు 19 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారికి అభిషేకం,ప్రత్యేక పూజలు, సుదర్శన హోమం నిర్వహించడంతో పాటు కాలనీ ప్రజలకు మహా అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షుడు మాణిక్య రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాణిక్య రెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అభయ ఆంజనేయస్వామి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కృషి డిఫెన్స్ కాలనీ అధ్యక్షుడు అమరేందర్, సభ్యులు దర్పాల్ రెడ్డి, అంతిరెడ్డి, అమరేందర్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, దయాకర్, నరసింహ, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ మహిళలు, తదితరులు పాల్గొన్నారు..

## పోచమ్మ తల్లుల మహోత్సవం ఘనంగా

### -పోచమ్మ తల్లుల సన్నిధిలో కాట సుధా!.

పటాన్‌చెరు, ఆగస్టు 19 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో శ్రీ నల్ల పోచమ్మ,శ్రీ ఎర్ర పోచమ్మ తల్లుల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించగా గ్రామంలో భక్తిమయ వాతావరణం



నెలకొంది. ఈ మహోత్సవంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ తల్లులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు,అభివృద్ధి, సమృద్ధి,శాంతి,సౌభ్రాతృత్వం కోసం అమ్మవార్లను ప్రార్థించారు అమ్మవార్ల ఆశీస్సులతో నందిగామ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు. ప్రతిష్ఠాపన మహోత్సవానికి గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు..

## ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

### : ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు

సంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 19 ( ప్రజా కలం):

సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల పరిధిలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి చర్చించారు.

ఈ సందర్భంగా నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు. అలాగే ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా ఆర్అండ్‌బీ రోడ్ల మంజూరు, పెండింగ్‌లో ఉన్న రహదారి పనుల పురోగతిపై కలెక్టర్‌తో



చర్చించారు.

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన బోర్ల ఏర్పాటు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సబ్ సెంటర్ల అభివృద్ధిపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అలాగే సిఎస్ సార్ , డిఎంఎఫ్టి, ఎమ్మెస్టి తదితర నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, అందుబాటులో ఉన్న నిధులు, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు పెండింగ్ పనులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, విద్య, వైద్యం, రహదారులు, తాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యేలు సూచించారు.

ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, పట్నం మాణిక్యం, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కోట మైసమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం పాల్గొన్న అందెల శ్రీరాములు యాదవ్

మహేశ్వరం, ఆగస్టు 19, (ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని గడికోటలో కొలువైన శ్రీ కోటమైసమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం గ్రామ సర్పంచ్ నవీన్ మాజీ ఎంపీటీసీ సభ్యులు పోతర్ల సుదర్శన్ యాదవ్ , ఆలయ చైర్మన్ అల్లే కుమార్, ఆలయ కమిటీ సభ్యులు కలిసి శ్రీరాములు ని ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ కోటమైసమ్మ తల్లి ఆశీస్సులతో మహేశ్వరం ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు దేవాలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి , మండల ప్రధాన కార్యదర్శి వనంపల్లి



శ్రవణ్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి పందు నాయక్, తుమ్మలూరు సర్పంచ్ తుమ్మేటి ఆండాలు కృష్ణ యాదవ్, బిజెపి ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు రఘువీర్, బిజెపి నాయకులు కాకి పరమేష్, పోల్కం మహేందర్, మోతే యాదయ్య, ఆకుల నరేష్, సందుల గణేష్, సుధీర్, చిందం జంగయ్య, చింటూ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గల్ఫ్ కార్మికుల కోసం మెరుగైన వలస విధానం

### - ఫిలిప్పీన్స్‌లో ఎన్నారై అడ్వైజరీ కమిటీ పర్యటన.

### - ఇండియన్ ఎంబసీ, కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ అధికారులతో భేటీ.

### - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి.





రాజన్న సిరిసిల్ల జిల్లా ఆగస్టు 19 (ప్రజా కలం ప్రతినిధి) :

గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వలస వెళ్లిన తెలంగాణకు చెందిన సుమారు 15 లక్షల మంది కార్మికుల సంక్షేమం కోసం మెరుగైన వలస విధానాన్ని రూపొందించే దిశగా రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కమిటీ సభ్యులు బుధవారం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలోని భారత రాయబార కార్యాలయాన్ని సందర్శించారు, ఇండియన్ ఎంబసీ అంబాసిడర్ హర్షకుమార్ జైన్, ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్‌లతో కమిటీ సభ్యులు వలస కార్మికుల సంక్షేమం, వలస విధానాలపై సుదీర్ఘంగా చర్చించారు, అనంతరం కమిషన్ ఆన్ ఫిలిప్పీన్స్ ఓవర్సీస్ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫిలిప్పీన్స్‌లో అమలవుతున్న వలస విధానాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు.

ఫిలిప్పీన్స్ విధానాలపై అధ్యయనం..

ప్రపంచంలో అత్యుత్తమ వలస విధానాలను అమలు చేస్తున్న దేశాల్లో ఫిలిప్పీన్స్ ఒకటని, అక్కడ అమలవుతున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి తెలిపారు. గల్ఫ్ కార్మికుల రక్షణ, సంక్షేమం కోసం ఫిలిప్పీన్స్ తరహాలో మెరుగైన విధానాన్ని తెలంగాణలో అమలు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

సీఎం ఆలోచనలకు అనుగుణంగా..

గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఫిలిప్పీన్స్ తరహా మెరుగైన వలస విధానాన్ని రూపొందించాలన్న ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే కమిటీ పర్యటన కొనసాగుతోందని తెలిపారు.

విదేశాల్లో ఉపాధి పొందుతున్న తెలంగాణ కార్మికుల భద్రత, హక్కులు, సంక్షేమానికి మరింత ప్రాధాన్యం కల్పించేలా సమగ్ర విధానాన్ని రూపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.కమిటీ చైర్మన్ అంబాసిడర్ డాక్టర్ బీఎం వినోద్‌కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, నంగి దేవేందర్‌రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, శ్రీనివాస్ జునుగురు తదితరులు పర్యటనలో పాల్గొన్నారు.

## కంటి చూపుకు భరోసా.. లయన్స్ క్లబ్ ఉచిత మెగా శిబిరం

వేములవాడ, ఆగస్టు 19 ( ప్రజా కలం ప్రతినిధి) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు



బచ్చు వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొమ్మ నటరాజ్, కోశాధికారి డాక్టర్ వినయ్ తెలిపారు. మహాలక్ష్మి డెంటల్ కేర్ సహకారంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు,శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులతో కంటి, దృష్టి పరీక్షలు నిర్వహించడంతో పాటు కళ్లజోడు అవసరాన్ని గుర్తించి తగిన సూచనలు అందించనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు, కంటి సంబంధిత సమస్యలపై వైద్యుల సలహాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి...

వృద్ధులు, విద్యార్థులు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని బచ్చు వంశీకృష్ణ కోరారు. కంటి ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లోనూ మరిన్ని ఉచిత వైద్య సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.




## నూతన వస్త్రాలంకరణ వేడుకకు హాజరై శుభాకాంక్షలు

వేములవాడ, ఆగస్టు 19 ( ప్రజా కలం ప్రతినిధి) : శ్రీ రాజరాజేశ్వర వ్యాపారుల సంఘం అధ్యక్షుడు పిండి హనుమాన్లు ఆధ్వర్యంలో సంఘం సభ్యులు చిదిరే రాజేంద్రప్రసాద్ కుమార్తె నూతన వస్త్రాలంకరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన వస్త్రాలంకరణ వేడుక శుభప్రదంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు యెల్ల పోశెట్టి, ప్రధాన కార్యదర్శి ఎడ్ల నాగరాజు, కోశాధికారి దయాల శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

---

## ఎస్సీ ఉపకులాలకు తహసీల్దార్ ద్వారానే కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

### 57 ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి: బైరి వెంకటేశం

హైదరాబాద్: 19 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

ఎస్సీ ఉపకులాలకు కులధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ల ద్వారా జారీ చేసేలా ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం కోరారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 57 ఎంబీఎస్సీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఎస్సీ ఉపకులాల నాయకులతో కలిసి బైరి వెంకటేశం కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను మంత్రికి వివరించి వినతిపత్రం అందజేశారు. అనంతరం వెంకటేశం మాట్లాడుతూ ఎస్సీల్లోని మాల,మాదిగ కులాలతో పాటు 160 కులాలు ఉన్న బీసీలు, 32 తెగలు ఉన్న ఎస్టీలు, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు తహసీల్దార్ల ద్వారా కులధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారని తెలిపారు. అయితే ఎస్సీ ఉపకులాలకు మాత్రం ఆర్డీవో, కలెక్టర్ పరిధిలో కులధ్రువీకరణ పత్రాలు ఉంచి కార్యాలయాల చుట్టూ తిప్పడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులధ్రువీకరణ పత్రం తమ కనీస ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని, దీనిని కూడా పరిష్కరించలేకపోతే ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల సంక్షేమానికి ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఇతర ఎస్సీ కులాలతో 57 ఉపకులాలు అన్ని రంగాల్లో పోటీ పడలేని పరిస్థితి ఉన్నందున ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా హామీ అమలు కాలేదని విమర్శించారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవిని ఒక్కసారి కూడా ఎస్సీ ఉపకులాల ప్రతినిధులకు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 57 ఎంబీఎస్సీ కులాల నాయకులు ఉపదేశనాధన్ మాంగ్ గారోడి, పర్శ శ్యామ్‌రావు మాలజంగం, మహిళా నేత జీవనజ్యోతి, తల్వారే పరమేష్ మాంగ్, శాఖమూరి యాదగిరి హోలీయా దాసరి, పోతుల మల్లేష్ మదాసి కురువ, రామకృష్ణ కొలుపుల, గడ్డం విష్ణు పంబాల, మాటపతి నాగయ్య స్వామి బేడ (బుడ్గ) జంగం, పర్శపాక శ్రీనివాస్ మాదిగదాసు తదితరులు పాల్గొన్నారు.





## శ్రీ కోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కు విరాళం అందజేసిన గదగూటి మహేందర్ ముదిరాజ్

మహేశ్వరం, ఆగస్టు 19,(ప్రజా కలం)

మహేశ్వరం మండల కేంద్రం గడికోట శ్రీ శ్రీ శ్రీ కోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా శ్రీ కోట మైసమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి తన వంతు సహాయంగా గదగూటి మహేందర్ ముదిరాజ్ వారు 21,000/- (ఇరవైఒక్కవెయ్యి రూపాయలు) విరాళంగా అందజేయడం జరిగింది. ఈ విరాళాన్ని మునగపాటి నవీన్ సర్పంచ్ కి అందజేయడం జరిగింది. శ్రీకోట మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.

## గడికోటలో వైభవంగా మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా రెడ్డి



మహేశ్వరం, ఆగస్టు 19,(ప్రజా కలం).

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం గడికోట గ్రామంలో మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలందరికీ అమ్మవారి దివ్య ఆశీస్సులు ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని సంకల్పంతో 270 కి.మీ. పాదయాత్ర

### ప్రజ్ఞాపూర్ వద్ద పాదయాత్రికులకు బీఆర్ఎస్ నాయకుల స్వాగతం

గజ్వేల్:19 ఆగస్టు2026 ( ప్రజా కలం ప్రతినిధి)

మాజీ ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రి గా బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలానికి చెందిన జాడే తిరుపతి,దుర్గం శంకర్ చేపట్టిన సుమారు 270 కిలోమీటర్ల పాదయాత్ర బుధవారం గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారికి చేరుకుంది. ఈ సందర్భంగా గజ్వేల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బెండే మధు పాదయాత్రికులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారికి భోజన సదుపాయాలు కల్పించి ఆతిథ్యం అందించారు. ఈ సందర్భంగా పాదయాత్రికులు మాట్లాడుతూ కేసీఆర్ మళ్లీ తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితేనే ప్రజలంతా సుభిక్షంగా,సంతోషంగా ఉంటారని ఆకాంక్షించారు. కేసీఆర్ నాయకత్వాన్ని కోరుతూ పాదయాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పంబాల శివకుమార్, ముత్తారం వేణు,లవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.






## గిన్నిస్ రికార్డు సాధించిన గజ్వేల్ కరాటే క్రీడాకారులకు హరీష్ రావు సన్మానం

### - 21 మంది క్రీడాకారులను అభినందించిన మాజీ మంత్రి..

### - నిరంతర సాధనతోనే అరుదైన ఘనత సాధ్యమైందని ప్రశంస

గజ్వేల్:19 ఆగష్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట ప్రతినిధి, ఆగస్టు 19: గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించిన గజ్వేల్‌కు చెందిన 21 మంది కరాటే క్రీడాకారులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఘనంగా సన్మానించి అభినందించారు. గిన్నిస్ రికార్డు సాధించిన క్రీడాకారులు బుధవారం హరీష్ రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ కృష్ణ ఆధ్వర్యంలో క్రీడాకారులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో గజ్వేల్ కౌన్సిలర్ అత్తిలి శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్సింగరావు పాల్గొన్నారు. గజ్వేల్‌కు చెందిన 21 మంది కరాటే క్రీడాకారులు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఏప్రిల్ 26న విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. కరాటే మాస్టర్ కృష్ణ శిక్షణలో సాధన చేసిన క్రీడాకారులు 30 నిమిషాల పాటు నిరంతరంగా కటా ప్రదర్శన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డులో భాగస్వాములయ్యారు.

నిరంతర సాధనతోనే అరుదైన ఘనత

ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ క్రీడాకారుల నిరంతర సాధన,పట్టుదల, సమిష్టి కృషి ఫలితంగానే ఈ అరుదైన ఘనత సాధ్యమైందన్నారు. చిన్న వయసు నుంచే కరాటేలో శిక్షణ పొందుతూ వివిధ స్థాయిల్లో ప్రతిభను మెరుగుపరుచుకున్న గజ్వేల్ క్రీడాకారులు గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించడం గర్వకారణమన్నారు. కటా ప్రదర్శనలో సమన్వయం, వేగం,నియంత్రణ, ఏకాగ్రత ఎంతో కీలకమని పేర్కొన్నారు. గిన్నిస్ రికార్డు సాధించిన క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పాల్గొన్న క్రీడాకారులు అక్షిత, భావిజ్ఞ, రిషిక, రామకృష్ణ, రఘురాం, రామ్ చరణ్, తరుణ్యా, మైత్రి, తనుజ్, మనోజ్, అన్నయ్య, దేవాన్ష్, అఖిలేశ్వర్, ముస్తఫా, శ్రావణి, శరణ్య, హర్షవర్ధన్, శ్రీహరి,లక్ష్మీ నరసింహ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు. కౌన్సిలర్ అత్తిలి శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్సింగరావు తదితరులు హాజరయ్యారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి

### - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.

### - అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష.




రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 19 ( ప్రజా కలం ప్రతినిధి) : ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, తదితర అంశాలపై బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్ల వివరాలను సీఈఓ అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ కింద గుర్తించిన అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు డౌన్‌లోడ్ చేసి అందజేయాలని సూచించారు. నోటీసుల్లో ఓటరు సమాధానం అందించాల్సిన తేదీ, సమయం, స్థలాన్ని స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల మేరకు ఫారం-6, 7, 8 దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ఏఎస్‌డీడీ జాబితాను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాల్లో ఎస్ఐఆర్ కింద చేపడుతున్న చర్యలకు సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రాష్ట్రస్థాయికి పంపాలని ఆదేశించారు. ప్రక్రియను సులభతరం, సమర్థంగా నిర్వహించేందుకు సంబంధిత సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. నోటీసుల జారీ, క్లెయిమ్‌లు--అభ్యంతరాల పరిష్కారం తదితర ప్రతి దశను అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

83,841 మంది ఓటర్లకు నోటీసులు..

జిల్లాలో 5,008 మంది నో మ్యాపింగ్ ఓటర్లు, 78,833 మంది అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. మొత్తం 83,841 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆర్డీవోలు తమ పరిధిలోని బీఎల్ఓలకు నోటీసుల జారీ, ఇతర అంశాలపై ఇప్పటికే శిక్షణ ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక షెడ్యూల్ రూపొందించి, దాని ప్రకారం ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈసమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కే.ఎస్.బీ. కుమారి, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎలక్షన్ సెక్షన్ అధికారి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

### - ఓటర్ల మ్యాపింగ్, వ్యత్యాసాలున్న ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి:19 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్లు, వివరాల్లో వ్యత్యాసాలున్న ఓటర్ల గుర్తింపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఫారాల పంపిణీ, సేకరణ పూర్తయిన అనంతరం మ్యాపింగ్ కాని,




వివరాల్లో వ్యత్యాసాలున్న ఓటర్లకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీ, సమయంలో హాజరై పౌరసత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువపత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు,అభ్యంతరాలను స్వీకరించాలని,అక్టోబర్ 15లోగా నోటీసుల జారీ ప్రక్రియను పూర్తి చేసి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాల్లో చేపడుతున్న చర్యలకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రాష్ట్ర స్థాయికి పంపాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సులభంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఓటర్లకు ఎస్ఐఆర్‌పై పూర్తిస్థాయి అవగాహన కల్పించి, అవసరమైన ధ్రువపత్రాలతో నిర్ణీత సమయంలో హాజరయ్యేలా చూడాలని సూచించారు. నోటీసుల జారీ నుంచి క్లెయిమ్‌లు,అభ్యంతరాల పరిష్కారం వరకు ప్రతి దశను సమన్వయంతో పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులో ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్య విద్యార్థులకు వరం - సర్పంచ్ లక్ష్మి కొండయ్య

గజ్వేల్:19 ఆగష్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వృత్తి విద్యలో మెలకువలు నేర్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కొడకండ్ల గ్రామ సర్పంచ్ లక్ష్మి కొండయ్య అన్నారు. వృత్తి విద్యా కోర్సుల ద్వారా విద్యార్థులు తమ కాళ్లపై తాము నిలబడడమే కాకుండా, మరొక నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతారని, ఈ అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. బుధవారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలోని 'పీఎంశ్రీ' జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ట్రైనర్ లావణ్య సౌజన్యంతో విద్యార్థులకు బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సుకు సంబంధించిన నోట్‌బుక్స్‌ను సర్పంచ్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు స్వయం ఉపాధిని అందిస్తాయని, ఎవరిపైనా ఆధారపడకుండా సమాజంలో స్వతంత్రంగా జీవించేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. చిన్న వయసులోనే ఇటువంటి సాంకేతిక,వృత్తి నైపుణ్యాలు అలవడడం వల్ల భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిన్నారం జ్యోతి నర్సింలు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ పాల్ సింగ్ ,ఒకేషనల్ ట్రైనర్ లావణ్య,ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## ఫోటో ఒక చరిత్ర, ఒక ఉద్యమం,ఒక భావోద్వేగం.

### - ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవంలో ఎంపీ రఘునందన్ రావు -ఫోటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు

గజ్వేల్:19 ఆగస్టు (ప్రజా కలం ప్రతినిధి) గజ్వేల్ పట్టణ కేంద్రంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు పాల్గొని ఫోటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ



రఘునందన్ రావు మాట్లాడుతూ ఫోటో గ్రాఫర్లు బ్లడ్ డోనేషన్ క్యాంపును ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఫోటోగ్రఫీ ప్రపంచ చరిత్రను భద్రపరిచే అద్భుతమైన సాధనమని అన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన జోసెఫ్ నిసెఫోర్ నీప్స్ 1826--27 ప్రాంతంలో తొలి శాశ్వత ఫోటోగ్రాఫిక్ చిత్రాన్ని రూపొందించారని, అనంతరం లూయిూ డాగేర్ అభివృద్ధి చేసిన ప్రక్రియతో ఫోటోగ్రఫీ మరింత విస్తృతంగా ప్రజల్లోకి వచ్చిందని తెలిపారు. ఒక ఫోటో వేల మాటలతో సమానమని, కొన్ని ఫోటోలు ప్రపంచాన్నే కదిలించే శక్తిని కలిగి ఉంటాయని అన్నారు. యుద్ధ ప్రాంతాల్లో సంవత్సరాల తరబడి పనిచేసిన ఫోటోగ్రాఫర్లు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అనేక హృదయ విదారక దృశ్యాలను ప్రపంచానికి చూపించారని గుర్తుచేశారు.

యుద్ధంలో చిన్నారి దుస్తులు కాలిపోతూ భయంతో పరుగులు తీస్తున్న దృశ్యాన్ని ఫోటోగ్రాఫర్ కెమెరాలో బంధించిన చిత్రం ప్రపంచ ప్రజల హృదయాలను కదిలించిందని అన్నారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమ సమయంలో ఫోటోగ్రాఫర్లు పోషించిన పాత్రను ప్రత్యేకంగా గుర్తుచేశారు. ఢిల్లీలో యాదిరెడ్డి ఆత్మత్యాగం, తెలంగాణలో యాదయ్య వంటి ఉద్యమకారుల ఆందోళనలను ఫోటోగ్రాఫర్లు తమ కెమెరాల్లో బంధించి ప్రజల ముందుకు తీసుకువచ్చారని చెప్పారు. ఆ ఫోటోలు ఉద్యమ భావోద్వేగాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి తెలంగాణ ఉద్యమానికి మరింత ఊపిరి పోశాయని పేర్కొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీలు, పోలీసుల దాడులు, బుల్లెట్ గాయాలతో విద్యార్థులు పడిపోతున్న దృశ్యాలను ఫోటోగ్రాఫర్లు ధైర్యంగా చిత్రీకరించి ప్రపంచానికి చూపించారని అన్నారు. ఆ ఫోటోలు ఉద్యమ చరిత్రలో శాశ్వత సాక్ష్యాలుగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఫోటో కేవలం ఒక చిత్రం మాత్రమే కాదని,అది ఒక కాలానికి సాక్ష్యం, ఒక సంఘటనకు ఆధారం, ఒక ఉద్యమానికి చరిత్ర అని రఘునందన్ రావు అన్నారు.

ఒక మంచి ఫోటో సమాజంలో సృజనాత్మకతను పెంచడంతో పాటు ప్రజల ఆలోచనలను మార్చగలదని తెలిపారు. గజ్వేల్ ప్రాంతంలోని ఫోటోగ్రాఫర్లకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఫోటోగ్రాఫర్ల




సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాదరావు, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, నాలుగో వార్డు కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, మూడో వార్డు కౌన్సిలర్ కామన్ మురళి, ఫోటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి బాకీ శ్రీనివాస్, కోశాధికారి అల్వాల యాదగిరి, సహాయ కార్యదర్శి బండారి మహేందర్, పలువురు సీనియర్ ఫోటోగ్రాఫర్లు, పాత్రికేయులు, వివిధ పార్టీల నాయకులు, పాల్గొన్నారు.



## పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్య విద్యార్థులకు వరం - సర్పంచ్ లక్ష్మి కొండయ్య

గజ్వేల్:19 ఆగష్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వృత్తి విద్యలో మెలకువలు నేర్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కొడకండ్ల గ్రామ సర్పంచ్ లక్ష్మి కొండయ్య అన్నారు.వృత్తి విద్యా కోర్సుల ద్వారా విద్యార్థులు తమ కాళ్లపై తాము నిలబడడమే కాకుండా, మరొక నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతారని, ఈ అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. బుధవారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలోని 'పీఎంశ్రీ' జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ట్రైనర్ లావణ్య సౌజన్యంతో విద్యార్థులకు బ్యూటీ అండ్ వెల్నెస్ కోర్సుకు సంబంధించిన నోట్‌బుక్స్‌ను సర్పంచ్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు స్వయం ఉపాధిని అందిస్తాయని, ఎవరిపైనా ఆధారపడకుండా సమాజంలో స్వతంత్రంగా జీవించేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. చిన్న వయసులోనే ఇటువంటి సాంకేతిక,వృత్తి నైపుణ్యాలు అలవడడం వల్ల భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిన్నారం జ్యోతి నర్సింలు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ పాల్ సింగ్ ,ఒకేషనల్ ట్రైనర్ లావణ్య,ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం

### ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..
### పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి
### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గద్దగుటి మహేందర్ ముదిరాజ్

మహేశ్వరం, ఆగస్టు 19,(ప్రజా కలం)

కార్యకర్తలే పార్టీ కి బలమని కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేసి, ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహేందర్ ముదిరాజ్ అన్నారు.ఈ సందర్భంగా మహేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, ప్రతి కార్యకర్తకు గౌరవం, ప్రతి నాయకుడికి బాధ్యత, ప్రతి స్థాయిలో సమన్వయం ఉంటేనే పార్టీ మరింత బలపడుతుందని అన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు, ప్రజల సమస్యలను నిరంతరం తెలునుకుంటూ వాటి పరిష్కారం కోసం ముందుండాలని సూచించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చేయాలని కోరారు.పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ నాయకులు, బ్లాక్, మండల అధ్యక్షులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరుల అభిప్రాయాలను నేరుగా తెలుసుకోవడం పార్టీ భవిష్యత్ సంస్థాగత నిర్మాణానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకత్వం కార్యకర్తల మధ్య సమన్వయం, ప్రజలతో నిరంతర అనుసంధానం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల విస్తరణ అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు.రాబోయే రోజుల్లో ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి బూత్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘటితమైన కాంగ్రెస్.. బలమైన కాంగ్రెస్.. ప్రజల కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేద్దామన్నారు.



## జీవో నెం. 97ను వెంటనే రద్దు చేయాలి

### - పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలి
### - ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదశి రాజేష్

మహేశ్వరం, ఆగస్టు 19, (ప్రజా కలం)

జీవో నెం. 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మహేశ్వరం నగర కార్యదశి రాజేష్ ఆధ్వర్యంలో సుమారు 400 మంది పాలిటెక్నిక్ విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. అంబేద్కర్ చౌరస్తా వద్ద విద్యార్థులతో ధర్నా నిర్వహించారు.పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం జరగాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ భారీ ర్యాలీ నిర్వహించాం. విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే జీవో నెం. 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి.విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలి. పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.విద్యార్థుల సమస్య పరిష్కారం అయ్యే వరకు ఏబీవీపీ ప్రజాస్వామ్య పద్ధతిలో మరిన్ని ఉద్యమ కార్యక్రమాలు చేపడుతుంది. విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుంది.ఈ కార్యక్రమంలో విద్యార్థులు నాయకులు అభిలాష్, చింటూ,ప్రాంతి,సాయికార్తిక్,రోహిత్, ఉదయ్,తదితరులు పాల్గొన్నారు.

